
ISSN No:2581-7477

# సాహిత్య ప్రస్థానం


Sahitya Prasthanam


సంపుటి - 1 సంచిక - 7 ఏప్రిల్ - 2020 కృష్ణా పేజీలు 68 వెల రూ. 20

## మానవ నేత్రం నిండా మరణ చిత్రాలే!
## ప్రకృతి చేసిన మహా హెచ్చరిక కరోనా!











సాహితీస్రవంతి

# విజయవాడలో మార్చి 15న జరిగిన భారత కవనం దృశ్యాలు



ప్రస్థానం సమగ్ర సాహిత్య పత్రిక

సంపాదకీయం

# తెలుగు మీడియం కూడా ఉండాల్సిందే!

కరోనా లాక్‌డౌన్‌లో అందరూ ఇంటికి పరిమితమై పోయిన సమయం.. కవులూ, గాయకులూ కూడా ఇళ్లలోంచే కరోనాపై పాటలు రాసి పాడి స్థైర్యం నింపుతున్న వేళ.. సమాజం, సమస్త ప్రపంచం ఆ మహమ్మారి గురించే చర్చిస్తున్న సమయం. సాహిత్య లోకం ఎప్పుడూ విమర్శిస్తున్న ప్రపంచీకరణ నిజస్వరూపం ప్రళయ సదృశంగా గోచరిస్తున్న వేళ.. సత్యం కళ్లకు కడుతున్న వేళ.. సాహిత్య ప్రస్థానం సంచిక మీ ఇళ్లకు చేరలేక ఇంటర్ నెట్ ద్వారానే అందించాల్సిన పరిస్థితి. కొంచెం ఆలస్యంగానైనా పంపుదామని చూసి చివరకు నెట్‌లోనే అప్‌లోడ్ చేయడం అనివార్యమైంది.

♦

తీవ్రమైన చర్యలు, అనివార్యమనే ఆలోచనలు మొదలవుతున్నప్పుడే మార్చి 15న విజయవాడలో భారత కవనం ముగించుకోవలసి వచ్చింది. తర్వాత వారం రోజులకే జనతా కర్ఫ్యూ, తర్వాత లాక్‌డౌన్ .. ఈ సమయంలో ప్రస్థానం రచయితలూ, పాఠకులూ కూడా అన్నిజాగ్రత్తలూ పాటించాలని ఆరోగ్యం కాపాడుకోవాలని బాధితులకు సహాయపడాలని కోరుతున్నాం. కార్యక్రమాలకు ఎలాగూ అవకాశం వుండదు గనక అధ్యయనం పెంచుకోవడం మంచి రచనలు చేయడం ఇప్పుడు జరగాల్సింది.

♦

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషుమీడియం మాత్రమే వుండేలా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన జీవోలు 81,85 హైకోర్టు కొట్టివేయడం హర్షణీయం. దీనిపై ప్రస్థానం ప్రత్యేక సంచికే వెలువరించడం గుర్తుంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవాలు గుర్తించి తెలుగు మీడియంను కూడా కొనసాగించాలని మరోసారి కోరుతున్నాం. ♦

సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
వొరప్రసాద్

సంపాదకవర్గం:
కె. సత్యరంజన్ ♦ చీకటి దివాకర్
గనారా ♦ శమంతకమణి ♦ కెంగార మోహన్
మేనేజర్: కె.లక్ష్మయ్య

బొమ్మలు:
తుంబలి శివాజి
చిదంబరం
గంగాధర్ వీర్ల

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akualvari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

ఈ సంచికలో ... **సాహిత్య ప్రస్థానం** ఏప్రిల్ 2020

## కథలు


ఫ్రైడ్ & ప్రహేళిక – చరణ్ పరిమి...................... 5
అన్వేషణ – గనారా...................................... 17
కొక్కొరొ కో – సింహప్రసాద్............................ 32
బుజ్జమ్మ పిల్లి – వంజరి రోహిణి........................ 41


## కవితలు


ఒంటరి నక్షత్రం – వైష్ణవిశ్రీ............................. 10
తిరగబడిన సముద్రం – చిత్తలూరి...................... 11
అమ్మ నానీలు – వెన్నెల సత్యం......................... 15
దేశం నడిబొడ్డులో – జనార్దన వల్లాభాపురం........... 16
ప్రవాహం – జంధ్యాల రఘుబాబు....................... 16
ప్రశ్న లేకుంటే? – ఎస్. రాంబాబు...................... 21
కదిలి రా! – శ్రీనివాస రాజు పెన్మెత్స................... 22
హమ్ దేఖేంగే – డా॥ ఎన్. గోపి ....................... 26
జంబూక ద్వీపం – డా॥ మాటూరి శ్రీనివాస్........... 27
నిరంతరం ప్రశ్నలం – చల్లగాలి బాబూరావు........... 30
అపర్కృత ఆర్జీ – దాకరపు బాబూరావు................. 31
ఆవిష్కరణ – కోవూరి శ్రీనివాసరావు.................... 31
ఇంకా...! – చెన్నా రామమూర్తి.......................... 40
చీకటి చెర – లక్ష్మీ కందిమళ్ళ........................... 40
మరణ వాంగ్మూలం – సురగౌని రామకృష్ణ............. 47
యుగపురుషుడు – ఎల్. వెంకటేశ్వర్లు.................. 51


## కరోనా కవితలు


కరోనా..కరోనా..(పాట) – తెలకపల్లి రవి.............. 54
దేవుడా..! నన్ను నేను తెలుసుకున్నాను! నీకు శెలవ్!
– డా॥ కత్తి పద్మారావు............................. 55
నీ చైతన్యమే నీకు పెద్దదిక్కు– శాంతినారాయణ....... 56
మహమ్మారి – భైరవ స్వర్ణకుమార్...................... 56
మనుగడ – డా॥ పి. విజయలక్ష్మి పండిట్.............. 57
మహా హెచ్చరిక – వొరప్రసాద్.......................... 57
కరోనా నృత్యం – సునీత ఆరిమిల్లి...................... 58
పున్నమి నానీలు – పున్నమి వెంకటయ్య................ 58
విలయంలో విషయం – నూనెల. శ్రీనివాసరావు...... 59
నాకేం కొత్తకాదు – కోడే యామినీ దేవి............... 59
మధ్య తరగతి మీసం – అమూల్యాచందు............. 60
విజేత – ములుగు లక్ష్మీమైథిలి........................... 60
గూడు చేరాలి – శాంతిశ్రీ................................ 61
మనోధైర్యం – చిట్టి మధు................................ 61
స్పందన – గిరిప్రసాద్ చెలమల్లు........................ 62
నిర్బంధ యుద్ధం – కొలిపాక శ్రీనివాస్................. 62
బాటసారి – శ్రీశ్రీ........................................... 63


## వ్యాసాలు


సాహిత్య ప్రస్థానం మార్చి 2020 పురస్కారాలు........ 11
ముళ్ళకంపలాంటి దుఃఖ కవిత్వం – బొల్లోజు బాబా.. 12
పల్లెదోసిట్లో మట్టిగంధం – జుజ్జూరి వేణుగోపాల్..... 23
పల్లె ప్రజల పలుకుబడులకు పట్టం కట్టిన కథలు
– పిళ్ళా విజయ్.................................... 28
రాయలసీమ కొత్తస్వరం – డా॥ నీలం వెంకటేశ్వర్లు.. 37
రవీంద్రుని అభిప్రాయాలు అనుసరణీయాలు
– ఆర్. లక్ష్మి....................................... 45
భారత కవనంలో లౌకిక స్వరాలు
– వొరప్రసాద్....................................... 48
కరోనా కఠోర ప్రశ్నలు – తెలకపల్లి రవి................ 52
స్వీకారం.............................................. 63



ISSN No: 2581 - 7477

**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:

సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002,
ఫోన్: 0866-2577248, సెల్: 9490099059

ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000/ ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

కథ



# ప్రైడ్ & ప్రహేళిక

- చరణ్ పరిమి
8985095040

ఎప్పటినుంచో సమాధానాలు దొరకని ప్రశ్నలకు ఒక్కసారిగా ఎలా దొరుకుతాయి? అది బోధివృక్షం కింద జ్ఞానోదయం లాంటిదే, కాకపోతే దానికి తపస్సులాంటి బృహత్కార్యం ఏదో చేయాలి. ఓ రకంగా ఇప్పుడు జరుగుతుంది అలాంటి కార్యమే.

"పెళ్లి పెట్టుకోండి, అందరం తలా ఓ చెయ్యేస్తే అయిపోతుంది" మా జోసెఫ్ మామ.

ఆయన కొడుకు చదువుకు ఇచ్చిన 50వేలు తిరిగి ఇస్తే చాలు అని నాన్న ఆశ.

అక్కకి పెళ్లి ప్రయత్నాలు 24లో మొదలెడితే 28కి పెళ్లి సెట్ అయింది. ఇంక ఆలస్యం చేయక, పనులన్నీ చకచకా మొదలుపెట్టేసాం. పెళ్లి పత్రిక తానే రాసి, ప్రింట్ చేయించుకొచ్చాడు నాన్న. వాటి పంపకాలకి మామ, పెదనాన్న, బాబాయిలు, వాళ్ల పిల్లలకు చెప్పి, మొదటి పత్రిక మేనమామ జోసెఫ్‌కి ఇచ్చి ప్రారంభించాలి.

"మాతో ఎందుకు? అన్నీ అయిపోయినాయిగా" మూతి ముడుచుకొన్నాడు. పెళ్లి పత్రిక సంగతే అని అర్థమైంది. మొదటిసారి కావడంతో ఏది ఎలా చేయాలో తెలియక తికమకగా ఉన్నాము. అయినా కార్డులో వీళ్లు చేయడానికి ఏముంది! అందరం సారీ చెప్పి బుజ్జగిస్తే కదిలాడు.

"మీకు దిగులెందుకు, పెళ్లి నేను చేసేస్తా కదా"

సంవత్సరం క్రితం మా ఇంటి ఆవరణంలో పెద్దలు చర్చి బాగోగులు మాట్లాడుతుండగా పెదనాన్న అన్నమాట. ఆరోజు నాన్నకు ఎంత ధైర్యం వచ్చిందో. తాతపొలం అమ్మిన డబ్బులు ఇద్దరికి రావాలిగా, అవి ఇచ్చినా అయిపోతుంది. పెదనాన్న దగ్గరకి అదే పనిమీద వెళ్లాను, ఆయన్ని అడిగే అంత చనువు నాకైతే లేదు. కట్నానికి రెండున్నర లక్షలు కావాలి, ఖర్చులకు ఇంకో రెండు.

"ఏరా కట్నం డబ్బులు ఇచ్చేసారా?"

అంటే తాను సర్దడా! అడిగినా లేదంటాడా. మనం ఊహించుకోవడం ఎందుకు అని అడిగేసా.

"వడ్డీలకు ఇచ్చాము కదా, మన చేతికి రావడం లేదు."

"లక్ష కాకున్నా ఒక 50 ఉంటే"

"పెళ్లి రోజు సెట్ చేస్తాగా"

సన్నివేశం మామ ఇంట్లో రిపీట్. ఒకే సన్నివేశం రెండు సార్లు జరుగుతుంది ఏంటి? అన్న సందేహం ఆ పూటకి రాలేదు. వచ్చి ఉంటే బాగుండేది.

ఓడలు బండ్లు అయినప్పుడు జీవనం ఎదురీత.

♦♦♦

మూడు లక్షలు అప్పు పుడుతుందా! అసలు ఎలా తీరుస్తాం. నాకు వణుకు పుట్టింది. నాన్న కొంచెం కూడా తొణకలేదు. అలా కావాలంటే ఎంతకాలం సాధన చేయాలి.

బాధ లేదా, ఉక్రోషం రావట్లేదా, పెళ్లి ఎలా చేస్తాను అన్న ఆందోళన లేదా? నాన్నకు విషయం చెప్పాను. రెండు నిమిషాల మౌనం, అదృష్టానికి శ్రద్ధాంజలి అనుకుంటా.

అలాగని పెళ్లి పనులు ఆపలేం, వారమే టైమ్ ఉంది.

చుట్టాలకి పెళ్లి పత్రిక ఇచ్చి ఆహ్వానించడానికి ఎర్రగొండపాలెం చుట్టుపక్కల నాలుగు మండలాల్లో తిరగాలి. ఎటువైపు వెళ్లినా 15 పల్లెటూర్లు ఉంటాయి. ఏ ఫంక్షన్ కైనా అమ్మానాన్న వెళ్లి రావడమే, దాంతో చుట్టాలకు మేము తెలియదు, మాకు వాళ్ళు తెలీదు. నాన్న దూరపు చుట్టాల ఇళ్లకు.. అంటే డిస్టెన్స్ లో, గుంటూరు, విజయవాడ, ఒంగోలు రౌండ్ వేసి వస్తారు.

"నేనూ మావాడు ఇద్దరం బిజీ, మీరు వెళ్ళి రండి, ఇక్కడ మిగతావి నేను చూసుకుంటా" బంధువర్గమంతా తెలిసిన జోసెఫ్ మామ.

చివరికి స్కూల్ ఫ్రెండ్ రమేష్ దొరికాడు. వరసకి బామ్మర్ది, పాలెంలో ప్రతి ఒక్కరితో మరొకరికి చుట్టరికం ఉంటుంది.

మా మొదటి గమ్యం పక్కనే ఉన్న త్రిపురాంతకం.

బైక్ మీద బయలుదేరాము "మా చుట్టాలు నీకెలా తెలుసు?"

"మీ పెదనాన్న కూతురు పెళ్ళికి చెప్పడానికి నేను కూడా వాళ్లతో పాటు వచ్చానులే, అలా తెలుసు." రమేష్.

"ఓహో"

"ఆ చివరి ఇంటిముందు కూర్చుందే ముసలమ్మ, వాళ్ళు మీ చుట్టాలే, పద"

ఏమని పిలవాలి? "అవ్వ బాగున్నావా?"

"అవ్వ కాదు నానమ్మ" సవరించాడు రమేష్.

అది మొదలు "ఆంటీ... బాబాయ్ ఇంట్లో ఉన్నారా"

"బాబాయ్ కాదు మామ, ఆమె ఆంటీ కాదు అత్త"

మా ఊర్లో ఆంటీ అంటే పిన్ని అని మాత్రమే

"బావా.. నీ కోసమే చూస్తున్నా"

"బావ కాదు అన్న"

"మామ గారూ"

"మామ కాదు పెదనాన్న"

"ఉష్, ఇంక నేను మాట్లాడను, నువ్వే పిలువు" వాడికో నమస్కారం పెట్టాను.

"పెళ్లి మీది, పిలుపు నాది, సరిపోయింది" అదో రకంగా నవ్వాడు.

"నువ్వు మా చిన్నోడు కొడుకు కదూ, రారా.. అన్నం తిందురు" కళ్ళ నిండా ఆనందం నింపుకొని పిలిచింది అవ్వ. ఈ ఊరు ఇలా పుట్టింది.. ఈ ఆచారం ఇలా పెరిగింది... ఊరికి ఈ పాలేనికి దూరం పెరగలేదు, తగ్గలేదు. ఇలాంటి సంగతులు ఎన్నో తెలిసేవి, చెరువుకి ఒక కథ, గుడికి ఒక కథ, చింతచెట్టుకి ఒక కథ ఉంటాయి, వినడానికి బాగుంటాయి. అలాంటి పలకరింపులు, సంగతులు ఖాళీ మనసుని పూలవనంలా మార్చాయి. కమ్మటి అనుభవాలతో యాత్ర ముగిసింది.

♦♦♦

పెళ్లికి ఒక్క రోజు ముందు పెళ్లి కూతురు ఇంట్లో ఫంక్షన్, ఇది ఓ రకంగా రిసెప్షన్, ఇంకోరకంగా స్తుతి కూటమి.

టెంటు, సరకులు, వంటవాళ్ళను మాట్లాడటం పూర్తయింది.

"భోజనాల సంగతి" అక్క

"మనదే పెడదామా" నాన్న

"దున్న కూర పెడితే ఎవరూ తినరు, చికెనే పెడదాం"

"అలాగని మన పద్ధతి మరిస్తే ఎలా, మనవాళ్లంతా అడుగుతారు, రెండూ పెడదాం, చేసేదేముంది." నాన్న.

"ఫంక్షన్ చర్చిలో పెడదామా" ఘనంగా జరగాలి అన్న తాపత్రయం నా ప్రతి మాటలో దొర్లుతూనే ఉంది.

"అలా పెడితే ఊర్లో జనాలు భోజనానికి ఇక్కడ కూర్చోరు" నాన్న.

"ఎక్కడ చేస్తాం?"

"గవర్నమెంట్ బంగ్లా పక్కన ప్లేస్ ఉంది, అక్కడ పెడదాం. ఈ పార్టీల వాళ్ళు, ఊర్లో వాళ్లు, అందరూ వచ్చి తింటారు" వాళ్ళ పర్మిషన్ అడిగివస్తానని నాన్న వెళ్ళగానే,

"ఏరా డబ్బులు సరిపోతున్నాయా" అడిగింది అక్క.

ఈ సంగతులన్నీ అక్కకు తెలిస్తే ఏమనుకుంటుందో! "పెళ్లి ఖర్చులకి రెండు లక్షలు ఉన్నాయి. కొద్ది కొద్దిగా అరేంజ్ అవుతున్నాయి"

"ఇంకా కొద్ది కొద్దిగా ఏంటి, ఎల్లుండే కదా పెళ్లి"

"ఆ టైంకి దొరికేస్తాయి" ఏదో చెప్పి తప్పించుకున్నాను గానీ నాకూ దడదడలాడుతుంది.

తను దీర్ఘాలోచన చేస్తోంది, నావల్లే వీళ్ళకి ఈ తిప్పలు

అనుకుంటుందో ఏమో, అప్పట్నుంచి ఆ మొహంలో నవ్వులు, తుళ్ళింతలు మాయమయ్యాయి. ఎక్కువ సమయం బెడ్రూమ్ లోనే ఉంటుంది. అనవసరంగా చెప్పాననుకుంటా, అప్పటి నుంచి తనని కనిపెట్టుకుని ఉండాల్సిన పరిస్థితి.

"పతానం పంచారా?" పాలెంలో జనాలు.

సంఘంలో ఉన్న ఆరుగురు పెద్ద మనుషులు పెళ్ళికొడుకు ఇంటి నుంచి వచ్చిన 'ముడుపు'ను విప్పి పాలెంలో అందరికీ పంచాలి. ఇది పెళ్లికి రెండు రోజుల ముందు జరిగే కార్యక్రమం.

మగ పెళ్లివాళ్ళు ముడుపు పంపలేదు. వాళ్లకి తాంబూలం పద్ధతి లేదట. ఒకే కులానికి రెండు రకాల పద్ధతులు ఏంటో!

ఇప్పుడు ఏం చేయాలో నాకర్థం కాలేదు, ముడుపు లేదంటే జనం నవ్వుతారు.

నాన్న వెళ్లి ముడుపుకు కావలసిన తమలపాకులు, వక్కలు, కలకండ, ఎండు ఖర్జూరాలు వగైరా వగైరా కొనుక్కొచ్చి, వాటికో జాకెట్ ముక్క కలిపి "ముడుపు వచ్చేసింది అందరికీ చెప్పు రా పో" అన్నాడు.

మొదటిసారి రాకెట్ లాంచింగ్ చూసిన వాడిలా ఆశ్చర్యం, సంభ్రమం కలిపి చూశాను.

కట్టుబాటు, వాటిమీద ఇష్టంతో కాకుండా పరువు కోసం చేయాల్సిన సందర్భం ఇది. ఇవి లేకుండా పెళ్ళిళ్ళు పేరంటాలు అవుతాయి కదా!

మొత్తం వేయి గడపలు తిరగాలి. అన్నలు, తమ్ముళ్లకు ఫోన్ చేసి చెప్పాను, ఎవరూ రాలేదు? మళ్లీ రమేష్ గాడే ఇంకో ఇద్దరు ఫ్రెండ్స్ ని పట్టుకొచ్చాడు. చివరి వీధిలో ఉండగా

అవతలి వీధి నుంచి మాటలు.

''మమ్మల్ని తిప్పడానికి, చెప్పడానికి మాత్రమే వాడుకుంటారు. సంబరాలు మీవి ఇస్తరాకులు మావి" గట్టిగా అరుస్తున్నాడు పెదనాన్న కొడుకు.

పిలిస్తే పని చేయించుకున్నారు అంటారు. పిలవకపోతే మర్యాద ఇవ్వలేదు అంటారు. ఏం చేయాలో అర్థంకాక జుట్టు పీక్కున్నాను.

"ముడుపు తీసుకొని ఎవరొచ్చారు?" ఆరాలు.

"ఏమో, నాకేం తెలుసు" అని తప్పించుకుంటున్నా.

ముడుపుతో పెళ్ళికొడుకు మేనమామ కుటుంబం రావాలి. వాళ్లకు అతిధి మర్యాదలు చేస్తే మన విలువ పెరుగుతుంది, ఇప్పుడు అవకాశం లేదు.

కార్యక్రమానికి రానివాళ్ల ఇళ్లకు వెళ్లి తాంబూలాలిచ్చి వచ్చాం. సవ్యంగా ముగిసిందనుకుంటే... మధ్యాహ్నం మూడింటికి ఎవరో తాగి ఇంటిముందు కేకలు "అసలు మేము సంఘంలో లేమనుకున్నారా? మేము మనుషులం కదా?"

ఇలాంటివి చిన్నప్పట్నుంచి చూస్తూనే ఉన్నా "తొమ్మిది రూపాయల తాంబూలం ఇవ్వకపోతే ఎంత గొడవ!" నాన్నతో అన్నాను.

"ఎవర్రా తాంబూలం ఇచ్చి వచ్చింది, సరిగ్గా చూసుకునే పనిలేదా? ఒక్కడికీ తెలివి లేదు'' పనులన్నీ తానే చూసుకుంటానన్న మామ.

"తాంబూలం కుటుంబాన్ని గుర్తించడం. సంఘంలో సభ్యత్వం జనాన్ని ఏకతాటిపై ఉంచే సాధనం. బజారుకెళ్లి తాంబూలం తీసుకుని రా" నాన్న. అతనిది సంప్రదాయానికి ఇచ్చే విలువా?, గుర్తింపు కోసం ఆరాటమా?

♦♦♦

పత్రికలో వేసినట్టే నవంబర్ 23- 2019న, అంటే ఈ రోజే ఇంట్లో ఫంక్షన్. ఉన్న కాస్త పైసలు ఈ కార్యక్రమాల్లో కరిగిపోతున్నాయి. ఫంక్షన్ అంటే వధువును ఒక సింహాసనం లాంటి కుర్చీలో కూర్చోబెట్టి, గంటలు గంటలు ఉపన్యాసాలు ఇవ్వటం.

పాస్టర్ రెవరెండ్ స్టీఫెన్ గారు ఎప్పుడు ప్రారంభిద్దామా అని చూస్తున్నాడు. వచ్చి ఫ్లెక్స్ చూశాడు "ఏంటది?" అన్నాడు సీరియస్ గా.

ఇంకో తప్పు చేసినట్టు ఉన్నాం, లోపల ఆరోసారి కలుక్కుమంది.

"అమ్మాయి పేరు కింద ఉంది, పైన ఉండాలి కదా, ఫంక్షన్ చేస్తుంది ఆడపెళ్ళి వారే కదా?"

అంత జ్ఞానం లేదని ఒప్పేసుకోవడంతో వదిలేశారు.

డబ్బులు అడుగుదామంటే జోసెఫ్ మామ సింగిల్ గా దొరకట్లేదు, ఈ రోజే ఆఖరు, రేపు పెళ్లి.

వధువు కుటుంబనికి మేనమామ కొత్త చెప్పులు బహుకరించాలి. మామ రాకపోవడంతో నాన్న ఫోన్ చేసి చెప్పారు. పనిలో పనిగా డబ్బుల విషయం ప్రస్తావించారు.

"ఇప్పటికప్పుడు ఎక్కడి నుంచి వస్తాయి, బుద్ధి లేకుండా అడుగుతారు."

నెత్తిమీద అణుబాంబు పడ్డట్టు అయింది. మినుకు మినుకు మన్న చివరి ఆశ కూడా ఆరిపోయింది. నాన్న మొహం

పొలిపోయింది. అసలు లేదు, కొసరూ లేదు. అందరం చేష్టలుడిగి పోయాం. ఇప్పుడు ఏమిటి చేయడం?

"సరే, సాంప్రదాయం ప్రకారం బుట్టలో చెప్పులు పెట్టుకొని వస్తున్నారా? జరిగేవి జరగాలిగా" నాన్న.

"సరే" ఫోన్ పెట్టేసాడు.

రెండు గంటల పాటు ఎదురుచూసినా రాలేదు, నాన్న నన్ను పంపించాడు.

"బాట షోరూమ్‌లో మాట్లాడి పెట్టాను, వెళ్లి తెచ్చుకోండి" అన్నాడు.

"సంప్రదాయం ప్రకారం మీరు తీసుకురావల్సినది, మేము కొనుక్కోలేక కాదు" మొహం మీదనే అని వెనక్కు వచ్చేసాను. నిన్నటి దాకా బానే ఉన్న మామ ఉన్నట్టుండి ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో అర్థం కాలేదు. బయట కోలాహలం, నా లోపల నిశ్శబ్దం, చుట్టూతా బంధువర్గం, ఎదురుగా నిర్జన మార్గం.

ఆ తతంగాన్ని మరొకరితో మమ అనిపించాము.

ఎవరి నుంచి డబ్బులు ఆశించని నాన్న, చదివింపులు ఎంతో కొంత వస్తే బాగుంటుంది అని ఆలోచించడం మొదలు పెట్టాడు. భోజనం చేశాక చదివింపులు కట్టడం అంటే బిల్లు కట్టడమే కదా, ఈ పద్ధతి మీద నాకైతే సదభిప్రాయం లేదు.

కానీ తప్పని ఆశ. నాలో ఏమి మారింది? నాకే సమాధానం లేని ప్రశ్న.

చూస్తే జనం పెద్దగా వచ్చేటట్టు లేరు, ఇక డబ్బులు ఏం వస్తాయి.

సింహాసనం మీద కూర్చున్న అక్క పిలిచింది "మామ వాళ్లు ఎందుకు రాలేదు?" వట్టి చేతులు చూపించాను, నా కళ్ళలోని నీటి పొర అక్క కళ్ళ నుంచి దూకింది.

"అందరూ వచ్చారా!"

"బాబాయ్ వాళ్ళు రాలేదు"

"ఎందుకు?"

"తెలీదు"

నేరుగా వెళ్ళి అడిగాను, "మమ్మల్ని రావొద్దు అన్నారుగా అన్నాడు" మాన్షన్ హౌస్ వాసన గుప్పుమంటుంది.

"ఎవరన్నారు?"

"మీరే, తాగి తిరగద్దు అన్నారుగా, మేము తాగుబోతులం" ఏం చెప్పాలో అర్థం కాలేదు, బతిమాలాను, ఆయన ఇస్తానన్న 25వేల గురించి కూడా అడగలేదు, అయినా ఫలితం లేదు.

"ఏమైంది వీళ్ళందరికీ! ఊర్ల నుంచి కూడా దూరపు చుట్టాలు వస్తున్నారు, దగ్గరి వాళ్ళే రావట్లేదు.

అక్క కూడా మాతో పాటు సంఘర్షణ పడుతూనే ఉంది. ఏ వధువుకు లేని సంఘర్షణ. ఇంతమందిలో నవ్వును నటించడం కష్టం, అది గంటలకొద్దీ అయితే!

ఆహుతుల చూపు తన మీదే, చిన్న విషయాలకి కంటనీరు పెట్టుకునే తను, ఇప్పుడలా చేస్తే నలుగురు మరోరకంగా అనుకోవచ్చు, "దార్లో ఎదురయ్యే పాముల్లా హఠాత్తుగా వచ్చే సమస్యలు ఇవి" నాకు లేని ధైర్యాన్ని తనకు నూరిపోశాను.

జనాలందరికీ ఉత్సాహం నింపే ఘట్టం తరలింపు. పెళ్లి కూతురుని మేళతాళాలతో పొలిమేరకు తీసుకువెళ్లి, తీసుకురావడం. సాంప్రదాయ తప్పెట కొట్టేవాళ్ళు ముసలివాళ్ళయ్యారు. పాలెంలో వేరే ఎవరు అది చేయటం లేదు. ఐదుగురిలో ముగ్గురు వచ్చి దరువు ప్రారంభించారు. నాగిని డాన్స్ నుంచి తీన్మార్ దాకా హుషారైన చిందులతో ఈ తతంగం ఉత్సాహంగా సాగింది. కావడి నీళ్లు పెళ్లికూతురు చేతిలో పోయడం అయ్యాక నాన్నను అడిగా "ఇప్పుడంటే కొన్ని హిందూ, క్రిస్టియన్ మతం ఆచారాల మిక్సింగ్‌తో చేస్తున్నారు. ఆ రోజుల్లో మన పెళ్లి ఎలా అయ్యేది?"

"నిజమేరా నాకు కూడా తట్టలేదు?"

పక్కనున్న పెద్దమనుషులని అడిగారు, వాళ్ళు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

"అవును, ఎలా?" ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు. ఎవరికి సమాధానం దొరకలేదు. అందర్లోకి వయసులో పెద్ద అయిన జార్జ్ గారు "నాకు ఊహ తెలిసినప్పటి నుంచి పెళ్లి ఈ పద్ధతిలోనే జరుగుతుంది. బ్రిటిష్ వాళ్ళు రాక ముందు అంటావా? బహుశా రెండు కుటుంబాల పెద్దలు మాట్లాడి, చేతులు కలుపుకొని, చెరొక తాంబూలం వేసుకుని పెళ్లి అయిపోయింది అనుకునే వాళ్లేమో, ఈ వాక్యాలు, మంత్రాలు ఏమీ లేవు. అప్పుడు దేవుడు కూడా గ్రామ దేవతలు, పెద్దల సమక్షంలో పసుపుతాడు కట్టడమే పెళ్లి."

"రిజిస్టర్ ఆఫీసుల్లో జరగడం లేదూ, ఇద్దరు కలిసి ఉండటానికి అంతకన్నా ఏమీ అక్కర్లేదు." నాన్న.

ఘనంగా పెళ్లి చేస్తూ అలాంటి మాట అన్నాడు, ఆయన మనసులో ఏముంది? ఆలోచనలో పడ్డాను. తరలింపు ఎందుకు? ముడుపు ఎందుకు?

♦♦♦

గుంటూరు కేథలిక్ చర్చిలో పెళ్లి.

పెళ్లి వారందర్నీ తెల్లవారుజామున పంపించి, నేను కాస్త ఆలస్యంగా బయలుదేరాను. ప్రయాణం నాలుగు గంటలు పడుతుంది, దారి మధ్యలో వర్షం మొదలైంది... చ, అన్ని తిప్పలకి ప్రకృతి కూడా తోడైంది. వినుకొండ దాటాను, గుంటూరులో కూడా వర్షంపడుతూ ఉండొచ్చా. పెళ్లి రోజు వర్షం పడితే ఫంక్షన్ రసాభాస అవుతుంది.

"పెళ్లికూతురు ఎసరులో ఉన్న బియ్యం తింటే ఇలా అవుతుంద"ని పెద్దవాళ్లు దెప్పి పొడుస్తారు, అది వాళ్లకు నవ్వులాట. పెళ్లికొడుకు పానీపూరీ తింటే, అనొచ్చుగా.

మధ్యాహ్నం రెండింటికి చేరుకున్నాను.

"చివరిగా వచ్చి అందరినీ కసురుకున్నాడు మామ. దాంతో నాన్న ఆయన్ని డబ్బులు అడిగే సాహసం చేయలేదు.

మిగతా అందరూ చేతులెత్తేసారు, చివరి నిమిషంలో... లేదంటే.. చేసేదేమీ లేదుగా.

ఇప్పుడు ఏం చేయాలి? నాన్న మీద కోపంగా ఉంది. అలా ఎలా ఉంటాడు. నాకు తెలిసి, రెండున్నర లక్షలకి లక్షా పన్నెండు వేలు తక్కువ అయింది. అడుగుదామంటే నాన్న స్టేజ్ దగ్గర బిజీ, పక్కకు లాక్కెళ్లి అడిగాను.

తన చేతిలోని సంచిని ఎదురుగా పెట్టి "ఇందులో కొంత ఉన్నాయి, అబ్బాయి వాళ్ళ నాన్న...ఈ హడావిడిలో ఎందుకు, కాసేపాగి ఇవ్వమన్నారు. మన మీద గట్టి నమ్మకం పెట్టుకున్నారు"

"తర్వాతయినా ఇవ్వాలిగా, లేదంటే ఊరుకోరుగా"

నాన్న ఎప్పటిలాగే ప్రశాంతంగా మొదలుపెట్టాడు " ఇంకా కావ్వాల్సింది 22800"

"మిగతావి?"

"చెప్తాను, మగపెళ్లి వాళ్ళు మనకు ఓలి పదివేలు ఇవ్వాలి, అవి ఇందులో కట్ చేద్దాం. ముడుపు మొత్తం మనమే తెచ్చుకొన్నాము. దానికి ఎనిమిది వేలు అయింది. పెళ్లి వెహికల్స్ ఖర్చులో సగం వాటా వాళ్లు వేయాలి, అవి నాలుగు వేలు"

తల గిర్రున తిరిగింది. 22వేలు మాఫీ!!

"ఇలా జరుగుతుందని తెలిసే కామ్ గా ఉన్నావా?"

నాన్న స్వామిజీలా ఒక నవ్వు నవ్వాడు, అందులో విషాదమే కనిపించింది.

"800 తక్కువ అయింది" నాన్న.

ఈ కొద్దిగా ఎవరినైనా అడిగితే బాగోదు, ఘనంగా పెళ్లి చేస్తూ చిల్లర ఆడుక్కున్నట్టు ఉంటుంది.

మేము ఏమి మాట్లాడుకుంటున్నామో వినడానికి అన్నట్లు మాటిమాటికి వచ్చి పోతున్నాడు జోసెఫ్ మామ. అడిగితే ఇస్తాడు, కానీ అడిగే ఉద్దేశం నాకు లేదు.

'డబ్బులు లేక ఇంత పెళ్లి చేస్తున్నారా! ఉండే ఉంటాయి, తన దగ్గర గుంజడానికి ప్లాన్ చేశారు' అనేది ఆయన ఉద్దేశం.

రమేష్ కి ఫోన్ చేశాను. ఇందాక వర్షంలో చెప్పులు తెగిపోవడంతో డబ్బులు ఇచ్చి పంపించాను. చెప్పులు రిటర్న్ ఇచ్చి డబ్బులు తీసుకొని వచ్చేసాడు. అవి నాన్న చేతిలో పెట్టాను. పెళ్లివాళ్ళ చుట్టాలు మమ్మల్ని భోజనాన్ని పిలుస్తున్నారు, అప్పుడే భోజనాలా!? అసలేం జరుగుతుందో అర్థం కాలేదు "మరి మిగతా 97వేలు ఎలా? పెళ్ళికి ముందు ఇచ్చేయాలి కదా!" నాలో ఆత్రం థర్మమీటర్ మీద నెంబర్ పెరిగినట్టు పెరుగుతుంది.

నాన్న అదే చిద్విలాసంతో కొనసాగించాడు "నిన్నటి చదివింపులు యాభైవేలు, ఈరోజు చదివింపులు 47200,

ఆడపిల్ల పెళ్లికి ఇంత రావడం గొప్ప" ఆయన కళ్లల్లో తేమ, అప్పుడు గమనించాను, కళ్ళు బాగా ఎర్రగా ఉన్నాయి. ఈ ఆలోచన మూడు రోజుల నిద్రనీ తినేసి ఉంటుంది.

"ఈ రోజు చదివింపులా! అంటే పెళ్లి" అర్థోక్తిలో ఆగాను. "నువ్వు వచ్చే ముందే అయిపోయింది" ప్రపంచాన్ని మ్యూట్ చేసినట్టు అనిపించింది.

ఆయన చేతిలో ఉన్న సంచి తీసుకువెళ్లి పెళ్లి కొడుకు నాన్న చేతిలో పెట్టాడు. హాల్ నిండా చుట్టాలు, బంధువులు అక్కడ వాళ్ళు అక్కడినుంచి చూస్తున్నారు, మా మామ తో సహా.

ఊపిరాడని వాడికి ఆక్సిజన్ అందించినట్టు అనిపించింది. మీద పడే ఉల్క నుంచి తప్పించుకున్నట్లు, దిటవు గుండెలతో మనసులో చిరు నవ్వులు చిందించాడు నాన్న.

"దేవరమే దీవెనలు" పాట. పెళ్ళి తతంగం పూర్తిగా అయిపోయింది.

ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన ఆనందకర దృశ్యం చూడలేకపోయాను. ఈ లోటు మనసులో ఎప్పటికీ పూర్తి కాదు.

## కవిత



# ఒంటరి నక్షత్రం

- వైష్ణవి శ్రీ
8074210263

*ఆమె ఒంటి నిండా గాయాలే*
*ఆ గాయాలకు పూలు పూసేదెప్పుడో*
*రాలిన కొమ్మల దేహాలకు ఓదార్పు లేపనాలు*
*పూసి పూసి అలసిపోయింది*
*అనాదికాలం నుంచీ తనలో తాను*
*వెతుక్కుంటూనే ఉంది*
*ఎప్పటికి దొరికేనో చిరునామా*

*శ్రీదేవి భూదేవంటూ*
*కాగితాల నిండా గుక్కతిప్పుకోలేని*
*పొగడ్తల జాబితాలు ఆవిరై*
*గుండెను కుంపటి చేస్తున్నాయి*
*పగిలిన గుండె ముక్కల్లో దేశమిప్పుడు తన ముఖాన్ని*
*చూసుకుంటోంది*
*రక్తసిక్తమైన తన దేహాన్ని చూడలేక*
*మరో గాంధారిలా విలపిస్తోంది*
*నీకు తెలియదనుకుంటా*
*వాళ్ళెప్పుడూ ఆకాశంలో సగమే*
*సూర్యచంద్రుళ్ళకు దారిచూపే వాళ్లకు*
*అలుపు సొలుపెక్కడిది*
*అనాది నుంచీ అన్యాయాలకు బలైపోతున్నా*
*బలమైన బంధాలకు ప్రతీకగా*
*వాళ్ళెప్పుడూ తలెత్తే బతుకుతున్నారు*
*ఆకాశమంత ఎత్తుకు ఎగబాకుతునే ఉన్నారు*
*ఆత్మవిశ్వాసాన్ని శ్వాసించె ఆమె*
*లేకుంటే మనకు జన్మనిచ్చేదెవ్వరు*
*అయినా ఓరిమిని భూషణంగా ధరించిన ఆమెకు ఓదార్పు*
*సైతం ఆమడ దూరమే*

*నిత్యం కన్నీటి స్నానం చేసే ఆమె*
*ఆత్మాభిమానాల ఊబిలో కూరుకుపోయి*
*అవమాన సముద్రాలను నెత్తిన మోస్తున్నా*
*తీరని దాహమేమో ఆమెది*
*తరతరాలుగా ప్రేమే ఆమె తరగని ఆస్తి*

*ఆమెనెవరో పిలిచినట్టున్నారు*
*ఇప్పుడే ఒక నక్షత్రం నేల రాలింది*
*నువ్వేమైనా చూశావా!!* ♦

---

కష్టం తీరిందన్న ఆనందాన్ని, పెళ్లి చూడలేకపోయిన బాధ కప్పేసింది. ఒక్కసారిగా నీరసం వచ్చేసింది. అక్క వైపు చూశాను, ఏం జరిగిందో, ఎలా జరిగిందో అర్థం కాక ఆమె మోహంలో ఎన్నెన్నో ప్రశ్నలు, సందేహాలు.

పెళ్లి మొదలైనప్పటి నుంచి అక్క నా గురించి అడుగుతూనే ఉందట. చర్చి గుమ్మం దగ్గర కూర్చున్నాను.

అక్క ఫోటో దిగటానికి పిలిపించింది

"ఎక్కడికెళ్లావ్?"నన్ను పట్టుకొని కన్నీళ్లు పెట్టుకుంది.

"ఆ చివరలో ఉన్నాను"

"బాగా జరిగినట్లేనా?"

నేను చూస్తేగా "చాలా బాగా"

సినిమాల్లో చూపించినట్లు ఆనందడోలికల్లో తేలుతూ గడుస్తుంది అనుకున్నా, కనీసం చూపులకే నోచుకోలేక పోయాను. అతిథులు ఒక్కొక్కరే వెనుదిరిగారు. ఒక్కసారి వెనక్కి తిరిగి ఈ బృహత్కార్యాన్ని ఎలా గట్టెక్కించామో తరచి చూస్తే... ఒకవేళ ఈ డబ్బులు అందకుంటే, ఇంతమంది జనానికి మా మీద ప్రేమ లేకుంటే ఏమై ఉండేది. ఉపద్రవాలకి నాన్న సిద్ధపడే ఉన్నాడా! గుండె నిబ్బరం, బాధ, ఆయన లోపల ఏముందో ఎవరు కనిపెట్టారు!

హితులు, సంస్కృతుల మధ్య వైరుధ్యాలను విసిరే ప్రశ్నలు. ఈ పెళ్లిలో మార్చుకున్న పద్ధతులు ఎన్నో, కలిపి నడిపిన కట్టుబాట్లు అన్ని. నలుగురు కలవాలంటే ఆమాత్రం కట్టుబాటు కావాలా? లేకుంటే కలవరా? మరి విసర్జించి తప్పుకునే వాళ్ల సంగతి? కార్యకారణ సంబంధాలను తరచి చూపించింది ఈ ప్రహేళిక. ♦

## పురస్కారాలు

### సాహిత్య ప్రస్థానం మార్చి 2020 పురస్కారాలు

**నీకు నాకు ఒకటే దారి**
కవితకు : రూ.500/-
రచయిత: అవ్వారు శ్రీధర్‌బాబు

**చదువులు బాబోయ్ చదువులు**
కథకి : రూ. 500/-
రచయిత : అయ్యగారి సీతారత్నం

■■■

*కవితకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం,*
*కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*
**- ఎడిటర్**

**కవిత**

## తిరగబడిన సముద్రం

- చిత్తలూరి
8247432521

సముద్రాన్ని ఎంతకని అదిలిస్తావ్
సముద్రమేమైనా కుక్క పిల్లా
నీ దొడ్లో కట్టేసుకోవటానికి

నిన్ను నమ్మినంత కాలం సముద్రం
విశ్వాసంగానే పడి వుంటుంది
ప్రశాంతంగానే వుంటుంది



సహనం సన్నగిల్లాక
నువ్వు నడి వీధిలో
సుడిగుండాలు సృష్టించాక
అల్పపీడనాలు దట్టించాక
అగ్నిపర్వతాలను ముట్టించాక
ఆనవాల్లు చెప్పమంటూ
సముద్రాన్నే నిలదీశాక
సముద్రాన్నే దారిమళ్లించే
కుట్రలేవో రచించాక
సముద్రం సహిస్తుందా?

అందుకే నీ ఆధిపత్యపు వీధుల్లోకి
ఉవ్వెత్తున ఎగసిన యువతరంగాలతో
పోటెత్తుతోంది సముద్రం

కూడళ్లల్లో జల విస్ఫోటనమై
చెలరేగుతోంది సముద్రం
నీ పీఠం కిందికి
పోరెత్తిన అలల హోరు ప్రవేశిస్తుందిక
ఆనవాళ్లడుగుతున్న
నీ ఆనవాళ్లే దగ్గర పడే రోజులు


నీ అధికార పీఠం వేర్పాటువాద మదాన్ని
తలకిందులు చేసే పెద్ద పెద్ద పోరాట అలలతో
సముద్రం తిరగబడుతోంది

ఇక సముద్రానికి అందకుండా
నువ్వు పరుగెత్తే రోజులు
ఎంతో దూరంలో లేవు


నిన్ను నీ సామ్రాజ్యాన్ని
జలసమాధి చేసేంత వరకు
ఇవాళ వీధుల్లో పోటెత్తిన ఈ సముద్రం
నిన్ను దేశం చివరిదాకా తరిమేసే
పోరాట ఉప్పెనవుతుంది

ఇక అదిలించటం
సముద్రం వంతయింది
ఇక నువ్వు పరుగెత్తటమే తరువాయి! ♦

విశ్లేషణ




అద్దేపల్లి ప్రభు



# ముళ్లకంపలాంటి దుఃఖ కవిత్వం

- బొల్లోజు బాబా
8639481826

అద్దేపల్లి ప్రభు కథకునిగా, కవిగా, వక్తగా అందరకూ తెలిసిన వ్యక్తి. ఇంతవరకూ 'ఆవాహన', 'పారిపోలేం' అనే రెండు కవిత్వ సంపుటాలను వెలువరించారు. జిల్లాలోని చారిత్రిక ప్రదేశాలను తిరిగినపుడు కలిగిన అనుభూతులను "పర్యావరణ ప్రయాణాలు" పేరుతో చిన్న బులిటన్గా తీసుకువచ్చారు. ఇది ఇంతవరకూ కవిగా ప్రభు కవిత్వ ప్రయాణం.

ఇటీవల విడుదల చేసిన కవిత్వ సంపుటి పేరు "దుఃఖపు ఎరుక'. గొప్ప శీర్షిక ఇది. మానవ దుఃఖాన్ని ఆవిష్కరించటం సాహిత్యంచేసే అతి ప్రధానమైన పని. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుస్తకాలలో మానవ దుఃఖమే ప్రధాన ఇతివృత్తంగా ఉండటం గమనించ వచ్చు. దుఃఖపు ఎరుక అంటే దుఃఖం గురించిన జ్ఞానం.

ఏది మనకు దుఃఖాన్ని కలిగిస్తుందో చాలామంది గుర్తించ లేరు. చార్లెస్బుకొవ్స్కి రోజూ తాగివచ్చి తన తల్లిని చితకబాదే తండ్రి గురించి వ్రాసిన ఒక కవితలో ఇలా అంటాడు

***మా నాన్న మాత్రం తన ఆరున్నర అడుగుల దేహంతో ఊగిపోతూ***
***మా అమ్మను, నన్నూ విపరీతంగా కొట్టేవాడు***
***ఎందుకంటే***
***ఎవరు అతన్ని లోపలనుంచి హింసిస్తున్నారో***
***అతనికి అర్ధమయ్యేది కాదు.***

అతనిని ఏది హింసిస్తుందో లేక దుఃఖపెడుతుందో చాలామందికి తెలియకపోవచ్చు. కానీ ఒక కవి లేదా తత్వవేత్తా ఈ దుఃఖాన్ని గుర్తిస్తాడు. దాని గురించి విముక్తమవటానికి మార్గాలు అన్వేషిస్తాడు. దుఃఖమూలాలు కొరకు తన లోపలా, తనకు వెలుపలా ఉండే ప్రపంచాలను అన్వేషిస్తాడు. తనుపొందిన "దుఃఖపుఎరుక" ఆధారంగా ఇదిగో ఇక్కడనుంచి మానవదుఃఖం ఊరుతుంది అని కొన్ని ప్రతిపాదనలను మనముందుంచుతాడు. ఈ అన్వేషణ గమ్యం అందరికీ ఒక్కటే అవ్వాలని లేదు. ఒకనికి దుఃఖమూలాలు రాజకీయాలలోనో, నాగరికతలోనో కనిపించవచ్చు, మరొకనికి మానవ సంబంధాలలో కనిపించవచ్చు, ఇంకొకరికి ఆర్థికవ్యవస్థలో కనిపించవచ్చు లేదా భక్తిరాహిత్యంలో కనిపించవచ్చు. దుఃఖమూలాలు ఎక్కడ ఉన్నాయి అనే అన్వేషణ నిరంతరం కొనసాగే ఒక ప్రక్రియ. ఎవరి అనుభవం వారిది, ఎవరి దుఃఖపు ఎరుక వానిదే.

***నిజానికి దుఃఖాన్ని గుర్తించటం కష్టం***
***నవ్వేపెదాల వెనుక ముళ్లకంపలాంటి దుఃఖం***
***అలా గీరుతూనే ఉంటుంది (దుఃఖపుఎరుక)*** అంటూ ప్రభు దుఃఖ స్వరూపాన్ని కళ్ళకు కడుతున్నాడు.

"దుఃఖపుఎరుక" పుస్తకంలో ప్రభు చాలా కవితలలో మానవదుఃఖానికి కారణం పర్యావరణ విధ్వంసం అని చెపుతున్నాడు. అభివృద్ధి పేరుతో ప్రకృతిని నాశనం చేయటం దుఃఖదాయకం అంటున్నాడు.

***చెట్టంత మనిషి లేడు***

*డబ్బంత మనిషి*
*ప్రకృతిలో కాలుష్యంగా వ్యాపిస్తున్నాడు*

*చెప్పు ఈ వ్యయనామ సంవత్సరంలో*
*ఎన్ని కొండల్ని వ్యయం చేసి*
*ఎన్ని డబ్బుల కొండల్ని చేద్దాం*

*ఎన్ని నదుల్ని పొట్లాలు కట్టి*
*ఎన్ని రూపాయిల మూటలు కడదాం*
*ఎన్ని పిట్టలకు మందు పెట్టి*
*ఎన్ని కట్టలతో చిందులేద్దాం*

*ప్రకృతి మనకు అన్నీ ఇచ్చింది*
*అందుకు ప్రణమిల్లాలి*
*మనం ప్రకృతికి ఏమీ యివ్వలేదు*
*కనీసం రాబందుకొక కళేబరాన్ని కూడా (ఆదికి ముందు).* ప్రకృతిని కలుషితం చేయటం, కొండల్ని, నదుల్ని అమ్ముకొని సొమ్ముచేసుకోవటం ద్వారా ఆధునిక మనిషి చేస్తున్న విధ్వంసాన్ని కళ్ళకు కడుతున్నాడు. మనకు ఎన్నో ఇచ్చే ప్రకృతికి కనీసం ఒక కళేబరాన్ని కూడా ఇవ్వటం లేదు అనటం ద్వారా మొత్తం కవితావస్తువును పరాకాష్టకు తీసుకెళతాడు ప్రభు. మనిషి చేస్తున్న వినాశక చర్యలవల్ల ఈ రోజు రాబందులు ఎండేంజర్డ్ కేటగిరీలోకి చేరాయి.

ఓ పదేళ్ళ క్రితం కోస్తా కారిడార్ పేరిట తీరప్రాంతంలో పారిశ్రామిక జోన్‌ను ఏర్పాటు చేసారు. దీనివల్ల పచ్చన ప్రకృతి నాశనం అవుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరించారు. ఆ నేపథ్యంలోంచి వ్రాసిన కారిడార్ అనే కవిత కోస్తా కారిడార్ పేరిట భూములు లాక్కోవటాన్ని, కాలుష్యాన్ని కలిగించే పరిశ్రమలు స్థాపించటాన్ని ప్రశ్నిస్తుంది.

*అటు సముద్రానికీ*
*ఇటు కనుమలకీ మధ్య*
*ఉక్కపోత లాంటి సరళ రేఖ.*

*ఏ అలా పర్వతమోలె ఎగియదు*
*ఏ పర్వతమూ అలవోలె విరగదు*

*మధ్య ఒక తాచుపాము విషం కక్కుతూ*
*మెలికలు తిరుగుతుంది. (కారిడార్).* రాబోతున్న విధ్వంసాన్ని, కాలుష్యాన్ని గుర్తించి వ్రాసిన అద్భుతమైన కవితా వాక్యాలివి. "ఉక్కపోతలాంటి సరళ రేఖ" అన్న మాటలో సరళ రేఖ కోస్తా కారిడార్ భౌగోళిక స్వరూపాన్ని చెపుతుంది. ఉక్కపోత అది కలగచేసే మానవ దుఃఖాన్ని వ్యక్తీకరిస్తుంది. అతి తక్కువ పదాల్లో గంభీరమైన భావం ఇది. అదే సమయంలో ప్రజలలోని నిర్లిప్తతని తరువాత పాదాలు చెపుతున్నాయి. ఈ ప్రాంతంలో ఆరులైన్ల హైవే నిర్మాణం జరిగింది. ఆ హైవేని తాచుపాము విషం కక్కుతూ మెలికలు తిరుగుతుంది అంటున్నాడు.

విశాలమైన రోడ్లపట్ల ప్రభు తన వ్యతిరేకతను అనేక వాక్యాలుగా చాలాచోట్ల చెప్పాడు. నిజానికి ఒక్కోసారి ఇదేమిటీ రోడ్లే కదా మన అభివృద్ధి సూచికలు వాటిని వద్దంటున్నాడేమిటా అని ఆశ్చర్యం కలుగుతుంది కూడా. కానీ ప్రభు దృష్టి వేరు. రోడ్లు అభివృద్ధి సూచికలే కావొచ్చు కానీ ఆ రోడ్ల నిర్మాణం కొరకు మనిషి కొండల్ని, పంటపొలాల్ని, పెద్దపెద్ద వృక్షాలను నాశనం చేస్తున్నాడన్న విషయం కళ్లకు కడతాడు. ఈ రోడ్లకు ఇరువైపులా కేటిల్ గార్డ్‌లు పెట్టి పశువులు నడవనివ్వరు. పక్కన చెట్లు ఉండవు కనుక ఏ పిట్టా గూడు కట్టుకోలేదు. ఇలా ఒక రోడ్డు చేస్తున్న విధ్వంసాన్ని దర్శించటమే గొప్ప పర్యావరణ ప్రేమ.

*రోడ్డు కొండల్ని పేల్చుకుంటూ*
*నేలమీద పరుచుకుంటుంది*
*హైటెక్ కర్మ నున్నటి తారు రోడ్డులా*
*అన్నం మీంచి దూసుకుపోతుంది*
*ఈ రోడ్డు పక్కన చెట్లు మొలవ్వు*
*పైన పక్షి వాలదు*
*కటిక చీకటిలో కూడా*
*కళ్ళు తెరచి పరుగులు తీసే ఈ రోడ్డు మీద*
*ఏ జంతువూ నడవదు*

ప్రభు కవిత్వంలో ఆనకట్టల పట్ల వ్యతిరేకత కూడా కొన్ని చోట్ల కనిపిస్తుంది. ఈ రోజున పర్యావరణ వేత్తలు ఆనకట్టలు కట్టటం పర్యావరణ హితం కాదని చెపుతున్నారు.

*వానలు పడ్డ ప్రతిసాలూ*
*రూపాయిలు కావాల్సిన నది*
*నీరై సముద్రంలోకి పోతుంది*
*ఎక్కడో ఒక చోట దాని*

*పీక నొక్కి*
*నీళ్ళని కక్కించాలి*
*ఆనకట్టల వెనక*
*నోట్ల కట్టలతో*
*పొంగి పొర్లిపోవాలి*
*అప్పుడు*
*ఎనిమిది రోడ్ల పై వోవర్లు కట్టుకుని*
*పటం అక్కర్లేని ప్రపంచీకరణలో*
*ముఖం అక్కర్లేని మనుషుల్ని పుట్టించవచ్చు. (ఒక నది ఉండటం)* ఆనకట్టలు కట్టి సరిహద్దులు లేని విధంగా ప్రపంచీకరణ అయి, మానవత్వం లేని మనుషులను పుట్టించుకొందాం అంటాడు. ఈ కవితలో ఐరనీ ఉంది. అలాంటి అభివృద్ధిలో ముఖంలేని మనుషులే ఉంటారు తప్ప ఇతర జీవరాశి ఉండదు అని సూచన ఉంది.

ఈ రోజు భూసేకరణ అనేది ఒక రాజకీయ క్రీడలా మారిపోయింది. ఉన్నపళంగా ఒక జివొ తెచ్చి తరతరాలుగా నివసిస్తున్న భూమినుంచి అక్కడ నివాసం ఉంటున్నవారిని తొలగించటం జరుగుతుంది. ఇందులో ఉన్న అమానవీయతను భూసేకరణ అనే కవితలో ఇలా పట్టుకొంటాడు ప్రభు.

*కూర్చున్న చాపని కుదిపి*
*లాగేసినట్టు*
*నిలబడ్డ భూమిని చట్టం చేసి*
*చుట్టేశారు–*
*అమ్మకమూ కొనుగోలూ ఉండే*
*కొత్తగ్లోబులో*
*నిర్వాసితుడొకడు ప్రశ్నలా*
*లేచాడు*
*నీటి అమ్మకాలూ ఎండిన పెదాలూ ఉండే*
*కొత్తగ్లోబులో*
*నిర్వాసితుడొకడు*
*రెక్కలు పగిలిన పిట్టలా*
*పడిపోయాడు*

*పోగుపడుతున్న మహా సంపద ముందు*
*తెగిపడిన బతుకు తలకోసం*
*తొక్కిసలాటలో దేవులాడుతున్నాడు*

*నిర్వాసితుడు (భూసేకరణ)* వస్తువును అలవోకగా కవిత్వం చేస్తారు ప్రభు. చాపని లాగేయడం, భూమిని చట్టం చేయటం, ప్రశ్నలా లేవటం, పగిలిన పిట్ట, బతుకు తల లాంటి వ్యక్తీకరణలు మామూలు వ్యక్తీకరణలు కావు. ఆ యా చర్యల్ని దృశ్యాలుగా నిలబెడతాయి. వాటివెనుక ఉద్వేగాలను శక్తివంతంగా ఆవిష్కరించి కలవరపెడతాయి. ఏ వెలుగులకీ ప్రస్థానం అని ఆలోచింపచేస్తాయి.

The biggest fraud of History is Agriculture యువల్ నోవా హరారి అనే రచయిత వ్రాసిన "సెపియన్స్" అనే పుస్తకంలోని ఒక చాప్టర్ పేరు.

ఆ పుస్తకంలోనుంచి కొన్ని వాక్యాలు ఇవి

*"వ్యవసాయ విప్లవం మానవులకు ఎక్కువ ఆహారాన్ని అందించిన మాట నిజమే, కానీ అదనంగా దొరికిన ఆ ఆహారం వాళ్లు తినే పదార్థాలలో మెరుగైన మార్పులు తీసుకురాలేదు. వాళ్ళకి ఎక్కువ విశ్రాంతిని అందించలేదు, పైగా దానివల్ల జనాభాలో విపరీతమైన పెరుగుదల, ధనవంతులను గారాబం చేసి పనికిమాలిన వాళ్ళుగా తయారుచేయటం లాంటివి జరిగాయి. సగటు అటవికుడికన్నా సగటు రైతు ఎక్కువ కష్టపడి పనిచేసేవాడు. దానికి మారుగా అతనికి తక్కువ పోషకాలున్న ఆహారం దొరికేది. వ్యవసాయ విప్లవం చరిత్రలో అతిపెద్ద వంచన. చెట్లు ఎక్కేందుకు, జింకల వెనుక పరిగెట్టేందుకు అనువైన శరీరం మానవునిది. నేలను చదునుచేయటం, నీళ్ళు మొయ్యటం లాంటి వ్యవసాయ పనులు చేయవలసి వచ్చినట్లు మానవుల వెన్నెముక, మోకాళ్లు మెడలు దానికి మూల్యం చెల్లించి దెబ్బతిన్నాయి"*

పై వాదనను అంగీకరిస్తే మనం ఈరోజు అభివృద్ధి అనుకొంటున్నదంతా ఉత్త వంచనగా అంగీకరించకతప్పదు. ప్రభు చెపుతున్నదంతా దాని గురించే.

అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసమే మానవ దుఃఖానికి హేతువు అన్న విషయంలో ప్రభు స్పష్టంగానే ఉన్నాడు. మరి ఈ దుఃఖం నుంచి విముక్తమవ్వాలంటే ఏం చేయాలో కూడా ఒక చోట చెపుతాడు.

పాల పిట్ట అనే కవితలో అందమైన ఆ పిట్ట సౌందర్యాన్ని, స్వేచ్ఛనీ వర్ణించి చివరలో ఇలా అంటాడు.

*జ్ఞానం సబ్బుబుడగలా*
*ఉబ్బిన మనిషి*
*ప్రకృతి తక్కెడలో*

## అమ్మ నానీలు

- వెన్నెల సత్యం
9440032210

*అమ్మ గర్భం కన్నా
భద్రమైనదేది?
ఇప్పటికీ
వెతుకుతూనే ఉన్నా*

*చిన్నతనంలో వాళ్లకి
అందమైన అమ్మ
పెద్దయ్యాక
మూలన బెట్టిన బొమ్మ*

*తన పిల్లల
బతుకు కోసం
గర్భం అద్దెకిచ్చింది
త్యాగం తలదించుకొంది!*

*సహనానికి
చిరునామా
భూమాత కానే కాదు
అమ్మే ఒక ఖరార్‌నామా!*

*అమ్మ
పక్షులిడిసిన గూడు
బతకలేక చస్తోన్న
ఎముకల గూడు!*



♦

***ఈ పిట్టముందు తేలికయ్యాడా***
***బుడగ పగిలి విముక్తుడౌతాడు (పాల పిట్ట).***

మనిషి జ్ఞానభారం నుంచి విముక్తుడై ప్రకృతి ముందు వినమ్రుడై తలవంచిననాడే అతనికి విముక్తి అంటున్నాడు. ఈ అభివృద్ధిపథంలో ఇన్ని వేల సంవత్సరాలుగా ప్రయాణం చేసి ఇక వెనక్కు వెళ్లలేని స్థితికి చేరుకొన్నాకా ఈ మాటలు వింతగా తోచవచ్చు. కానీ ఇది మాత్రం వాస్తవమని అంగీకరించక తప్పదు.

ప్రభు కవిత్వంలో పర్యావరణ విధ్వంసం గురించే కాక మరో రెండు ప్రధానమైన ఇతివృత్తాలు కనిపిస్తాయి. అవి బౌద్ధం పట్ల ఆరాధన, ప్రకృతి సౌందర్యం పట్ల వివశత్వం.

***ఇన్ని నాగరికతల్ని దాటి వచ్చాను***
***యింకా నీ నిమీలిత నేత్రాల***
***పారవశ్య రహస్యం తెలియనే లేదు (దుఃఖపడ్డం ఎలా నేర్చుకోవాలి)*** అంటాడు బుద్ధుడను ఉద్దేశించి.

బీహార్‌లో బుద్ధుడు సంచరించిన 'జేతవనం" అనే ప్రదేశాన్ని సందర్శించిన అనుభవాన్ని అద్భుతమైన కవితగా పోతపోస్తాడు ప్రభు.

పట్నం వంతెన మీద, వయా రంగంపేట, పాలపిట్ట, పట్నంలో పున్నాగ, పిచ్చుకల చెట్టు లాంటి కవితలలో ప్రకృతి సౌందర్యం పట్ల తనకు ఉన్న ప్రేమను మనోరంజకంగా ఆవిష్కరిస్తాడు.

ప్రభు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నమ్మినవాడు. ఆ వాద ఛాయలు మనకు అమర, అనేక ఓటముల తరువాత, తూత్తుకుడి వేదాంతం లాంటి కవితలలో కనిపిస్తాయి.

ప్రభు కవిత్వం క్లుప్తంగా ఉంటూనే అనంతమైన భావాలను పొదువుకొని ఉంటుంది. అలా రాయటం చాలా కష్టం. కవిత్వాంశను మిస్ అవకుండా, వాక్యం వాచ్యం కాకుండ ధ్వన్యాత్మకంగా చెప్పటానికి చాలా శక్తి కావాలి. అది ప్రభుకు పుష్కలంగా ఉంది.

***ఉడుగ్గంజి కుండలాంటి చెరువు మీద/ ఊరెల్తూ ఆగిన దోసిలి (వయా రంగం పేట)***

***వందలకొద్దీ పిచ్చుకలు చెట్టునిండా/ పూసిన పువ్వుల్లా/ రెక్కల్ని, తోకల్నీ అల్లాడిస్తూ/ కూతల పరిమళాన్ని చుట్టూరా చల్లుతాయి (పిచ్చుకల చెట్టు)***

***ఈ నిముషం లక్షరూపాయిలు కావొచ్చు/ ఎన్ని లక్షల రూపాయిలైనా ఒక్క నిముషం కాలేవు (ఈ వేళ ఒక్కపైసా కూడా సంపాదించలేదు)***

***ఇంతకీ వాళ్లు పాపం/ కాలుష్యం వద్దు/ బతకనివ్వండి చాలు అన్నారు (తూత్తుకుడి వేదాంతం)***

***నిజానికొక లైబ్రేరీ అంటూ లేదు మా నాన్నకి/ వందలకొద్దీ పుస్తకాలు/ కొమ్మలమీద వాలిన పక్షుల్లా ఉండేవి/ జీవిత వృక్షానికి పూసిన పువ్వుల్లానూ ఉండేవి (నిజానికి)*** లాంటి వాక్యాలు ప్రభు కవిత్వంలోని లోతుల్ని, సారాన్ని ఆవిష్కరిస్తాయి.

ప్రభు ఆలోచనాశీలి. ఏది దుఃఖహేతువు అంటూ అనాది సందేహాన్ని మోస్తున్న ఆధునిక అన్వేషకుడు. ఏ వస్తువును కథగా రాయాలో ఏ వస్తువును కవితగా చెప్పాలో రహస్యం తెలిసిన వాడు. దుఃఖపు ఎరుక పుస్తకం మంచి పఠనానుభవాన్ని కలిగిస్తుంది.

♦

## కవిత

# దేశం నడిబొడ్డులో...

- జనార్ధన వల్లభాపురం
9440163687

గాడ్సే వారసత్వం సాక్షిగా
దేశం నడిబొడ్డులో
ప్రజాస్వామ్య న్యాయానికి వస్త్రాపహరణం
రాజ్యాంగం సాక్షిగా మానవ హక్కుల హత్య
ఇంతకాలం పాలకులకు కళ్ళే లేవనుకున్నా
కానీ కళ్ళే కాదు చెవులూ కాళ్ళూ చేతులూ లేవు
హృదయం అసలే లేదు
నిరసన కారుల అంతు చూస్తామనే
నోరుమాత్రం హైపవర్ మైకు
చేతలు అభిమన్యు వధ మార్గంలో
ఆశయాల జండాలు దించాల్సిందేనని
ప్రజాస్వామ్య ముసుగు ఫర్మానా
అక్షరాలు నోటి నుండి బైటికి వస్తే
చీలికలు పేలికలైన నాలుకల ముక్కలు
పాలక కీర్తి మార్కెట్ రోడ్లను ముద్దాడుతున్నవి
నిరసన యాత్రలకు పురుదు పోస్తే



దేశద్రోహుల జాబితాలో షరీకు
నోరెత్తితే - చేయి కదిలిస్తే - కాలు జాడిస్తే
శవాల ఎగ్జిబిషన్ ప్రారంభం
ఇదే శాంతి సందేశం ఫార్ములా
సాలోంకూ గోలీమారో - ఖతం కరో
అంటున్న గొంతులకు పూలదండలు
ఉద్యమ కారులకు లాఠీ - తూటా కౌగిలింతలు
హిట్లరు వేషాలకు
ఈ మట్టిపోరు చరిత్ర మాయం కాదు ♦

# ప్రవాహం

- జంధ్యాల రఘుబాబు
9849753298

నేననుకున్న తియ్యటి పదాలు
మంచు కొండల్లో విహరిస్తున్నాయి
గడ్డకట్టుకుపోయిన ఆశలతో కలిసి
కొత్త అర్థాలని వెతుక్కుంటున్నాయి

నేవేద్దామనుకున్న అడుగులు
ఎడారి ఎండల్లో కష్టాలు పడుతున్నాయి
ఎండమావుల నీరు తాగుతూ
సేద తీరాలని ఎండిన నోరు అనుకుంది

మండుతున్న నా ఆశలు
అడవిలోని దావానలంలో
వివేకం కోల్పోక ఎండిన ఆకుల్ని
ఏరుకుంటూ ఇంగితాన్ని ప్రదర్శించాయి

తవ్వకాల్లో దొరికిన శిలాజాల్లా
హిమసీమల్లో భద్రంగా నిక్షిప్తమైన
సైనికుడి వీరదేహంలా చేయెత్తుకొని
నా ఆలోచనలు చూస్తోంది ప్రపంచంవైపే

శైశవగీతిని ఆలపించే నా పెద్దరికం



తల్లి ఒడిలోని మాతృప్రేమని
తలచి బాల్యాన్ని దాటనంటుంది
ఇంకో తరం తన స్థానానికై
నను ముందుకుతోసింది
కాలం కదలకూడదనుకునే
నా చిత్తచాంచల్యం ప్రకృతిని
అర్థంచేసుకుని అత్యాశని వీడి
వివేకంతో కొత్తతరాన్ని వెన్నుతట్టి
కాలగమనాన్ని ఆస్వాదించి
వారికి స్వాగతాంజలి అర్పించింది
ప్రవాహమంటే ఆగడం కాదని
ఆగడాలు మాని ముందుకురికింది ♦



# అన్వేషణ

- గనారా
9949228298

ఆ చప్పుడికి అసహనంగానే కదిలాడు. దుప్పటి పైకి లాక్కున్నాడు. మరో రెండుసార్లు గేటు చప్పుడు. చికాకు. కొన్ని చప్పుళ్ళు కొందరు భరించలేనట్లే ఈ చప్పుడు భరించలేడు క్రిష్ణమూర్తి. తెల్లవారుతుంది. ఇక తప్పదు.

వెళ్ళి గేటు గెడ తప్పించాడు. అప్పటికే బయటపెట్టుకున్న కొబ్బరి ఈనెల చీపురితో వాకిలి తుడవడం మొదలుపెట్టింది పనిమనిషి. సిమ్మెంటు రోడ్డు వేయడం వలన మట్టి వాకిలిపోయింది. ఊడుస్తున్న శబ్దానికి గుండెల్ని పట్టి రాస్తున్నట్లు ఉంది.

పక్కింటి ఆమె కూడా లేచి అదే కార్యక్రమంలోకి పోటీగా వచ్చింది. క్రిష్ణమూర్తి బయటకు తొంగి చూసాడు. ఆడవాళ్ళు ఉదయమే లేచి వాకిలి వూడ్చడం, కళ్ళాపు జల్లడం, ముగ్గు పెట్టడం ఒక కళలా చేసుకోపోతారు. వారి దైనందిన కార్యక్రమం, అక్కడ నుంచే ప్రారంభం అవుతుంది.

ఇద్దరూ చీపుళ్ళు పక్కన పెట్టి కబుర్లలో పడ్డారు. పనిమనిషి బుగ్గపై చేయి వేసుకొని ఆశ్చర్యం నటిస్తోంది. చెంగులాగి బిగించి బొజ్జలో దోపింది.

అటు, ఇటు చూస్తూ కాస్త దగ్గరగా జరిగి గుసగుసల్లోకి వెళ్ళారు.

వాళ్ళ రహస్యాలు వాళ్ళకు ఉంటాయనుకుంటాను!

కళ్ళు తిప్పడం, చేతులు వూపడం, ముసిముసిగా నవ్వుకోవడం.

వాళ్ళను విడదీయడం, విడగొట్టడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

క్రిష్ణమూర్తి వాళ్ళకు కనిపించకుండా ఆసక్తి కనపరిచాడు.

అసలు పని మనుషుల ద్వారానే ఇంటి రహస్యాలు బయటకు పోతాయి. ఆఖరుకు పడక గదుల రహస్యాలు కూడా! అదే అతని భయం.

ఇరుగుపొరుగువాళ్ళు పిట్టగోడకు అటు ఇటు నిలబడి అందకపోతే పీటలు వేసుకొని టైము కూడా గమనించకుండా గుసగుసలు. ఆ స్నేహంలో ఇచ్చి పుచ్చుకోవడాలు. ఆ వీధిలో ఏఏ కుటుంబాలలో ఏం జరుగుతుంది. ఎవరమ్మాయి సంబంధం చెడింది. ఏ కుర్రాడుతో ప్రేమలో పడింది. ఎవరెవరితో ఎవరికి వివాహేతర సంబంధాలు వంటి అతి నిగూఢమైన రహస్యాలు కూడా కూపీ లాగుతారు. చీరలు, నగలు, సినిమాలు, సంపాదన.

పనిమనిషి వచ్చి టీ పెడుతుందని ఆశించాడు. వాళ్ళ చర్చ పెరుగుతుందే తప్ప ముగింపు లేదు. సర్రున పాలవాడి సైకిలు వచ్చి ఆగితే కానీ ఇద్దరూ కదలలేదు.

డిస్టర్బ్ చేసాడు

పక్కామె చీపురుతో లోపలికి వెళ్ళింది

పనిమినిషి కూడా లోపలికి వచ్చింది

ఇద్దరూ పాలు పోయించుకున్నారు, సంభాషణ కొనసాగించే అవకాశం లేదు

ఎవ్వరి పనుల్లోకి వారు జారుకున్నారు.

క్రిష్ణమూర్తికి ఆ సంభాషణ ఏమిటి? ఆ రహస్యాలు ఏమిటో అర్థం కాలేదు. చేతులు త్రిప్పడం, బుగ్గలు నొక్కుకోవడం, కళ్ళు చిత్రంగా తిప్పడం, ఈ మూగభాషలో ఎన్నో రహస్యాలు.

అయినా ప్రతీరోజు ఏ విశేషాలు ఉంటాయి?

వాక్ స్వాతంత్ర్యం, సభ స్వాతంత్ర్యం మల్లే ఈ గుసగుసల స్వాతంత్ర్యం ఉండాలి.

♦♦♦

ఆఫీసు అయిన వెంటనే క్రష్ణమూర్తి బైకు తీసి ముందుకు కదిలాడు. మీనాక్షి పిలుపుకు వెనక్కి చూసాడు.

"ఎక్కడికి? ఆఫీసు అయిన వెంటనే పరుగులు తియ్యాలా! ఇంటి దగ్గర ఆమె లేదు కదా! కాస్త నన్ను కళామందిరం దగ్గర దించండి. ఈవేళ చెన్నై సిస్టర్స్ ప్రోగ్రాం... సంగీతం లేదు. సాహిత్యం లేదు. ఏ మనుష్యులో" అంటూ బైక్ వెనక చొరవగా కూర్చుంది.

"నాకు అంత కళాపోషణ లేదు మేడమ్" అంటూ ముందుకు పోనిచ్చాడు.

"మీ వీణా సాధన ఎంతవరకూ వచ్చింది" అడిగాడు

"అలా చూస్తుండండి. ఎప్పటికన్నా కళామందిరంలో నా ప్రోగ్రాం చూడడానికి మన ఆఫీసువాళ్ళు అంతా గుంపులు గుంపులుగా వస్తారు"

"ముందు మీ ఆయనకు అలవాటు చేయండి!"

"ఆయనకే కళా హృదయం ఉంటే ఉదయం పదిగంటల నుండి సాయంకాలం వరకు ఈ పుస్తకాలు, కంప్యూటర్ల మధ్య జీవితం ఎందుకు అణగారిపోతుంది" అంది.

నిజమే! ఆమె ఉండాల్సిన రంగం ఇది కాదు అనుకున్నాడు.

కథలు, కవిత్వం వ్రాస్తుంది. అది పత్రికల్లో వచ్చినప్పుడు మురిసిపోతుంది. థియటర్‌లోకి దారి తీస్తు, "క్రిష్ణమూర్తీ! ఎప్పుడన్నా హత్య చేసారా!"

ఆశ్చర్యంగా ఆమె కళ్ళల్లోకి చూసాడు. సన్నటి నీటిచార కనిపించింది

"నేను చేసాను"

క్షణం ఆగి 'నడవయ్యా!' అంది.

"పెళ్ళి అయిన వెంటనే సంగీతాన్ని హత్య చేసాను. పిల్లలు పుట్టిన తరువాత నన్ను నేను హత్య చేసుకున్నాను." ఆమె మాటల్లో నిరాశ వినిపించింది.

థియేటర్ నిండిపోయి ఉన్నా, అక్కడక్కడ కుర్చీలు ఖాళీగా ఉన్నాయి.

"ఆడవాళ్ళు వరుసలో కూర్చుంటాను. బోరు కొడితే వెళ్ళిపో! మా ఆయనకు ఫోను చేస్తాను"

అంటూ మీనాక్షి ముందు వరుసకు వెళ్ళిపోయింది.

ఆమె గొంతు ఒక ప్రవాహం. ఎదుటివాణ్ణి మాట్లాడనివ్వదు. తను చెప్పాల్సింది కుండ బద్దలుకొట్టి మరీ చెబుతుంది. ఆఫీసు పనులు చెయ్యడంలో దిట్ట. అందుకే ఆమె విషయంలో కొన్ని మినహాయింపులు ఉంటాయి.

చిన్నతనంలో తాతగారు సేకరించిన సంగీత సాహిత్యాల పుస్తకాలు అటుఇటు తిరగేసిన కాలం కళ్ళముందు కదిలింది. ఖాళీ సమయంలో వచ్చి తాతగారితో కాలం మరిచి గంటల కొద్దీ మాట్లాడుతుంటే డా॥ గజరావు భార్య అనురాధ మిత్రురాళ్ళతో వచ్చి సంగీత సాహిత్యాల గూర్చి గంటల కొలది చర్చించేది.

సంగీతం పట్ల ఇంత వ్యామోహం ఉంటుందా! అందులోనూ శాస్త్రీయ సంగీతం. జనాన్ని చూసి ఆశ్చర్యం వేసింది. బయట రోడ్లన్ని కార్లతో స్కూటర్లతో నిండిపోయాయి. పరిశీలనగా చూసాడు. తన ఆఫీసుకి వచ్చే మధ్యతరగతి వాళ్ళు, ధనవంతులు ఉన్నారు. చాలామంది వృద్ధులు, నడివయస్సు వాళ్ళు కొందర్ని జాగ్రత్తగా నడిపిస్తూ తీసుకువస్తున్నారు. తనకు అలవాటు లేని ప్రోగ్రాం వల్ల రెండు కీర్తనలు విని ఏదో పని ఉన్నట్లు లేచాడు. మనస్సులో కొంత ఆసక్తి ఉన్నప్పటికీ ముందుకు కదిలాడు.

సంగీతకారులు రాగ స్వరయుక్తంగా పాడుతుంటే కొంతమంది చేతివేళ్లతో తాళం వేస్తూ మధ్య మధ్యలో చప్పట్లు కొడుతూ అభినందిస్తున్నారు. అందులో ఆనందం ఏమిటో అర్థం కాదు. పక్క వాయిద్యకారులు కీర్తన అనంతరం వాళ్ళు కూడా పది నిమిషాలు తమ ప్రావీణ్యత చూపిస్తున్నారు. దీన్ని గూర్చి పూర్తిగా తెలుసుకోవాలి!

పక్క గేటులోంచి కారిడారులోకి వచ్చాడు. ముగ్గురు, నలుగురు చొప్పున ఆడవాళ్ళ గ్రూపులు ఉన్నాయి.

"ఇంత రెష్‌గా ఉంటుందని అనుకోలేదు. లేదంటే నాలుగు గంటలకే వచ్చేదాన్ని" అంది ఒకామె!

క్రిష్ణమూర్తి సెల్ మాట్లాడుతున్నట్లు నటిస్తూ ఆ సంభాషణ వింటూ, సినిమా సంగీతానికీ శాస్త్రీయ సంగీతానికి మధ్య

ఏదో బలమైన విభజన రేఖ ఉంది. తనకు అర్థంకాని తాత్వికత ఉంది. భక్తి కోణం ఎక్కువగా కనిపిస్తున్నప్పటికి హృదయానికి ఏదో లాలన.

"వాళ్ళు సూర్యకుమారి శిష్యులే! ఆ చిన్నది నాతో పాటే సాధన చేసింది. చాలా పొగరు. కాకపోతే గాత్రం బాగుంటుంది" అంది. ఆ గుంపులో లావుపాటి ఆమె.

"మీరు ఆమెలాగా సాధన చెయ్యడం మాని, పెళ్ళి చేసుకున్నారు" అంటూ పక్కామె కళ్ళల్లోకి చూసింది, మరో ఆమె.

"పెళ్ళీ పెడాకులు లేకుండా ఇలాగ కచేరి చేస్తుంటే నేనేమన్నా రంభనా!"

"మీరు మరీ అన్యాయంగా మాట్లాడుతున్నారు" అంది మూడో ఆమె.

ఆరేళ్ళ కుర్రాడు వచ్చి ఆమె కాళ్ళు వాటేసుకున్నాడు.

"ఉండండి! మా మనవడిని లోపల కూర్చున్న మా అమ్మాయికి అప్పగించి వస్తాను"

అంటూ వాళ్ళని విడిచి లోపలికి వెళ్ళింది.

"ఈ మనిషి ఎవరినీ సహించలేదు."

"మరే! సంగీతకారుల కృషిని అభినందించాలి... ఇదేమి వ్యవహారం!" అని ఆశ్చర్యం వెళ్ళబుచ్చారు.

వాళ్లంతా మంచి ప్రోగ్రాం వదిలి పక్కకి వచ్చి చెవులు కొరుక్కోవడం గొప్పలు చెప్పుకోవడం. ఇవి ఏ స్థాయి స్త్రీల కన్నా సహజ లక్షణమేమో!

ఇలాంటి సందర్భాల్లో తప్పితే తరుచూ కలవని స్నేహాలు అనుకుంటాను!

వాళ్ళ భంగిమలు, ప్రవర్తన, ఆహార్యం రిచ్‌గానే ఉన్నా స్వభావ రీత్యా అందరిది ఒకే భావన. వారి మనస్సు లోతుల్లో ప్రవేశించి అన్వేషించి విశ్లేషించడం ఎవరికి సాధ్యం!

బయట చాలామంది పురుషులు జట్లుగా సంగీతం గూర్చి ఆ రంగంలో ప్రసిద్ధులను గూర్చి చర్చించుకుంటున్నారు. వారి వారి సృజనాత్మక స్థాయిలో బేధం ఉన్నప్పటికి అలా మాట్లాడుకోవడం ఒక సంతృప్తి కలిగిస్తోంది.

కాస్త టీ త్రాగి, ఎక్కడన్నా ప్రశాంతంగా కూర్చోవాలనిపించింది క్రిష్ణమూర్తి.

మెల్లగా టీ కొట్టు దగ్గరకు చేరుకున్నాడు.

"నమస్కారం క్రిష్ణమూర్తి గారు"

వెనక్కి చూసాడు

"రండి మాస్టారు టీ తీసుకోండి"

"నేను అందుకే వచ్చాను... ఆఫీసు అయిందా!"

"అవునండి... చల్లగాలికి బయలుదేరాను"

ఆయన ఆఫీసుకు ప్రతినెల పెన్షన్ గూర్చి వస్తుంటాడు. క్రిష్ణమూర్తితోనే పని ఎక్కువ. మాస్టారు పెద్దవారు కావడంతో స్టాఫ్‌తో చనువుగా ఉంటాడు.

"సరే.... ఇద్దరైతే సంభాషణ. ముగ్గురు అయితే అసుకు. ఆపై చర్చ"

ఇద్దరూ అటు రైల్వేస్టేషన్ వైపు వెళ్ళారు.

"మీరు కవిత్వం వ్రాస్తారట కదా!"

"ఏదో కాలక్షేపం"

"నేను విన్నంతవరకూ ప్రసిద్ధులే!"

బ్రిటీష్ కాలం నాటి రైల్వేస్టేషన్. అప్పుడప్పుడు ఓ రైలు, గూడ్సు వస్తుంటాయ్. వాటికి చివర మజిలీ. ఇది స్టేషన్ వెనుక భాగం. జనసంచారం లేని ప్రదేశం. అక్కడక్కడ దీపాలు వెలుగుతుంటాయి. ఒకరి తరువాత ఒకరు మెల్లగా ఆయన శిష్యబృందం చేరుకున్నారు.

పరస్పర పరిచయాలయ్యాయ్. ఇంత దగ్గరలోనే ఉన్న ప్రదేశం ఎందుకు గుర్తించలేకపోయానో అని క్రిష్ణమూర్తి ఆశ్చర్యపోయాడు.

వివిధ వృత్తులవాళ్ళు. ఇద్దరికి చదువు పూర్తి అయింది. ఒకరు మాస్టారు. మరో ఇద్దరు ఉద్యోగస్తులు. అందరికీ సాహిత్య అభిలాష పుస్తకాలు చదువుతారు. ఏదో ఒకటి వ్రాస్తుంటారు. విమర్శ చేస్తుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే సృజనకారులు అనుకున్నాడు.

ప్రారంభంలో క్రిష్ణమూర్తికి కాలాన్ని వృథా చేయడంలా తోచింది. చాలామంది ప్లాటు ఫారం ప్రక్కన చెట్లు క్రింద జట్లు, జట్లుగా సోది వేస్తుంటారు. కొన్ని గ్రామాలలో పెద్దలు రావిచెట్లు క్రింద, స్త్రీలు, కుళాయిల దగ్గర, బావి దగ్గర, నీలాటి రేవుల్లో అరుగుల మీద విలువైన కాలం వృథా చేస్తుంటారని అవుతుందని అభిప్రాయపడ్డాడు. చదువుకున్నవారు కూడా ఎందుకు విలువైన సమయం వృథా చేస్తున్నట్లు?

కృష్ణమూర్తి ఎప్పుడో విన్నాడు. ద్వారకా హోటల్లో ఆ నలుగురు గాజుగ్లాసుల్లో తమని తాము దర్శించుకోవడం, యానాం పడవ ప్రయాణంలో విందు వినోదాలతో కేరింతల కవిత్వ భాష, కవికుల భోజనాలలో తార్కికత ఎంతో ఉందని.

"ఏమిటి క్రిష్ణమూర్తి గారు బోరుకొడుతుందా!" అడిగాడు

మాస్టారు.

"అబ్బే అదేమీ లేదండీ, టివిల ముందు కూర్చొనే కన్నా ఇక్కడ చాలా విషయాలు తెలుస్తున్నాయి. నాకు సాహిత్యం అంటే ఇష్టమే!"

చర్చ ఎక్కడ మొదలైందో తెలియలేదు. మధ్య మధ్యలో ఎవరో ఒకరు అభిప్రాయం. వ్యాఖ్యానం. దానిపై కూడా చర్చ భిన్న అభిప్రాయాలు.

సాహిత్యంలో శిల్పం, వస్తువు, ఆధునికత, దోపిడి, పర్యావరణం, గ్లోబలైజేషన్, దేశభక్తి, అటు ప్రాచీన కవులు, ఆధునిక కవులు, విప్లవకవులు, రాజకీయాలు, ఎవరెవరో వాళ్ళ సంభాషణల్లోకి వస్తున్నారు.

క్రిష్ణమూర్తి ఆసక్తి పెరిగింది. అయినా మౌనంగా ఉన్నాడు. కొంత గందరగోళం ఉన్నప్పటికి వారిలో ఒక అన్వేషణ కనిపించింది. వ్యక్తి ప్రయోజనం కాకుండా సమిష్టి హితం గూర్చి, సమాజం గూర్చి, తపన కనిపించింది.

కొన్ని సభల్లో క్రిష్ణమూర్తి పాల్గొనేవాడు. ఉపన్యాసకుడు తన అభిప్రాయాన్ని హేతుబద్ధంగానే చెబుతున్నప్పటికీ ఎవరూ ప్రశ్నలే వేయరు. వేసినా అనేక అనుమానాలు నివృత్తి కావు. ఇక్కడ పరస్పరం ఎదురెదురుగా కూర్చొని చర్చించుకోవడం బాగుందనిపించింది.

"సందేహాలు నివృత్తికి ముఖాముఖి ఏర్పాటులా ఉంది కదూ!" అన్నాడు బృందంలో ఒక మిత్రుడు.

"సాధారణంగా మనం సమాధానం చెప్పినవాడే గొప్పనుకుంటాం. కాని ఎవరైనా మంచి ప్రశ్న అడిగినపుడే మనకు తెలియని విషయాలు బయటకు వస్తాయి. అందుకే ప్రశ్న వేసిన వారిని అభినందించడం ముఖ్యం" అన్నాడు మాస్టారు.

"ఈ చెట్టు నీడలో జ్ఞానోదయం"

"దుఃఖమయ ప్రపంచానికి దూరంగా బాతాఖానికి" కాస్త హాస్యం జోడించి చెప్పాడు ఒకరు.

"ఉదయం పది గంటల నుండి ఐదు గంటల వరకు ఈ కర్మకాండలో నలిగి నశించిపోవాలా!"

"లేదు! కోర్కెలు జయించు"

మాస్టారు కలగజేసుకొని "ఇలాంటి విషయాలు సీరియస్‌గానే చర్చించాలి. అప్పటికి అది విప్లవకర నినాదమే! వ్యక్తి ఆస్తి పెరిగి రాజ్యాధికారం స్థిరపడ్డప్పుడు తిరుగుబాటు అన్నది సామాన్య విషయం కాదు. గౌతముడి ప్రాపంచిక దృక్పథం మానవ జాతికి నేటికి ఉన్నతమైనదే!"

తల్లికోడి చుట్టూ తిరుగుతున్న పిల్లల్లా మాస్టారు చుట్టూ కూర్చున్నవార్ని చూసి ఆశ్చర్యం వేసింది. ఆయన ఆఫీసుకు వచ్చి ఏవేవో ప్రశ్నలు వేస్తుంటే మొదటిలో కొంత అసంతృప్తి కనపరచిన క్రిష్ణమూర్తికి ఇప్పుడు ఆయన ఔన్నత్యాన్ని చూసి ఆశ్చర్యం వేసింది.

మాస్టారు గూర్చి ఎవరో బైక్‌పై వస్తే కాసేపు కూర్చొని లేచి వెళ్ళుతూ..

"క్రిష్ణమూర్తీ! ఆఫీసు అయిన వెంటనే మా బృందంలో కలు" అన్నారు.

పడమటి ఆకాశంలో నెలవంక నక్షత్రాల మధ్య కనిపిస్తుంది. ఒక్కొక్కరూ లేచారు.

క్రిష్ణమూర్తి అక్కడ నుంచి కదిలాడు. వారి సంభాషణ అంతా సాహిత్యంపై నడిచింది. భాషలో జీవం తొణికిసలాడింది. అసభ్య పదజాలం కాని, చిల్లర వాఖ్యాంశాలు కనిపించలేదు. అది సంస్కారవంతుల సంఘం అనిపించింది.

ఏడైంది అప్పుడే ఇంటికి ఏమిటి? మరో గంటవరకూ గ్రంథాలయం తెరిచే ఉంటుంది. నాలుగు పత్రికలు తిరగవేసి లైబ్రరికి చందా కట్టాలని నిర్ణయించుకున్నాడు. గంట తరువాత బయటపడ్డ క్రిష్ణమూర్తికి రోడ్డు ప్రక్క చెట్టుక్రింద టీ స్టాల్ దగ్గర నాలుగు బల్లలు వేసి ఉన్నాయి. అక్కడకు చేరే జనం నాలుగైదుసార్లు టీ త్రాగుతూ పదివరకూ కబుర్లు చెప్పుకుంటారు. తనకు తెలిసిన ప్రదేశమే కాని ఎప్పుడూ అంతగా గమనించలేదు.

'అదో ఎంటిక్'

క్రిష్ణమూర్తి చెవిన పడింది. కొంత చర్చ జరిగి ఉంటుందని, ఆసక్తితో బల్లపై కూర్చున్నాడు.

"చరిత్రకు సంబంధించిన ఆనవాళ్ళను ఆధిపత్యంలోకి వచ్చినవారు నాశనం చేసారు. తమ మత ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ఎదుటివారి నమ్మకాలు, సంస్కృతి, భావజాలం మార్చివేసారు. ప్రతిఘటించిన వారిని అణగదొక్కారు".

"ఈ దేశంలో ప్రతిఘటన జరగలేదా!" అనుమానంతో ఒకతను అడిగాడు.

"బుద్ధుడు హింసతో కూడిన రాజకీయ వ్యవస్థను వ్యతిరేకించాడు".

"పుష్యమిత్రుడు రాజ్యాధికారం చేతిలోకి వచ్చిన తరువాత

## కవిత

# ప్రశ్న లేకుంటే!

- ఎస్. రాంబాబు
8985854152



**మ**నిషిలోని
ప్రశ్న
ప్రకృతిలోని
నిగూఢ రహస్యాలను
శోధించి.. ఛేధించి
సరికొత్త ఆవిష్కరణలకు
సకల శాస్త్రాల పుట్టుకకు
మూల బిందువు ప్రశ్న !

ప్రకృతి
ప్రశ్నించుకోదు
పుష్పించే చెట్లు
కురిసే మేఘాలు
వీచే గాలీ బేషరుతుగా
సర్వం సమకూర్చుతాయి!
మనిషి నడుమ దూరి
గుత్తాధిపత్యం ప్రకటించుకొని
ప్రకృతి ఫలాల్ని
కొందరికే దొరకనిస్తాడు!

సరిగ్గా అప్పుడే
మనిషి మెదడులో
ప్రశ్న పొడసూపుతుంది
ప్రశ్నల పరంపర
ఉషోదయ విప్లవాలకు
నాంది పలుకుతుంది!

ప్రశ్న
చీకటిని తొలగించి
వెలుతురు ప్రసరించి
స్వయం జ్వలిత దీప్తిగా
మనిషిలో ప్రజ్వరిల్లుతుంది
ప్రశ్న
మనిషి అమ్ముల పొదిలో
వ్యక్తుల మధ్య
సమూహాల మధ్య
సిద్ధాంతాల మధ్య
నిరంతరం పై చేయికై
ప్రయత్నిస్తుంది!
నిజాన్ని నిగ్గు తేల్చే
ప్రక్రియలో
ముఖ్య భూమిక
పోషిస్తుంది!

ప్రతి మనిషిలో
అంతర్లీనంగా
పృచ్ఛకుడుంటాడు
సమయం వచ్చినప్పుడు
ప్రశ్నల వర్షం
కురిపిస్తాడు
మనిషి కర్తవ్యాన్ని
క్రియారూపంలోకి
ఉద్యుక్తుణ్ణి
చేసే ప్రబోధక శక్తి ప్రశ్న!
ప్రశ్న లేకుంటే
ప్రపంచం
పది అంగుళాలు కూడా
కదలదేమో! ♦

ఆలయాల సంస్కృతి ఎక్కువ అయింది. కనిపించిన ప్రతి బౌద్ధుణ్ని క్రూరంగా చంపిన చరిత్ర అది. ఆఖరికి వీరి ఆగడాలు తట్టుకోలేక బౌద్ధం ఈ దేశం విడిచి వెళ్ళిపోయింది" అంటూ ఉద్రేకంగా ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపోయాడు.

అతని మాటలు వింటుంటే క్రిష్ణమూర్తికి చరిత్రలోకి చొచ్చుకుపోయినట్లు శరీరంలో రోమాలు చలించిపోయాయి.

"పిఠాపురం ఒకప్పుడు కళింగుల రాజధానిగా ఉన్నట్లు రాహుల్ సాంకృత్యాయన్ అనేకచోట్ల ఉదహరించాడు. ఇక్కడ ద్రాక్షారామం ఒకప్పటి బౌద్ధారామమే! అని చదివాను" అన్నాడు మరొకతను.

"పైకి గొప్ప సంస్కృతి అని చెప్పుకోవడమే! దాన్ని సాహిత్యాన్ని కళాత్మకంగా మలిచి, సౌందర్యం పూసి ఆరాధన అద్ది మోసం చేసారు"

"అవును! ఒకప్పుడు శివాలయాలు వైష్ణవాలయాలుగా మారినట్లే బౌద్ధారామాలును కూడా మార్చారు" అన్నాడు మరో అతను.

"గుళ్ళు గోపురాలు, విగ్రహారాధన తెచ్చారు. దౌర్జన్యాన్ని పెంచి పోషించారు. ఆలయాల్లో కొందరికి భుక్తి కలిగింది. బౌద్ధుల శాంతి వచనాలు అరువు తీసుకొని ప్రవచనాలు చెబుతున్నారు. ఈ సమాజాన్ని మరో రెండు వేల సంవత్సరాల వెనకకు నెట్టాలని ఇప్పటి పాలకుల ఆలోచన"

వీళ్ళు ఎక్కడున్నా ఒక చర్చ! తీవ్రమైన ఘర్షణ, భావాల విస్తృతి! ఒక సత్యాన్వేషణ!

అలా చర్చ జరుగుతుండగా కొందరు దుండగులు వచ్చి రావడంతో సంభాషణలో మునిగిన ఆ నలుగురిపై దాడి చేసారు. టీ తాగుతున్న జనం చెల్లా చెదురైయ్యారు.

"వీరు కార్నర్ రౌడీలు, అర్బన్ రౌడీలు, సాంస్కృతిక గూండాలు" మాటలు క్రిష్ణమూర్తికి వినిపించాయి.

క్రిష్ణమూర్తి తేరుకోలేదు.

"పది సంవత్సరాల నుండి ఇక్కడే టీ త్రాగుతూ ఎవరి గొడవలోకి పోకుండా సరదాగా మాట్లాడుకుంటున్నవారిని కర్రలతో కొట్టి పోతున్నారు" టీ కొట్టువాడు ఆశ్చర్యంగా అన్నాడు.

గంట క్రితం క్రిష్ణమూర్తి చదివిన వార్త కళ్ళల్లో మెదిలింది. వారణాశిలో 'పప్పు' టీ స్టాలు దగ్గర చర్చించుకుంటున్న గ్రూపులను అరెస్టు చేసారని. ♦

## కవిత

# కదిలి రా!

- శ్రీనివాస రాజు పెన్మెత్స
93 81919486



'దిశ'-
ఏ భీభత్సం నీ ఉనికిని అదృశ్యం చేసిందో-
నింగికెగురుతూ నీవు రాల్చిన కన్నీటి చుక్కలు
అగ్ని వర్షమై
మా కుసంస్కారపు ముసుగులను
ఇంకా కాల్చాయో లేదో తెలీదు!

నిశ్శబ్దం మాట్లాడింది
ఉత్తర ధృవంలో చిక్కుకున్న చైతన్యం
ప్రవాహమై ముందుకురికింది!
ఇదంతా ఒక భీభత్సం నీ ఉనికిని అదృశ్యం చేసాకా....
అదేంటో సమాజంలో
అందరూ మంచివాళ్లుగా నటించేస్తున్నారు!

చీకటి సిగ్గుపడింది
దారుణం దాచినందుకు
జుగుప్సని ఆపనందుకు!
చీకటి భయపడింది..
'నెపం' తనపై నెట్టేస్తున్నందుకు!

చీకటి చిన్నబుచ్చుకుంది...
ఏదో ఒక వ్యవస్థపై బాధ్యత పెట్టేసి
"జనం" చేతులు దులిపేసికుంటున్నందుకు!
ప్రముఖులు పాపపరిహారం అయిపోయింది అని
'భ్రమ' పడుతున్నందుకు!
మాట్లాడితే మనం పవిత్రులమైపోము!
మాట్లాడనంత మాత్రాన దుండగుల జాబితాలో చేరిపోము!

ఒకవైపు సమాజంలో విచ్చలవిడితనం....
ఇంకో వైపు కట్టుబాట్లు....
ఈ ద్వంద్వంలో, హిపోక్రసీలో యువత నలిగిపోతోంది!

సమాజం విస్ఫోటనం వైపుకు
విచ్ఛిన్నం వైపుకు పరుగులు పెడుతోంది!

పెద్దవాళ్లు, గొప్పవాళ్ళు అని చెప్పుకునే వారు,
ఆస్తులు అక్రమంగా సంపాదించు
కోవడంలోనూ...,దాచుకోవడంలోనూ,
పెంచుకోవడంలోనూ....బిజీగా ఉన్నారు!
నాలుగు ఎకరాలో, నలభై ఎకరాలో
చుట్టూ గోడ మధ్యలో ఇంద్ర భవనాలు!
వీరికి తీరుబడి లేదు!
*All is well with the world* అని నిద్ర పోతున్నారు!
రక్షించాల్సిన "వ్యవస్థ"
వీరికి రక్షణగా నిలబడడంలోనే
పుణ్యకాలం గడిచిపోతోంది!
ఇక సమస్యని క్షేత్ర స్థాయిలో
ఎవరు అర్థం చేసుకుంటారు?

వైతాళికులను, ధర్మవీరులను,
పుణ్య పురుషులను మనం ఎక్కడ వెతకాలి?!
మంచి సమాజం నిర్మించడానికి???


యువత యవ్వన శక్తిని యంగేజ్ చెయ్యాలి,
ఆట, మాట, పాట, "నాటకం" వైపుకు వాళ్లు నడిచేలా...
"దిశ" ! వాళ్లని కదిలించు!

చటాన్ పల్లిలో వాళ్ల నల్గురినీ ఈ రోజు చంపేశాం!
దోషులు మరణించారు! కానీ "దోషం" మరణించలేదు!

ఆ చీకటిలో నిశ్శబ్దంలో కలిసిపోయిన
"మా" ప్రాణం, నీ మానం....
దేశం మత్తుని వదిలించాలని కోరుకుంటూ....
కన్నీటితో నీకు నివాళులు అర్పిస్తున్నా ♦

విశ్లేషణ

# పల్లె దోసిట్లో మట్టిగంధం




మెట్టా నాగేశ్వరరావు




- జుజ్జూరి వేణుగోపాల్
9912395420


కవిత్వమంటే ఏమిటి? పదాలు అందంగా, ఆకర్షణీయంగా కూర్చడం కవిత్వం కావచ్చు. ఊహల్లో విహరిస్తూ కల్పితాలు సృష్టించడం కవిత్వం కావచ్చు. 'పశువులు తొక్కిన నేల కవిత్వమంటారు' శివారెడ్డి. ఒదగని కవిత్వ నిర్వచనాన్ని ఇంత ఒద్దికగా, ఇంతకంటే మెరుగ్గా చెప్పలేం.

మనం ఈ భూమ్మీద చెవి పెట్టి ఉన్నప్పుడు, వినబడే ప్రతి కథ కవితే. ప్రతి పద్యం కవితే.

వాక్యమంటే...భూమిలోపల తపస్సు చేసీ చేసీ మొలకై బయటికొచ్చిన విత్తనంలా ఉండాలి అంటాడు మనిషాక పద్యం కవితాసంపుటిలో మెట్టా నాగేశ్వరరావు. ఈ నిర్విరామ కవి చేసిన పద్యగానాన్ని విందాం.

వృత్తులే వర్ణాలయ్యాయి. వర్ణాలు కులాలయ్యాయి. భారతదేశ చరిత్ర, సంస్కృతిని వృత్తి జీవనాన్ని ఉటంకించకుండా చెప్పడం అసాధ్యం. మానవ నాగరికతా వికాసంలో కులవృత్తుల పాత్ర కీలకాంశం. ఏ నాగరికతకు వాళ్ళు పునాదులో ఇప్పుడదే నాగరికత పరిశ్రమల రూపాంతరంతో వాళ్ళ కంచంలోని కూడుని లాగేసుకుంటుంది.

మెట్టా నాగేశ్వరరావు 'సారె మీద ప్రాణం' కవితను చూస్తే

***మట్టి బువ్వగా మారుతుందని/ కనిపెట్టిన తొలి శాస్త్రవేత్త కుమ్మరిదే.***

ఆ శాస్త్రమే అతడి బతుకు కుండను బద్ధలు కొట్టిన వైనాన్ని చూపించాడు.

***కుండ పాలిట లోహ యుగం/ మరణశాసనమై.../ కనిపించిన మట్టిపాత్రలన్నిటినీ/ పగుల కొట్టేసింది/ కుమ్మరి చక్రాన్నీ/ విరగ్గొట్టేసింది లోహ రాక్షసీ..!***

***గుండ్రని గాజుల మూటలెత్తుకుని/ గుండ్రని భూమి చుట్టూ ప్రదక్షిణ చేస్తేనే బతుక్కి రక్షణ.***

కులవృత్తుల జీవులు అనుభవాల తాళపత్రాలు. వృత్తిలో లౌక్యమే కాదు, సాటి మనిషికి మాట ఊతను అందించే మనసున్న రాజులు. అవి అమ్మే వాళ్ళు ఎంతో ఒబ్బిడిగా గాజుల్ని మూట కట్టినట్టే మాటలు మూటల్ని విప్పుతారు. కన్నీళ్ళను కప్పుతారు.

***చేతులకు గాజులెక్కిస్తూనే ఇల్లాలి కంటి కింద దిగులు చారల్ని పసిగడతాడు/ ఒడుపుగా మాట్లాడతాడు అందిస్తూ/ దుఃఖపు లోయల్లోంచి పైకి తీసుకు వస్తుంటాడు. (గాజుల రాజు)***

భారతదేశంలో ఆర్థిక అసమానతను మించిన రక్కసి సామాజిక అసమానత. అంటరానితనంతో స్వాతంత్ర్యం గడిచి 72 ఏళ్ళు అవుతున్నా సమానత్వపు పోరు ఆగలేదు. పల్లెల్లో దప్పు కొడుతూ సంతలు, సమావేశాలు, రేషను షాపు సమయాలు గురించి మన చెవికి సమాచారం చేరవేసే

దప్పుతాతను కవితగా చేసి కవి మన ముందుంచాడు.

*దేవత ఊరేగింపులో దబ్బువాద్యం/ ఊరంతా ఒక్కటి చేసి చిందులేయిస్తుంది/ పాడె దగ్గరైతే/ కన్నీటి విషాదపు లోతులన్నీ శబ్దాలుగా వినిపిస్తూ..!*

వివక్ష అంటువ్యాధిలా ఉన్న సమాజం అంటరానితనంతో దప్పు తాతను విషాదమూర్తిగా మార్చేసింది. ఆ సంవేదనల్ని చిత్రిక పట్టి కవి మన గుండెల్ని కదిలిస్తారు.

*ఒకసారి దప్పులేకుండా/ ఊరి మధ్యలోకొచ్చిన తాత/ మైలబుద్ధి ఊరు దూరంగా జరగడం చూసి/ దప్పుకొట్టడం మానేసాడు..!*

వృత్తి జీవన విధానమే కాదు...ధర్మం. మంగలి వృత్తి బ్రహ్మాండంగా వెలిగి పరువుని నిలుపుకోవాలనే ముఖాలతో పాటు పని విధానాన్ని, శాస్త్రీయ ప్రక్రియను అభివృద్ధి చేసింది. సైన్స్‌గా, సర్జన్లుగా తరతరాలుగా వారు చేస్తున్న అభివృద్ధిని మనం గుర్తుంచుకోనందు వల్ల వారి సామాజిక స్థితి ఇంకా దయనీయంగా ఉంది.

*పొద్దొడిచింది మొదలు గుంకిందాక/ ఎన్నో తలల్ని దిద్ది తీర్చుతాడు/ ఎన్నో ముఖాల్ని మెరుగు దిద్దుతాడు/ ఎన్ని చంకల కంపుల్ని భరాయిస్తాడో మరి/ వారి చేతులు ఇంద్రజాలం జేస్తాయి/ పిచ్చివాడిని సైతం/ ప్రేమగా దగ్గరకు తీసే ఆ చేతులను/ కలిసినప్పుడల్లా కళ్ళకద్దుకుంటాను. (పల్లె మంగలి)*

పన్నీరులా మురికిని జల్లుకుని అందరి బట్టల్ని కొంగల్లా ఎగరేసి జానెడు పొట్టకోసం గూనెడు బట్టలుదుక్కుంటూ రోజుల్ని దాటించేది రజకులు. కవి అదే సామాజిక నేపథ్యం నుండి వచ్చినవాడు. ఉపాధ్యాయుడిగా ఎత్తుకెదిగినవాడు. అయినా సరే...మానవీయ విలువలు, మానవ సంబంధాలు విధ్వంసం కాబడుతోన్న నేటి సందర్భంలో మూలాల్ని ఇలా సెలబ్రేట్ చేసుకోవడం అవసరం అంటాడు. బహు విధాల శ్రమజీవనాన్ని పొందాను కాబట్టే నా కవిత్వంలోకి శ్రమజీవులు హక్కుగా ప్రవేశించి వేదనామయ బతుకువెతలనీ, వ్యథలనీ రాయమనీ ఆదేశించారంటాడు. శ్రమను పొదువుకున్న విధం 'ఇస్త్రీ పెట్టె' కవితలో కనిపిస్తుంది.

*ఎర్రెర్రనివి/ ఎనిమిదేసి కళ్ళేసుకుని/ పక్క మీద/ బుజ్జి కుక్కలా దూకుతుంది మా ఇస్త్రీ పెట్టె*

కొండను చూచి తనలోని కురచదనాన్ని గుర్తుజేసుకుని కొండెక్కి నాలోని గర్వాన్ని కిందకి తన్నేసానని చెప్పుకున్న నిగర్వి కవి. అందుకే

*బతుకుదెరువును చూపించిన/ ఈ ఇస్త్రీ పెట్టె రుణం తీర్చుకోలేనని తెలుసు/ కనీసం దాని అస్తిత్వాన్ని తుప్పు పురుగు తినకుండా/ ప్రేమగా చాలా బాధ్యతగా/ పూల శాలువా కప్పి దాచుకున్నాను!* అంటాడు.

సిరియా అంతర్యుద్ధంతో రావణకాష్టంలా మండుతోంది. దీనస్థితిలో వలసలు. అడ్డుపడే ముళ్లకంచెలు, సముద్ర గస్తీలు, సరిహద్దు గోడలు, తూటాలు...వలస జీవి దాటాల్సినవెన్నో. అలా సిరియా నుండి టర్కీకి కాగితం పడవ లాంటి లైఫ్ బోటు మీద వెళుతూ మధ్యధరా సముద్రం నడి మధ్యలో నీళ్ళలోనే ప్రాణాలు పోగొట్టుకున్న సిరియా బాల శరణార్థి ఐలన్ కుర్దీ యుద్ధ భీభత్సాన్ని మరోసారి ప్రపంచానికి అర్ధమయ్యేలా చేసింది. "ఒక యుద్ధం గురించి" కవితగా మారింది.

*కత్తులతో బరిసెలతో బాంబులతో/ మానవ విధ్వంసం చేయడం యుద్ధమా!?/ కొట్టుకు చచ్చిపోవడం యుద్ధతత్వం గాదు/ మునిగిపోతున్న విరోధినైనా ఒడ్డుకు చేర్చి/ వాడి గుండె జోలిలో ఊపిరి నూకల్ని మిగల్చడమే/ కాలగురువు మెచ్చుకునే యుద్ధమంటే..!*

మానవ జీవనరేఖల్ని సజీవంగా, సమగ్రంగా చిత్రించేది నది. అలాంటి నదుల, కాలువల గుండెల్ని తవ్వుతూ పచ్చదనానికి మిగుల్చుకోని మోడులవుతున్నాం. చివరకు నదుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాం. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ అడవుల్ని కూడా ఆక్రమిస్తున్న నేడు అక్రమంగా ఇసుకను తవ్వి కోట్లు పోగేస్తున్నారు.

*ఇప్పుడు ఇసుక/ ప్రకృతి వరం గాదు/ అక్రమార్కులకు వరమైపోయింది/ ఇప్పుడు ఇసుక దొంగ బంగారమే/ పాతాళం దాకా ఇసుకని ఎత్తేస్తున్నారు/ కనీసం జ్ఞాపకంగానైనా దాని ఉనికుండేలా/ నేను ఈ బంగారపు పొడిని ఓ గుప్పెడు పదిలంగా దాచుకుంటాను!! (బంగారపు పొడి)*

హిజ్రాలు తమ శారీరక లోపానికి తాము కారణం కాకుండానే ఎగతాళి చేయబడుతున్న సమూహం. మానవత్వం మరిచిన ప్రపంచం వాళ్ళపట్ల చేపట్టే వెలివేత ధోరణి, ప్రదర్శించే చిన్నచూపు కవి హృదయాన్ని కదిలించింది.

*వాళ్లు దేహ లోపంతో పుట్టారు/అది కాదు కదా అసలు లోపమంటే/మనుషులేనని గుర్తించకపోవడం లోపం/ వాళ్ళని రకరకాల పేర్లుబెట్టి గేలి చేయడం లోపం/ మనుషుల్లో కలవకపోవడం లోపం.*

పరాన్న జీవులుగా వాళ్ళను మార్చింది సాటి మనుషుల అనాగరిక ప్రవర్తన కాదూ!? అందుకే కవి ఆవేశం సమాజం మీద బహిర్గతమైంది.

*మనుషుల్లారా!/ఆడా మగా కాని మనుషులు కొట్టే చప్పట్లు/ చప్పట్లు కావని వీధుల పాలు చేసిన/ సమాజం ముఖం మీద కొట్టే చెంపదెబ్బలవి. (వాళ్ళు కూడా మనుషులే)*

విప్లవాత్మక ఆలోచనలు, భావాలతో స్త్రీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి ఔన్నత్యాన్ని చాటాల్సింది పురుష సమాజమే. మనువు నస్త్రీ స్వతంత్ర్య మర్హతి అని చెప్పినా కూడా యంత్రనార్యంతు పూజ్యతే...అన్నాడు. సంస్కరణ అనే పవిత్రాశయాన్ని ముందుకు తీసుకెళ్ళిన నేలపై ఉన్నాం మనం. కరుడగట్టిన ప్రాచీన ఆచారాలను పక్కన పెట్టి హేతువాద వైఖరిని అవలంభించాల్సిన సమయంలో మనిషి పశుత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు.

*ఆయన పక్కన లేడన్నప్పటి నుంచి/ ఆమె ఉన్న ఇల్లు/ వీధి కుక్కలకు లోకువగా మారుతుంది!/ శుభకార్యాలకు ఎప్పటికీ పిలుపు అందుకోలేదు/ దారి కూడా ఎదురు రావొద్దని బెదిరిస్తుంది.*

బాహ్యరూపాన్ని బట్టి అంతర్గత శూన్యాన్ని అర్థం చేసుకోం. కానీ భర్తలేని భార్య దుఃఖంతో వాస్తవాలను జీర్ణించుకుని సర్దుకుపోయి జీవించడానికి హృదయంలో తన సొంత శక్తి వైపు తిరగాల్సి ఉంటుంది. అయినా వేదనాపూరిత క్షణాలు మనిషిని లోబరుచుకుంటాయి.

*విపక్షాల మధ్య రక్షణ లేకుండా/ అతడు లేని ఆమె/ పున్నమినాడు అమావాస్యను మోస్తూ/ వెలుగులోనూ చీకటి క్షణాల్నే దాటించక తప్పదు/ అతడు లేని ఆమె/ నీళ్లు లేని నదిలా మూగబోతది. (అతడు లేని ఆమె)*

ప్రతి కవికి తాత్వికత చాలా అవసరం. కొన్ని జీవితాన్ని వెలిగించే తలపోతలుండాలి. ఈ కవి జీవితం వైపు కూడా అవలోకనం చేసాడు. సారభూతమైన వాక్యాల్ని అందించాడు. కవిత్వానికి ప్రాణం పోసేది తాత్వికత. ఆఖరి కూర్పు, తలపోత, దుఃఖ చరణాలు కవితలు పరిశీలిస్తే ఈ కవిలో ఆ అంశం కూడా ఉండడం పరిపూర్ణతకు నిదర్శనం.

జీవితంలోని కొన్ని ఉజ్వలమైన క్షణాల్లో కవి తన లోపలి కన్నుతో బంధించిన దృశ్యాలుంటాయి.

అవి పదచిత్రాలుగా కవిత్వంలో ఉపయోగించే సాధనాలు. వీటినే ప్రతీకలంటారు.

మాటలకందని అనుభవాలను ఈ పదచిత్రాల ద్వారా కవి మానసిక ఆవరణంలోకి ప్రవేశిస్తాయి. అక్షరాలకున్న సామాన్యర్థాన్ని తీసేసి కొత్త అర్థంతో పాఠక హృదయ లోకాన్ని అలరిస్తాయి. మెట్టా కవిత్వంలో పదచిత్రాల ప్రవాహముంది.

*- చెట్టు ఆకుల బుగ్గల్ని/ గాలికుర్రాడు గిల్లితే/ కొమ్మల చేతులతో/ వాడి చెంపలు వాయించింది*

*- తరువు తరుణి వేసుకున్న/ ఆకుల దుస్తుల్ని విప్పి దిగంబరం చేసాడు/ చిలిపి శిశిరం పురుషుడు!*

*- చినుకుల సిరాతో/ మబ్బు కవి/ పొలం కాగితంపై పంటకావ్యం రాస్తుంటాడు.*

*- పొయ్యిమీది పాత్రకి/ నల్లరంగు వేస్తున్నాడు/ నిప్పు పెయింటర్ !*

ప్రముఖ కవి యాకూబ్ "కవిత్వంలో నోస్టాల్జియా (పురా స్మృతి) అనేక రూపాల్లో ప్రహిస్తుంటుంది. నోస్టాల్జియా అనేది కేవలం పాత జ్ఞాపకాలు మాత్రమే కాదు, ఒకప్పటి నివాస పరిస్థితుల కోసం బలమైన కోరిక" అని నోస్టాల్జియాను నిర్వచించారు.

*- బొగ్గులు నా నాస్టాల్జియా/ బాల్యంలోని కుంపటిని కళ్ళముందుకు తెస్తాయి/ నా బాల్యమంతా/ బొగ్గుతోనే గీతగీసుకుని ఆడింది.*

*- అశోకుడు మళ్ళీ పుడితే బాగుణ్ణు/ జ్ఞాపకమైన పులివాగు మళ్ళీ నిద్రలేచేది!/ నాకు తాత చెప్పిన ఆ నాటి పులివాగు గాండ్రింపు వినాలనుంది!*

*- ఇంటి కిటికీని చూసినప్పుడల్లా/ కళ్ళల్లో కదలాడే బోడిమేక రొట్ట నెమరేస్తున్నట్టు/ మా ఇంటిళ్ళపాదీ దాని జ్ఞాపకాల్ని మనసు నిండా నెమరేసుకుంటాం.*

*- ఇప్పటికీ సెలవు దినమొస్తే సైకిల్ తిప్పుతాను/ నా మనసుని జ్ఞాపకాల పయ్యల్ని చేసి నడుపుతాను*

*- నా బాల్యపు బండి మీద/ గొడ్డలికి చాలా చోటిచ్చాను/ అది నాతో నరికించిన పుల్లల వల్లే/ నాలోనూ శ్రామికుడున్నాడని కనుగొన్నాను.*

*- ఎప్పటికీ/ మా నాల్కల మీద నిల్చుండే/ తరగని పాలనురగ/ మరువలేని మా ఇంటి పెన్నిధి మా లచ్చి గేదె..!*


ప్రముఖ కవి, విమర్శకులు ప్రసేన్ బి.సి కవులు దళితవాదం నుండి బయటపడి తమ గొంతును ప్రత్యేకంగా

## కవిత

# హమ్ దేఖేంగే

- డా. ఎన్. గోపి

*ఇది తప్పుని ధిక్కారం*
*పువ్వులను కాపాడుకునే*
*తుమ్మెదల ఝుంకారం.*
*పాముల వేటకు బయల్దేరిన*
*చీమల సంచారం.*



*మానవత్వాన్ని*
*సాంకేతిక చట్రాల్లో బిగిస్తే*
*చరిత్ర గుండెల్లో రేగిన హాహాకారం*
*వలసలకు వక్రభాష్యం చెప్తే*
*ఎలుగెత్తిన ఘీంకారం.*

*ఒకే ఆలోచన*
*చెదిరిన విచక్షణ*
*విచ్ఛిన్నానికి చుట్టిన శ్రీకారం*

*కవి ఎప్పుడూ*
*ప్రతి పక్షమే*
*అదే అతని అధికారం.*
*కొందరికైనా భరోసా దొరికితే*
*ముఖ్యంగా బాధితులకు*
*అదే నిజమైన ఓంకారం*
**- (ఫైజ్ అహమద్ ఫైజ్ కు)** ♦

---

వినిపించాలన్న సద్విమర్శ స్ఫూర్తి నుండి మెట్టా నాగేశ్వరరావు బిసి వాదానికి - సాహిత్యానికి సంధాన కర్తగా మారుతున్నాడు. త్వరలో రానున్న చాకిరేవుకు చెందిన "అంటుకట్ట" దీర్ఘకవితతో రాజకీయ క్రీడల్లో ఆటవస్తువైన బి.సిల గుండె చప్పుడును వినిపించనున్నాడు.

కాలుష్యం విదిలించుకుని కవి నడిచిన దారిలోనే మనమూ నడవాలి. కవులు పల్లెను పలవరిస్తారు. కానీ, అక్కడకు అడుగు పెట్టడానికి విముఖత ప్రదర్శిస్తారు. మెట్టా ఉపాధ్యాయుడైనా సాయంత్రంకల్లా తిరిగి తన పల్లెకు పోకుంటే నిద్రపోడు.

పల్లెకు పోతాను. నగర వైరాగ్యం నుండి విడుదలై కొన్ని రోజులైనా పల్లెపనుల్లో తలమునకలై వస్తాను. గేదెలను మళ్ళంటా తిప్పి మేపుకొస్తాను. పాలు పితికి పరవశించొస్తాను. మీగడకట్టిన పెరుగుని తృప్తిగా తాగొస్తాను. వరిమడిలో దమ్ము చేసొస్తాను. కొద్దిగా తడిమన్నును గుండెకు పూసుకొస్తాను. చిరుగాలికి తలలూపుతున్న వరిమడిపై గుండెను ఆనించి రైతును ఒక కంట చూడండని మాట్లాడొస్తాను అని పల్లెని, మట్టికి పర్యాయపదాలైన మనుషుల ఆప్యాయతల్ని దోసిట్లోకి తీసుకుని ఆకుపచ్చని పద్యాలు రాసి మట్టిగంధాన్ని పూసుకుంటాడు.

అవును మనిషొక పద్యం!

ఏమీ రాయని పలకలాంటి శైశవ మనఃస్థితి మెట్టా నాగేశ్వరరావుది.

ఆ శైశవంలో అమ్మను పిలవడానికి పడే తాపత్రయం మనిషొక పద్యం కవితా సంపుటి.

అక్షరాల్లో చెప్పలేక బాధకే పరిమితమయిన బానిస జీవితాన్ని నాగేశ్వరరావు పద్యంగా పాడుకున్నాడు.

ఇది నాగేశ్వరరావు జీవితానికి వ్రాసిన మొదటి ప్రేమలేఖ.

అతడు చిన్నప్పటినుండి దాచుకున్న డిబ్బీని మనముందు బద్ధలుకొట్టాడు.

పోటెత్తే వరదలో నిలబడి రోజంతా పట్టిన

మట్టగడసల పులుసులాంటి పద్యాన్ని మన పాత్రలో పోసాడు.

బతుకు కాలువ దాటడానికి తాటిదోనె వంతెనలాంటి పద్యాన్ని కట్టాడు.

ఇప్పుడిక ఇతడి ఆత్మదప్పిక తీరింది.

చేదుకుని మనం కూడా ఈ గోదారి నీటిని తాగాం.

తెల్ల మబ్బుల్లోంచి అతడు మనకు గీసిచ్చిన ఈ చిత్తరువును మనం పద్యంగా ఎదకు పొదువుకున్నాం

గుర్తుంచుకోండి

నాగేశ్వరరావు పద్యమైన మనుషులందరి వెంటపడి చివరకు ప్రతి మనిషిని పద్యంగా చేసేసాడు.

ఎందుకంటే అతడు శైశవాన్ని అర్ధం చేసుకున్నాడు.

అలా అర్ధం చేసుకోవడానికి శైశవంలోకి వెళ్ళిపోయాడు.

మనిషొక పద్యం- మెట్టా నాగేశ్వరరావు పుస్తకం కోసం కాల్ చేయండి - 99 510 85 760 ♦

కవిత

# జంబూక - ద్వీపం


- డాక్టర్ మాటూరి శ్రీనివాస్
9849000037



నిజమే పుట్టినప్పటి నుండీ మనిషిని పశువుని నమ్ముకుని బతికినోడ్ని
పుట్టు నాగరీకున్ని కదా వోర్పు సంస్కారం పాళ్ళు ఎక్కువ
అప్పటి వరకూ మూలాన నక్కి మెదడులో విషాన్ని నింపుకుని వచ్చాయి
నీకొక అందమైన దేశాన్ని నిర్మిస్తాను నాతో చేతులు కలుపని
తెల్ల గెడ్డం నక్క ప్రకటిస్తే,
అదీ నీ కొక్కడికే సొంత మని వంత పలికిందో బలిసిన గుంట నక్క
ఎప్పటిలాగే యిట్టే నమ్మేసాను
పైగా అవి రాముడి పేరు జపిస్తున్నాయని ఎగిరి గంతేసాను
వాటితో పాటూ వందల్లో గొర్రెలు కలిసి రావడంతో పులకించిపోయి
సముద్రంలో నీటి చుక్క లాగా నేనూ మందలో కలిసి పోయాను
ఆ గొర్రెల బుర్రల్లో మదము మత్తు ఎక్కించి మూర్ఖత్వాన్ని నింపాయని తెలీలేదు
నా దేశానికి పునాదికి అనాదిగా ఉన్న దర్గాని ఎక్కి కూల్చేయమన్నాయి
తరాలుగా అజమాయిషీ చేస్తున్న కొన్ని ముసలి నక్కలు
కూల్చేసిన ఆనందానికి గొర్రెలతో పాటూ నాకూ సభ్యత్వపు రంగును పంచారు,
చెడ్డీ వేస్కుని హోలీ చేసుకున్నాను, ఆ ఉన్మాదంలో
నా దేశానికి కంచె కడదామని వంకతో
ప్రహరీగా ఉన్న కాశ్మీరు లోయని మట్టితో ముంచేసాం
తిరగబడ్డ పులుల్ని మేకలుగా మార్చేసాం, బలం పెరిగింది.
అదను చూసి అవకాశం కోసం రంకెలు వేస్తూ కొల్ల గుర్రాల్లా తయారైయ్యాం
నిమ్మకున్న అన్య రంగు గొర్రెలు మేస్తున్న గడ్డి వాముల్ని కాల్చేసాం
గర్వంగా దేశభక్తులమని మాలో మేమే కోపిష్టి ఆంజనేయ బొమ్మలని
జ్ఞాపికలిచ్చేసుకుని , త్రికోణ జెండాలను ఎగరేసుకున్నాం .
ఇంతలో అవే అన్య రంగు గొర్రెల నోళ్ళు పెంచుతున్నయన్న
అనుమానంతో ఒక్కసారిగా మేమంతా పాకిస్తానీ గొర్రెల్లా మారిపోయాం
మా రంగు గొర్రెలు వాళ్ళ మోజులో పడతాయనే భయంతో
ప్రేమించుకున్న గొర్రెల్ని నరికేసి మా నక్కల్కి నైవేద్యంగా పెట్టాం
పుంసత్వంతో పోటీ పడలేక వాటి విడాకుల చట్టాన్ని పూడ్చేసాం
అంతా బాగానే ఉందనుకునేలోగా పరదేశీ గొర్రెలు
మా దేశంలో గడ్డి మేయడాకి ఎగబడ్డాయని ఎవరో చెపితే
వాటిని లెక్క కట్టామా తీరా చూస్తె అవి తొంభై శాతం మా జాతివే ,
నాలుక్కరుచుకుని వాటికి గడ్డి వేసి
మిగతావి గోల చేస్తున్నాయని దొడ్లో కట్టేశాం ,
అంతే ఒక్కసారిగా దేశంలోని జంతువులన్నీ ఏకమైపోయాయి
దేశ ద్రోహ నేరం ఆరోపించి అప్రకటిత ఎమెర్జెన్సీ ప్రకటించాయి నక్కలు
ఇప్పుడిప్పుడే మా గొర్రెల మందకు ఏదో ఆలోచన వచ్చినట్టుంది,
మా కుట్ర పారకపోగా మేం త్రవ్విన గోతిలో మేమే పడిపోయే పరిస్థితి
మాతో పాటూ మా దేశం కూడా అదే గోతిలోని దుర్గతి లోనికి...

♦

# పల్లె ప్రజల పలుకు బడులకు పట్టం కట్టిన కథలు




ఆర్.సి. కృష్ణస్వామి రాజు



- పిళ్లా విజయ్
9490122229

ఆర్ సి కృష్ణస్వామి రాజు జీవిత భీమా సంస్థలో అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ మధ్యలో వదిలేసిన తన సాహితీ ప్రస్థానాన్ని మళ్లీ కొనసాగిస్తూ గత రెండేళ్లుగా 150 పైగా కథలు రాశారు. వాటిల్లో తనకు నచ్చిన 18 కథలను 'ముగ్గురాళ్ళ మిట్ట' పేరుతో కథా సంపుటిని తీసుకొచ్చారు. ఇందులో చాలా కథలు వివిధ సంస్థల నుంచి పురస్కారాల్ని పొందినవే. ఆయన చెబుతున్నట్లు ఇందులోని కథలన్నీ ఆయన బాల్యం, ఊరు, కుటుంబం నేపథ్యంలో జరిగిన సంఘటనల నుంచి వచ్చినవే.

మంచి కథకు క్లుప్తత, అనుభూతి ఐక్యత, సంఘర్షణ, నిర్మాణ సౌష్టవం ఉండాల్సిన లక్షణాలనీ ప్రముఖ సాహితీ విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంచి కథ ఎప్పుడూ పాఠకుని హృదయంలో నిలిచిపోతుంది. అది కథా లక్షణాలతో ఒక్కోసారి లేకపోయినా కూడా. కథ పాఠకుని వేలు పట్టుకుని నడిపించుకుంటూ చదివించేదిగా ఉంటే ఆ కథ నల్లేరుపై నడకలాగా ఆహ్లాదంగా ఉంటుంది. కథలో ఎలాంటి సస్పెన్స్ మలుపులు లేకపోయినా చివరకు ముగింపు ద్వారా పాఠకునిలో దాగిఉన్న మానవీయ గుణాలు ప్రేరేపించబడితే అదే కథకు మంచి ఆభరణంగా నిలుస్తుంది.

పాఠకుని తనతోపాటు తీసుకెళ్లి గలిగే లక్షణం కృష్ణస్వామి రాజులో పుష్కలంగా ఉంది. తమ జానపద సంస్కృతుల్ని కళల్ని తమ రచనల్లో విరివిగా ఉపయోగించుకొని కథలు రాస్తే అవి సహజత్వానికి దగ్గరగా ఉంటాయని ఆఫ్రికా దక్షిణ అమెరికా రచయితలు, విమర్శకులు భావిస్తారు. మన తెలుగు రచయితలలో చాలామంది రాయలసీమ జానపద కళలను సంస్కృతులను మాండలికాలను తమ కథల్లో ఉపయోగిస్తున్నారు. ఈ కథలన్నీ ఈ కోవలోకే వస్తాయి. ఈ కథల్లో సీమ సంస్కృతులు ముఖ్యంగా చిత్తూరు జిల్లా యాస, నుడికారం, సామెతలు ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి.

కథకు ఒక సామాజిక ప్రయోజనం ఉంటుందని చెప్తాడు త్రిపురనేని మధుసూదనరావు. గురజాడ పాఠకుని సంస్కారవంతుని చేయడానికి ఉపయోగపడుతుందని భావిస్తే బాలగోపాల్ అది పాఠకుల చైతన్యవరచడానికి ఉపయోగపడుతుందని భావించాడు. సామాజిక సమస్యలకు కథ ద్వారా పరిష్కారం చెప్పవచ్చని రాచపాళెం లాంటి విమర్శకులు చెబుతున్నారు. ఏ రచన పాఠకునిలో మానసిక ప్రక్షాళనం చేస్తుందో అది ఉత్తమ రచనగా వర్ణించాడు అరిస్టాటిల్. కృష్ణస్వామి కథల్లో అతని శిల్ప రచన పాఠకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. అంతేగాక బడి బియ్యం, గొర్రెదాటు, బామ్మ బొచ్చు కుక్క కథలు పాఠకుని హృదయ వైశాల్యాన్ని

పెంచుతూ గుండెలోని తడిని ఆరనివ్వకుండా చేస్తాయి.

చిన్ననాటి మధురస్మృతులు ప్రతి ఒక్కరినీ కట్టిపడేస్తాయి. 'ఆ కాలాలే వేరు' అనుకుంటూ ఆ తీయ తీయని తడారని జ్ఞాపకాలు ప్రతి ఒక్కరి మదిని ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. వాటన్నిటినీ రెడ్డోళ్ల బావి, కొక్కిరాళ్ల కొండ కథల్లో చూడొచ్చు. పల్లెల్లో పసివాడని బాల్యం, మాయ మర్మాలు లేని బాల్యం ఉంటుందని అదే పట్టణాల్లో అయితే బాల్యం అత్తిపత్తి లాంటి స్నేహాల మధ్య నడుస్తుందని రచయిత ఈ కథల్లో వ్యక్తం చేస్తాడు. శీను ఒకచోట "స్నేహమంటే ఏమిటో మిమ్మల్ని చూస్తే తెలిసింది. ఒకరి కోసం ఒకరు ప్రాణాలు ఇవ్వడం, ఏమైనా చేయడం. మా సిటీ లో మా కాన్వెంట్లో అంతా టచ్ మీ నాట్ స్నేహాలే. ఇరుకు గదుల్లో కూర్చోవడం, పోటీపడి చదవడం, ట్యూషన్ ..పరుగో పరుగు ...ఆటల్లేవ్ పాటల్లేవ్" అంటూ కిష్టడు, దీనదయాలుతో చెబుతూ ఏడుస్తాడు. ఇలాంటివి ఈ కథల్లో మనం నేటి సామాజిక వాస్తవికతగా చూడొచ్చు.

"అందరి కోసం ఒక్కడు నిలిచి ఒక్కని కోసం అందరు నిలిచి"అనే పాట అందరికీ తెలుసు. ఇలాంటి సందేశాన్ని ఇచ్చే కథా చిత్రణ ముగ్గురాళ్ళ మిట్ట , ఊరు వుప్పు కథల్లో మనం చూడగలం. ముగ్గురాళ్ళ మిట్టలో ప్రమీల పరీక్ష రాయడానికి ఉప్పలివంక నుంచి కుప్పంకు పోవాలంటే ఆటో పంచరై ఉంటుంది. అప్పుడు 'మన ఊరి పిల్ల పది పరీక్ష మిస్ అయితే ఊరుకుంటామా? ఏంది! మేము లేమా! ఏంది' అంటూ అందరూ ప్రమీలకు సహాయం చేయడానికి ప్రయత్నం చేస్తారు. ఇంతలో ప్రెసిడెంట్ సిబ్బాల సుధక్క కారులో ఆ పాపను తీసుకెళ్తుంది. ఇందులో మారుతున్న రాజకీయ ముఖచిత్రాన్ని కూడా అంతర్లీనంగా గమనించవచ్చు. ఊరు వుప్పు కథలో ఒకే ఊరు నుంచి ఐదు మంది డాక్టర్లు అవుతారు. వాళ్లు "మన ఊరి బిడ్డలం మేము. మేమంతా ఆడిపాడిన నేల ఇది. అందరం కలిసి మెలిసి బతికినోళ్లం. ఇక్కడ గాలి పీల్చి ఇక్కడ నీళ్లు తాగినోళ్ళం. మా వంతు సాయంగా ప్రతినెల రెండో ఆదివారం నాలుగో ఆదివారం ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తాం" అని ప్రకటిస్తారు. భవిష్యత్తులో రాబోతున్న మార్పుకు సంకేతంగా నిలుస్తుంది కథ.

జీవితంలో కలిగే అనుభవాలే కథలుగా రూపుదిద్దుకుంటాయి. అవి సార్వజనీనం కూడా అవుతాయి. ఎందుకంటే అలాంటి అనుభవాలు ప్రతి ఒక్కరి జీవితంలో సంభవించే ఉంటాయి. అనుభవంలోంచి సున్నితమైన అంశాలను కథగా మలిచే నేర్పు కృష్ణస్వామికి ఉంది. నమస్కారంతో ఎన్నో పనులు నిత్యజీవితంలో జరగడం చూస్తుంటాం. కుటుంబంలో, ఆఫీసులో, రాజకీయాల్లో నమస్కారం ఎలా పనిచేస్తుందో పనులు జరిపించడానికి నమస్కారం ఎంతలా పనికి వస్తుందో 'నమస్కారం 'కథ చెబుతుంది. నమస్కారాల్లో ఎన్ని రకాలు ఉన్నాయో కూడా చెప్తాడు రచయిత. దొంగ నమస్కారం నుంచి మొక్కుబడి నమస్కారం వరకు ఉన్న అనేక రకాల నమస్కారాలను లౌక్యం తెలిసిన వారు ఎలా ఉపయోగిస్తారో సుబ్బరాజు నంజుండప్పతో చెబుతాడీకథలో. కూతురు తన భర్తతో కలిసి అమెరికా నుండి తండ్రికి డబ్బులు పంపి ఒక అపార్ట్మెంట్ కొనమని, అది తల్లిదండ్రులకు లేదంటే చెల్లెలుకో ఉపయోగపడుతుందని చెప్తుంది కొరమీను గుంట కథలో. ఆడ బిడ్డైనా మగ బిడ్డైనా అమ్మ నాన్నల్ని, తోడబుట్టిన వాళ్లను ఆదుకుంటామనే ఆలోచన ఉంటే ఎంత మేలో అన్న విషయాన్ని వివరిస్తుందీ కథ. తన విద్యార్థుల యోగక్షేమాల గురించి ఆలోచించే ఉపాధ్యాయురాలి కథే 'గురుదేవోభవ'. అరుణ ఒక టీచర్. ఆమె తన ఆపరేషన్ను విద్యార్థుల కోసం వాయిదా వేసుకుంటుంది. ఇలాంటి వారి వల్లే విద్యావ్యవస్థ వర్ధిల్లుతోందనే సందేశాన్ని ఇస్తాడు రచయిత.

సమాజంలో అనేక మూఢ విశ్వాసాలుంటాయి. ప్రజలు తెలిసో తెలియకో వాటిని పాటిస్తుంటారు. కానీ రచయితకు మాత్రం వాటి పట్ల సానుభూతి ఉండరాదు. విమర్శనాత్మక దృష్టితో పాటు శాస్త్రీయ దృక్పథం కూడా రచయితకు ఉండాల్సిన అవసరం ఉంది. కథల్లో వాటిని చెప్పేటప్పుడు వాటి వల్ల సామాజిక ప్రయోజనం లేదన్న విషయాన్ని ఎక్కడో ఒకచోట ఒక పాత్ర ద్వారా చెప్పించాలి. ఇక్కడే రచయిత చైతన్యం బహిర్గతమవుతుంది. రామక్కవ్వ కథలో ఇలాంటి దృష్టి లేకపోవడం వల్ల వర్షం పడడానికి కప్పలకు పెళ్లిళ్లు చేసినట్లు, అందువల్ల వర్షం పడినట్లు రచయిత చూపించారు. వాస్తవంలో ఇలా జరగదు. అదే నిజమైతే రాయలసీమలో కరువు ఉండేది కాదు కదా! పైగా వర్షం పడాలంటే పర్యావరణాన్ని ఎలా రక్షించుకోవాలో చెప్తే ఇంకా ప్రయోజనం ఉంటుంది. ఇలాంటి కథలు రాసేటప్పుడు రచయిత కొంత జాగ్రత్త తీసుకోవడం అవసరం.

'పాఠాలు వేరు ప్రాక్టికల్ వేరు' అన్న సూత్రాన్ని విభేదిస్తూ

## కవిత

# నిరంతరం ప్రశ్నలం...

- చల్లగాలి బాబూరావు
09941409720



మేమింకా ప్రశ్నలమే...
మీ మనువాద జులం క్రింద
సుదీర్ఘంగా నానుతున్న
ప్రశ్నా పత్రాలమే...
ఈ కుహనా సమాజంలో
అసహనపు ఆధిపత్యాన
చిత్తు చిత్తుగా చిద్రమౌతూ
ఒదుగుతూ.. ఓడిపోతున్న
దిక్కులేని ప్రశ్నా పత్రాలమే...

కుళ్ళు రాజకీయపు
కపటతనం సాక్షిగా చరిత్రిప్పుడు
సరికొత్త భాష్యానికి
అర్థ వివరణ అందిస్తుంది...

వాడవాడలా మేం
గాయపడ్డ గేయాల మౌతున్నాం
మా చావు ఒక దౌర్జన్య క్రీడగా
పత్రికల శీర్షికలో నూతనంగా
ఆవిష్కరించ బడుతూనే వుంది
మేమింక
మీ మనువాద సంకెళ్ళను
వూడబెరుక్కొని
మేమొక నిత్య జవాబులమై
సరికొత్త సూర్యులమై
నిలువెల్లా నిలదీసే ప్రశ్నలమై
ఊరంతా విప్లవ జ్వాలలమై
ఊరికి పుష్పాలమై మీ దరిలోనే
ఉద్యమాల రూపాలౌతున్నాం

ఇక మీ ఆగడాల ముందు తలొంచం
మా బ్రతుకుల్ని దోసిట్లో
పెట్టుకొని కాపాడుకుంటాం
ఈ అధర్మ పాలనా యుగాన
మీ నీతి వెలుగుల జాడేది?
సమధర్మం లేని సన్నాయి రాగాలే కాని
తమ తమ బాధ్యతల్లో
సజీవత్వం నిర్మలంగా వుందా!?
మా ఆకలికి దూరం లేదా?
మా మాటకి వాసన లేదా?
మేం మనుష్యులం కాదా?
మీలా మేం పుట్టనే లేదా?
మీదెప్పుడూ చాదస్తమే?
మాదెప్పుడూ బాధ్యతా రాహిత్యమేనా...?
♦

నేర్చుకున్న పాఠాలు సరైన పరిష్కార జ్ఞానాన్నిస్తాయని నిరూపించిన కథ అడవిపంది కథ. రామ తులసి వ్యవసాయ సంబంధ చదువు చదివినమ్మాయి. ఆమె సలహాతో ఎర్రగడ్డ తెల్లగడ్డ కలిపి మెత్తగా నూరి గోధుమపిండిలో కలిపి ఉండలుగా పొలాల్లో పందులకు ఎరగా వేస్తారు కమలక్క, కుప్పడు మొదలైనవారు. అవి తిని పందులు పారిపోతాయి. అట్లా పొలాలను రక్షించుకుంటారు. విద్య వేరు వాస్తవం వేరు అని చెబుతూనే చివరకు విద్య వల్లే మంచి నిర్ణయాలు వస్తాయనే సందేశాన్నిస్తాడు రచయిత. ఈ కథలో రచయిత ఏం చెప్పాలనుకున్నారో స్పష్టం కాలేదు. కథన శిల్పంలో కొంత శ్రద్ధ తీసుకొని ఉంటే బాగుండేది.

కథల్లో కృష్ణస్వామి రాజు తన స్వానుభవం వల్ల, పల్లె ప్రజలతో మమేకం కావడంవల్ల అలవోకగా రామలక్క పడిశం ప్రకాశం, దగ్గుల జగ్గయ్య, కత్తుల కాంతారావు ఇలా ఎన్నో పేర్లున్న వారిని ఆయన తన కథల్లో పాత్రలుగా వచ్చి నిలుపుతారు. సామెతల కైతే కొదవే లేదు. సామెత లేని కథ లేదంటే ఆశ్చర్యం వేస్తుంది. 'తలగడ తిరిగేస్తే తలనొప్పి పోతుందా', 'గుండ్రాయి దాస్తే పెళ్లి ఆగిపోతుందా', 'ఒంటికి ఓర్వలేనమ్మ రెంటికి నేర్చునా', 'వంగిన వెదురు పెళ్ళిపందిరికి నిగుడు కున్న వెదురు పాడెకు వాడుతారు', 'మాకే లేదు నాకుడు బెల్లం, నీకు ఎక్కడ నుంచి తెచ్చేది గోకుడు బెల్లం,' ' కాశీకి పోయినా కావడి మోయాల్సిందే కదా' ఇలా ఎన్నో తెలుగు సామెతలు కథల్లో చక్కగా ఒదిగిపోయాయి. కృష్ణస్వామి రాజు ప్రతి కథను కవితాత్మక వాక్యంతో ముగించడం ద్వారా కథకు మంచి బలం ఇస్తాడు. ఇది ఆయన కథన శిల్పానికి వన్నె తెచ్చింది.

రాయలసీమ యాసను, భాషను, నుడికారాన్ని చక్కగా పట్టుకుని జీవనగమనంలో వచ్చిన ప్రతి చిన్న సందర్భాన్ని ఎంతో నేర్పుగా కథగా మార్చగలిగే నైపుణ్యం కృష్ణస్వామి రాజుకుంది. అయితే బలమైన కథా వస్తువును గుర్తించి కథలో సంఘర్షణను ప్రవేశపెడితే కథకు బిగువు వస్తుంది. అప్పుడు పాఠకుల్లో చైతన్యాన్ని పెంచడమే గాక ఆ కథ నాలుగు కాలాలు పాటు సాహిత్య లోకంలో నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు. ఆ దిశగా ఆయన తన కథ ప్రస్థానాన్ని సాగిస్తారని ఆశిద్దాం.
♦

## కవిత

# అపరిష్కృత అర్జీ!

- దాకరపు బాబూరావు
9848993599



ఒక్కసారికాదు
వారం వారం
వాడొస్తాడు-
జోడించిన చేతుల్లో
వణుకుతున్న దీనత్వమై
ఒక అపరిష్కృత అర్జీ లా వస్తాడు-
అదో
ప్రభుత్వ కార్యాలయం.....
వచ్చీ రాగానే
గుమ్మం ఓరగా విడిచిన చెప్పుల్లో
తన్ను తాను ఒదిగి తగ్గించేసుకుంటాడు
పట్టువదలని తనానికి
నిలువెత్తు నిదర్శనం లా
కాటికి కాళ్ళు చాపుకున్న వయసుని మోసుకుని
సాయం కోసం అందరివద్దకు తిరిగేస్తుంటాడు

నిందించడు హుంకరించడు
చదువుకోని పాపానికి
ఎవర్నో బతిమాలి డబ్బులిచ్చి రాయించుకున్న అర్జీలో
సిరామరకల్లా మిగిలిన గుండెకోతకు
అస్పష్ట వేలి ముద్రయి మెరుస్తుంటాడు
రేషన్ కార్డు అర్హత గానో పింఛను పథకం డబ్బుగానో
మారాలని చెయ్యి చాపడు
అన్నీ లాక్కుని
అన్నం పెట్టకుండా మోసం చేసి రోడ్డున పడేస్తున్న
కన్నబిడ్డల నుంచి
తల్లిదండ్రుల్ని కాపాడే చట్టాలుంటే చెప్పి
న్యాయం చెయ్యమని
కన్నీటి పర్యంతమౌతుంటాడు
తలపాగాలో చుట్టుకొచ్చిన
అమాయకత్వాన్ని
మాటలు మాటలుగా దులిపి
వేడికోలు వేదికౌతుంటాడు-
పున్నామ నరకాన్ని
బ్రతికుండగానే చూపిస్తున్న కొడుకులనుంచి
బంధ విమోచనా తీర్పులిప్పించమని
గొణుక్కుంటుంటాడు-
బాధల నదిలా మారిన హృదయాన్ని
ఒక్కసారిగా గేటులెత్తిన ఆనకట్టను చేస్తాడు
హాలంతా పరచుకున్న నిశ్శబ్దంలో
పొలికేక శబ్దమౌతుంటాడు............ ♦

# ఆవిష్కరణ

- కోవూరి శ్రీనివాసరావు
9966517046



నేడు కవితలకు పొద్దుపొడిచింది
భావ కవులకు నవోదయం
ఆహ్వానం పలికింది
నేడు ఆవిష్కరణల దినోత్సవం
రంగురంగుల తగరపు కాగితాలలో
కొలువుతీరిన కవితా సంపుటాలతో
తీర్చిదిద్దిన వేదిక పెళ్లికూతురులా
ముస్తాబై అందరి దృష్టి ఆకర్షిస్తుంది

వివిధ రకాలైన కవిత్వపు
భావజాలం జలజలా
జారటానికి సిద్ధంగా వుంది
సభికులదే ఆలస్యం అన్నట్టుగా
కవిత్వం పుణికి
పుచ్చుకున్న వారందరూ
చిన్నా పెద్దా వారివారి
కలాలకు పదును పెట్టి
కవితావనాన్ని ఆలోచనలతో
మేధస్సుతో
ఏరువాక మొదలెట్టినవారే
కవుల సంగమం
అక్షరాల సంకలనం
సమీక్షల వ్యవకలనం
చప్పట్ల గుణకారం
వీక్షకుల భాగహారం
మొత్తంగా గణితం
పరిపక్వము మెట్టుగా
అక్షర విత్తనాలు
మొక్కల సంపుటాలయ్యాయి
సమీక్షల పంట పండి
గోదాముల జనారణ్యంలో నిలిచి
తమ తమ
రేటును
ఆవిష్కరించుకుంటున్నాయి ♦



# కొక్కొరో కో

- సింహప్రసాద్

"ఒరేయ్, నేనలా టౌన్‌కి వెళ్ళొస్తాను. కోళ్ళను జాగ్రత్తగా చూస్తూండండి. పురుగూ పుట్రా రాకుండా చూడండి. ఎప్పటికప్పుడు అంతా శుభ్రం చేస్తుండాలి. నేను లేనని ఫీడ్, నీరు అశ్రద్ధ చెయ్యకండి సుమా!"

బైక్ స్టార్ట్ చేస్తూ పని వారికి సూచనలిచ్చాడు సుబ్బారాయుడు.

రాములు పరుగెత్తుకొచ్చాడు "అన్నా, మొక్కజొన్న అయిపోవచ్చింది. ఎలాగూ టౌన్‌కి వెళ్తున్నావుగా, పది బస్తాలేసుకురా"

"సోయా?"

"అవీ అవ్వొచ్చాయి. ఈ వారం ఎల్తాది...."

"చూస్తోంటే కోళ్ళు రైతుని తిని బలిసేట్టున్నాయి. తెస్తాన్లే...."

తిన్నగా టౌన్లోని మిత్రుడు ఆనందం దుకాణానికెళ్ళాడు సుబ్బారాయుడు. అతడు ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. అతడికి అన్ని పంటల గురించీ వ్యాపారాల గురించీ క్షుణ్ణంగా తెలుసు. గాలి వాటుని బట్టి అప్పులివ్వడానికి, వసూలు చేసుకోడానికి తాజా వివరాలు సేకరిస్తుంటాడు.

సుబ్బారాయుడెళ్ళేసరికి ఆనందం, మరి ముగ్గురూ గోడకమర్చిన టీవీలో వార్తలు చూస్తూ మాట్లాడుకుంటున్నారు.

"ఫిబ్రవరి 24న అమెరికా ప్రెసిడెంటు ట్రంప్ మనదేశానికి వస్తున్నాడు. అతడికి భారీ ఎత్తున స్వాగతమివ్వడానికి అప్పుడే సన్నాహాలు మొదలు పెట్టేసారు" ఆనందం చెప్పాడు.

"మోడీ అమెరికా వెళ్ళినప్పుడు ట్రంప్ ఇతడ్ని ఆకాశానికెత్తేశాడు. ఇప్పుడతడు ఇక్కడి కొస్తున్నాడు. అతడ్ని మన మోడీ ఇంద్రుడూ, చంద్రుడూ అని పొగిడేస్తాడు. అంతా ఎన్నికల రాజకీయ వ్యాపారం!" ఒకడు వ్యాఖ్యానించాడు.

"ప్రపంచమే ఒక పెద్ద వ్యాపారమోయ్. అమ్మడం, కొనడం సూత్రం మీదే నడుస్తోందీ ప్రపంచం" నవ్వాడు ఆనందం.

మిత్రుడ్ని ఇతరులకు పరిచయం చేస్తూ అన్నాడతడు. "ఇతడు సుబ్బారాయుడనీ బాగా విద్యావంతుడు. మంచి పౌల్ట్రీ రైతు. కోళ్ళను స్వంత బిడ్డల్లా సాకుతుంటాడు. వీడికి వాటి గోల తప్ప ఇంకేం పట్టదనుకో. ఇంతకీ దారి తప్పి వచ్చావేంటి గురూ" సుబ్బారాయుణ్ణి అడిగాడు.

"చైనా వైరస్ కరోనా గురించి అంతా గోలగోలగా ఉంది. దాని గురించి తెలుసుకుందామని వచ్చాను"

"ఉధృతంగానే ఉంది. చైనాలో చాలా మంది పిట్టల్లా రాలిపోతున్నారు. దాని వైద్యం కోసమే ఆగమేఘాల మీద కొత్త ఆసుపత్రులు కట్టేస్తున్నారంటే పరిస్థితి ఎంతగా బెంబేలెత్తిస్తోందో నువ్వే ఆలోచించు"

"గాలి ద్వారా కూడా వ్యాపిస్తుందంటున్నారు.

నిజమేనంటావా?"

"రూమర్ ఉన్నమాట నిజమే. నిన్నటిదాకా దగ్గటం, తుమ్మటం ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఇవాళ కరెన్సీ నోట్ల ద్వారా కూడా వ్యాపిస్తుందంటున్నారు...."

"కోళ్ళకూ వస్తుందంటావా?" ఆదుర్దాగా అడిగాడు సుబ్బారాయుడు.

మిర్రి చూశాడు ఆనంద్, "అందుకోసం వచ్చేవా. అలా చెప్పు. ఇంకా లేదులే. కంగారుపడకు. ప్రస్తుతం మనుషుల్నే ఫలహారం చేస్తోంది" అని నవ్వి అన్నాడు. "మొదట్లో చైనాలో కూడా కోడివల్ల, ఆ తర్వాత గబ్బిలాలు ద్వారా ఈ వైరస్ వచ్చిందన్నా, తర్వాత కాదనేశార్లే"

"అయితే నిశ్చింతగా ఉండొచ్చంటావా?"

"ప్రస్తుతానికి నీ పిల్లలు క్షేమం" నవ్వాడు.

"నెత్తి మీద పాలు పోశావురా. అటు తిరిగి ఇటు తిరిగి కోడిపిల్లల మీదకి వస్తుందేమోనని భయపడుతున్నా. వాటికేమైనా అయితే నా పని గోవిందే. నువ్వు ధైర్యం చెప్పావుగా. ఇంక నిశ్చింతగా ఉంటాన్లే" సంతోషంగా బయటికొచ్చాడు సుబ్బారాయుడు.

అక్కడి నుండి ఫీడ్ షాపుకెళ్ళాడు.

"మొక్కజొన్న రేటేమైనా తగ్గిందా శేటూ"

"లేదు 300 పెరిగింది. టన్ను 18,000. సోయా టన్ను 40,000. ఇంకా పెరుగుద్దంటున్నారు. అదో టన్ను ఇదో టన్ను తోలనా"

"పంపించు తిండి పెట్టకపోతే ఇక కండేం పడతాయిలే!"

అరువు బిల్లు మీద సంతకం పెట్టి లేచాడు. "సాయంత్రానికి వచ్చేస్తాయిగా"

"ఇంకో రెండుగంటల్లో లోడ్ బయల్దేరుద్ది"

ఊరి రోడ్డు పట్టబోయి, మనస్సు మార్చుకుని వీరారెడ్డి షాపుకెళ్ళాడు. అతడు దళారి. కోళ్ళు, గుడ్లు హోల్‌సేల్‌గా కొని సిటీకి పంపుతుంటాడు.

"రేటెలా ఉందన్నా. ఇంకో నెలలో మా కోళ్ళు తూకాని కొచ్చేసాయి. మంచి రేటు పలుకుద్ది గదా"

నోరు చప్పరించేశాడు. "డౌన్లో ఉంది సుబ్బారాయుడూ. మార్చి లోన్ సమ్మర్ వచ్చేసేట్టుంది. కోళ్ళకి గడ్డు కాలమే. ముందే వ్యాక్సిన్లు వేయించి జాగ్రత్తపడు"

"నా కోళ్ళకు అంత తేలిగ్గా రోగాలు రానివ్వను.. ఎండలు పెరిగేప్పుడు వీఎన్‌డీ వ్యాధి వస్తుంది. అది నా కోళ్ళకు రాకుండా ముందే టీకాలు వేయించేస్తాను" కించిత్తు గర్వంగానే అన్నాడు.

"చదువుకున్న రైతువి. నీకు తెలీదేంటిగాని, ఎప్పుడే మహమ్మారి వచ్చి పడుద్దో చెప్పలేం గదా!"

"చైనా వైరస్‌కి భయపడ్డానుగాని అవి కోళ్ళకు వచ్చిన దాఖలాలు లేవన్నాడు మా ఆనంద్‌గాడు. వాడికి తెలీనిదంటూ ఉండదు. అన్నటు కేఎఫ్‌సీ, మెక్‌డోనాల్డ్ లాంటి అమెరికా కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మరి చికెన్‌కి డిమాండ్ ఎందుకు పెరగట్లేదు?"

"వాళ్ళు డిప్‌ఫ్రీజర్లు ఉంటాయి గనుక ఎన్నాళ్ళైనా నిల్వ ఉంచేస్తారు. మన కలాంటి కోల్డ్‌స్టోరేజీలు లేవు గనుక రేటు ఎంత దారుణంగా పడిపోయినా సరే, అమ్ముకోక తప్పట్లేదు"

"నీలాగ కష్టపడే రైతుకి అంతా మంచే జరుగుతుంది. నీ కష్టం వృథా కాదు సుబ్బారాయుడూ"

హుషారుగా ఇంటికి తిరిగెళ్ళాడు.

భార్య సునీత మంచినీళ్ళిచ్చింది. ఆమె వంక సాలోచనగా చూశాడు. నీరసంగా ఉంది. నలభై ఏళ్ళకే యాభై దాటిన దాన్లా వుంది. 'ఒంట్లో తేడాగా వుందా' అనడిగితే లేదంటుంది. ఓసారి సిటీకి తీసుకెళ్ళి అన్ని పరీక్షలూ చేయించాలనుకున్నాడు. కోళ్ళ రంధిలో పడి ఇంకేదీ పట్టించుకోలేకపోతున్నందుకు తనను తాను నిందించుకున్నాడు.

"ఏంటలా చూస్తున్నారు" మెడ కప్పుకుంటూ అంది.

ఉలిక్కిపడ్డాడు. ఆమె మెడలో బంగారు గొలుసు, చేతులకు బంగారు గాజులు చూసి ఎన్నాళ్ళయ్యిందో, డబ్బు చేతికి రాగానే తాకట్టు విడిపించడం, నెల తిరక్కుండానే మళ్ళీ ఆనంద్ షాపులో నిద్రపుచ్చడం అవుతోంది!

నిట్టూర్చాడు.

చిత్రంగా చూసింది. "ఏవయ్యింది?"

"ఏమీ లేదు. ఏమీ లేదు" గొణుక్కున్నాడు.

ఆమె అతడి మేనమామ కూతురే. డిగ్రీ చదువుతున్నాడని, చక్కగా ఉద్యోగం చేసుకుంటాడని ఆమె నిచ్చి పెళ్లి చేశారు. కాని ఊహించని విధంగా తండ్రికి పక్షపాతం వచ్చి మంచాన పడటంతో, చదువాపి వ్యవసాయంలోకి దిగక తప్పలేదు.

తల్లి ఆరోగ్యమూ అంతంత మాత్రంగానే ఉండటం,

మరోపక్క అప్పుల వాళ్ళ ఒత్తిడీ అధికమవడం చూసి సాగుదారుడు కావాలని నిశ్చయించుకున్నాడు.

తండ్రి, ఊళ్ళోని ఇతర రైతులు చదువుకోనందున, సరైన ప్రణాళిక లేనందున, ఆదాయ వ్యయ వివరాలు రాసుకోనందున నష్టాల పాలవుతున్నారని విశ్వసించాడు.

కడుపు ఉన్నంతవరకు ఆకలి ఉంటుంది. ఆకలి వున్నప్పుడు ఆహారం కావాల్సిందే. అంచేత పంటలకి ఎప్పుడూ డిమాండ్ వుంటూనే వుంటుంది. మరింకెందుకు రైతు బాగుండడు? ఒక ప్రణాళిక ప్రకారం, ఆధునిక సదుపాయాలు వినియోగించుకుంటే వ్యవసాయం లాభదాయకం అయి తీరుతుందనుకున్నాడు.

తొలి ఏడాదే అకాల వర్షం దెబ్బ తగిలే సరికి ప్రకృతి కరుణించక పోతే రైతుకి కష్టమే అనుకున్నాడు. విత్తనాలు, ఎరువుల, పురుగు మందుల రేట్లు రోజు రోజుకి పెరుగుతుండటం, మళ్ళీ వాటిల్లో కల్తీ వుండటం గమనించి లబలబలాడాడు. గిట్టుబాటు ధర లభించకపోవడం, దళారుల లీలలు చూసి ' ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి దేవుడా' అని విలవిల్లాడాడు. ప్రభుత్వ విధానాలు రైతుకి వ్యతిరేకంగా ఉండటం గ్రహించి, ' కర్ణుడి చావుకి కూడా ఇన్ని కారణాలు లేవు' అని వాపోయాడు.

అన్నిటితో అందరితో పోరాడలేనని తెలుసుకుని చతికిలబడ్డాడు సుబ్బారాయుడు.

తండ్రి చనిపోయాడు. ఆ సరికి అప్పుల ఊబిలో నడిలోతువరకూ దిగబడ్డాడు.

సంప్రదాయ పంటలూ పద్ధతులూ లాభం లేదనుకున్నాడు. అప్పులో అప్పు చేసి రొయ్యల చెరువు తవ్వాడు. మొదటి ఏడాది మూడు లక్షలు మిగిలింది. కొడుకుని ఇంజినీరింగులో చేర్చాడు. రెండో ఏడాది మరో చెరువు లీజుకి తీసుకున్నాడు. లీజు సొమ్ము పోను అతికష్టం మీద ఖర్చులొచ్చాయి. మూడో ఏడాది ఏదో వైరస్ సోకిందని కొనుగోళ్ళు ఆపేశారు. లబో దిబో మని అయిన కాడికి అమ్ముకోవాల్సొచ్చింది.

దానా దీనా ఎనిమిది లక్షల అప్పు తేలింది.

నీటిని నమ్మే కన్నా నేలని నమ్ముకోవడం మంచిదనుకున్నాడు. నిలువునా కూలబడిపోవాల్సిరాదని భావించాడు. షెడ్లు వేసి బ్రాయిలర్ కోళ్ళు పెంచడం మొదలెట్టాడు. దూరంగా వుంటే వాటిని సాకలేదని ఇంటి పక్కనే ఉన్న స్థలంలో షెడ్లు వేశాడు.

"వాటికి రోగాలొస్తే నీకూ అంటుకుంటాయిరా" హెచ్చరించాడో పెద్దాయన.

"అవి చస్తే నేనూ చచ్చినట్టేగా తాతా" అని బదులిచ్చాడు.

లక్షలు రాకపోయినా, బ్యాచ్‌కి పెట్టుబడి, బ్యాంకు కిస్తీ పోను ముప్ఫై నలభై వేలు మిగుల్తున్నాయి. 'ఇలా సాగితే శాన. మూడు నాలుగేళ్ళలో తెరిపిన వడిపోతాన్లే' అని ఆశపడుతున్నాడు.

'ఏంటి సీరియస్‌గా ఆలోచిస్తున్నారు?"

"ఈసారి బంగారం విడిపించాక మళ్ళీ తాకట్టు పెట్టనే పెట్టను. ఇక ఎప్పుడూ నీ మెడ బోసిగా ఉండనివ్వను సునీతా" ఆర్తిగా అన్నాడు.

మురిపెంగా నవ్వింది. "అబ్బాయికి అమెరికాలో ఉద్యోగం రాగానే గొలుసు, గాజులు కొంటానన్నాడు"

నవ్వాడు. "ఏదో ఆశపడుతూ కన్సల్టెంటుకి దోచి పెడుతున్నాడు. అయినా ఏదో అనుకోవడమే గాని అమెరికా ఉద్యోగం గోదారి ఈత లంక మేతేనే"

మాటల్లోనే ఫోన్ చేశాడు కొడుకు. చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

"ఇక నీ జాతకం మారిపోతుంది నాన్న. ట్రంప్ వస్తున్నాడుగా. మనదేశానికిచ్చే వీసాల సంఖ్య పెంచుతూ ప్రకటన చేస్తాడని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాం. అదే జరిగితే ఏప్రిల్‌లో వీసా వచ్చేస్తుంది. జూన్ కల్లా అమెరికా చెక్కేస్తా"

"ఒరే వేణూ. అది మీరంతా రెక్కలు కట్టుకుని ఎగిరెళ్ళాలనుకునేంత గొప్ప దేశం ఎలా అయ్యిందిరా"

"మొత్తం ప్రపంచాన్ని శాసించేది డాలరే నాన్న. అమెరికాలో సహజ వనరులు భారీగా ఉన్నాయి. పెట్టుబడి వుంది. వ్యాపారపు కిటుకులు తెలుసు. రాజకీయ ఒత్తిళ్ళు తేగలరు. బిగ్ బ్రదర్ని కాదనలేక బడుగు దేశాలు తలుపులు బార్లా తెరవక తప్పదు. దాంతో అమెరికా వ్యాపార సంస్థలు ప్రపంచమంతటా విస్తరించాయి. నలుమూలల్నుంచీ డబ్బు వరదలా వచ్చి పడుతోంది. ఇక సంపన్న దేశం కాకుండా ఎలా ఉంటుంది చెప్పు. ఇప్పుడిప్పుడే మన రూపాయీ బలపడుతోందిలే"

"అక్కడా జనాభా బాగానే వుందిగా. మీరంతా వెళ్ళడం ఎందుకురా?"

"వాళ్ళ అన్ని రకాల వ్యాపారాలకూ ఉపయోగపడటానికి ఇంకా ఇంకా అభివృద్ధి చెయ్యడానికి. వాళ్ళు వెళ్ళి ఇంకో దేశంలో యుద్ధం చేసినా వాళ్ళకే లాభం వస్తుంది నాన్న. బోల్డన్ని ఆయుధాలు, ఆహారం, మందులు వగైరా ఎగుమతి చేయడానికి అవకాశం వస్తుందిగా! ట్రంప్ ఇప్పుడు మనదేశం వచ్చేది 300 కోట్ల డాలర్ల విలువైన సైనిక సామాగ్రిని మనకు విక్రయించడానికే!"

"నాకెందుకో నమ్మబుద్ధి కావటం లేదురా. నిజంగా వ్యాపారానికే వస్తున్నాడా?"

"వాళ్ళ తీరే అంత. మీ ఇంటి కొస్తే మాకేం పెడతావ్. మా ఇంటికొస్తే మాకేం తెస్తావ్ బాపతు అనుకో. వాళ్ళ సరుక్కి మార్కెట్ పెంచుకోవడమే వాళ్ళ లక్ష్యం!"

"నమ్మమంటావా?"

"పిచ్చి నాన్నా ఒకసారి హైదరాబాద్ వచ్చి చూడు. నువ్వెరిగిన నగరం కాదిది. అంతర్జాతీయ నగరం. ఇక్కడి మాల్స్, తిండ్లు, దుస్తులు, ఫర్నిచర్, ఆటబొమ్మలు అన్నీ అమెరికా కంపెనీలవే. ఒకటొకటిగా మనదేశపు షాపులన్నీ గాయబ్ అయిపోతున్నాయి. జనం కూడా అమెరికాలో లా జీవించడానికే ఇష్టపడుతున్నారు. ఇంకొన్నాళ్ళు పోతే ఇడ్లీ దోసెలు దొరకవు. బర్గర్లు, పిజ్జాలే లభిస్తాయి. అమెరికా వారి కన్నా ఇక్కడివారు ఒంటి మీద ఎక్కువగా పులిసారలూ చుక్కలూ వేసుకుంటున్నారు!"

సుబ్బారాయుడి మెదడు మొద్దు బారిపోయింది. వీరారెడ్డి మాటలు గుర్తొచ్చాయి.

ఇప్పటికే అమెరికా నుంచి చికెన్ లెగ్స్ తెప్పించుకుని ఇక్కడ వండి వడ్డిస్తున్నాయి కొన్ని అమెరికా దుకాణాలు. మెల్లమెల్లగా వారి అన్ని రకాల సరుకులూ ఇక్కడికి వచ్చేస్తే... ఇటు చైనా చీప్ సరుకు. అటు అమెరికా ఖరీదైన సరుకు. మధ్యలో భారతీయ సరుకు గుడ్లు తేలేయాల్సిందే!

మనస్సు చేదుగా అయింది.

అర్ధరాత్రి వేళ కోళ్ళన్నీ గొంతెత్తి అరుస్తూ గోల చేస్తోంటే ఉలిక్కిపడి లేచాడు సుబ్బారాయుడు. ఒక్క ఉదుటున ఉరికాడు. పని వాళ్ళని లేపాడు.

"ఏదో ఉపద్రవం వచ్చిపడిందిరా. లేకపోతే అలా అరవ్వు. లోపలేమైనా పాము చొరబడిందేమో వెదకండ్రా"

లైట్లు వేసి, చప్పుడు చేస్తూ షెడ్లలో వెదుకుతోంటే పెద్ద పాము పక్కనున్న తుప్పల్లోకి పారిపోయింది.

"పాము దూరిందిరా. ఎన్ని కోళ్ళను చంపిందో ఏంటో. చూడండి చూడండి" తొందరపెట్టాడు.

అయిదారు కోళ్ళు చచ్చిపడి ఉన్నాయి. మరి మూడు ఊగుతున్నాయి.

వాటిని బయటికి తీయించాడు. మందుల కిట్‌లోని మందు వాటి నోళ్ళలో వేయించాడు. అయినా అవి బతకలేదు.

అతడి కళ్ళల్లోంచి నీళ్ళు ఉరికాయ్. వాటిని ఒళ్ళో పెట్టుకుని ఏడ్చేశాడు.

"ఆ దుర్మార్గపు పాము ఎక్కడ్నుంచొచ్చింది? లోపలికెలా వెళ్ళింది? వెదకండి"

వెదికారు. ఒక కంత కన్పించింది. దానిలోంచి దూరి రావటం వల్ల అది మరి కాస్త పెద్దదయ్యింది కూడా.

"ఒకసారి రుచి మరిగితే మళ్ళీ మళ్ళీ వచ్చి పడుతుంది. ఛస్తే రానివ్వకూడదు. రేపు చుట్టూ వున్న ఇనుప దడిని పకడ్బందీ చేయండి"

అంతటితో వూరుకోలేదు. పాములవాణ్ణి పిలిపించాడు సుబ్బారాయుడు. ఆ చుట్టుపక్కలంతా వెదికించి మొత్తానికెలా అయితేనేం దాన్ని పట్టుకున్నారు. "చంపొద్దు. కోరలు పీకేస్తే సచ్చిందానితో సమానం" అని పాములవాడు బ్రతిమాలినా ఎవరూ వినలేదు. పెద్ద కర్రలతో దాడి చేసి పాముని చంపేశారు.

మరింత అప్రమత్తంగా ఉండమని పనివారిని హెచ్చరించాడు సుబ్బారాయుడు.

మరి వారం తిరక్కుండానే ఆనంద్ ఫోన్ చేశాడు.

"నీ భయాలే నిజమయ్యేట్టున్నాయి సుబ్బారాయుడూ"

"కరోనా వైరస్ కోళ్ళకు వచ్చిందా?"

"అంతకంటే మరణాంతకమైన 'అమెరికా వైరస్' చికెన్ కాళ్ళకు వచ్చేట్టుంది సుబ్బారాయుడూ"

"ఏంటేంటి, అర్థమయ్యేలా చెప్పు" అదుర్తోన్న గుండెల్తో అడిగాడు.

"అమెరికాలో, కొవ్వు శాతం అధికంగా వుంటుందని కోళ్ళకాళ్ళు తినడానికి ఇష్టపడరు. ఛాతీ భాగం ఎక్కువగా తింటారు. దానికి ఎక్కువ రేటు చెల్లించడానికీ సిద్ధపడతారు. అంచేత అక్కడ చికెన్ లెగ్స్ నిల్వలు భారీగా పేరుకుపోయాయి. కాని మనదేశంలోనేమో చికెన్‌లెగ్స్

# తెలుగును మాధ్యమంగా తొలగించిన జిఓ 81, 85లను రద్దుచేసిన హైకోర్టు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం గత సంవత్సరం నవంబర్ నెలలో జారీచేసిన జిఓలు 81, 85లను హైకోర్టు కొట్టివేసింది. ఏలూరుకు చెందిన గుంటుపల్లి శ్రీనివాస్, న్యాయవాది ఇంద్రనీల్, సుధీర్ రాంభొట్ల వేరువేరుగా దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టు ఏప్రిల్ 15న తీర్పు వెలువరించింది. ఇంగ్లీషు మీడియంలోనే విద్యాబోధన చేయాలంటూ పాఠశాల పేరెంట్స్ కమిటీలు కూడా ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేసాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జీకే మహేశ్వరి, జస్టిస్ ఎస్. జయసూర్యలతో కూడిన డివిజన్ బెంచ్ 92 పేజీల కీలక తీర్పును వెలువరించారు.

**హైకోర్టు కీలకవ్యాఖ్యలు**

"ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇంగ్లీషు మీడియంలో బోధన చేసితీరాలన్న ప్రభుత్వ వాదన చెల్లదు. ప్రభుత్వం జారీ చేసిన జిఓ 85కు చట్టబద్ధత లేదు. ఇంగ్లీషు మీడియాన్ని తప్పనిసరి చేస్తూ జారీ అయిన ఆ జిఓ రాజ్యాంగ విరుద్ధం. సుప్రీంకోర్టు వివిధ కేసుల్లో వెలువరించిన తీర్పులకు భిన్నం. విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకం. ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకూ మాతృభాషలోనే విద్యాబోధన ఉండాలి. సర్వేపల్లి రాధాకృష్ణ, బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలే, మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి ఎందరో మహనీయులు మాతృభాషలోనే చదువుకుని అత్యంత ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. ఆంగ్లంలో చదివితేనే ఉన్నత స్థాయికి చేరగలరనే వాదన ఎంతమాత్రం ఆమోదయోగ్యంగా లేదు. మాతృభాషలో చెప్పే విషయం హృదయాల్ని హత్తుకుంటుంది. బోధనా విషయాల్ని పిల్లలు త్వరగా అర్థం చేసుకునేందుకు, ఆత్మవిశ్వాసంతో ఎదిగేందుకు అమ్మభాషలోనే విద్యాబోధన సాగాలి" అన్ని హైకోర్టు వ్యాఖ్యానించింది.

హైకోర్టు వెలువరించిన తీర్పును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలుచేయాలని మాతృభాషా మాధ్యమ వేదిక తరపున శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం, సామల రమేష్‌బాబు, రమేష్‌పట్నాయక్; పెనుగొండ లక్ష్మీనారయణ, దివికుమార్, వొరప్రసాద్‌లు ఒక ప్రకటనలో కోరారు. ♦

---

ఎక్కువగా తింటారు. డిమాండ్ ఎక్కువ ఉంది."

"ఇప్పుడిదంతా నాకెందుకు చెబుతున్నావురా"

"ట్రంప్ మనదేశంలో వాణిజ్యాన్ని విస్తృతం చేసుకోడానికి వస్తున్నాడు కదా చికెన్ లెగ్ లపై ఉన్న 100 శాతం దిగుమతి సుంకాన్ని 25 శాతానికి తగ్గించడానికి మనదేశం అంగీకరిస్తుందట. దాన్ని పదిశాతానికి తగ్గించమని అమెరికా పట్టుబడుతోందిట. అలాగే పౌల్ట్రీ ఉత్పత్తుల దిగుమతిపై నిషేదం ఎత్తేస్తారట. పాడి పరిశ్రమలోకీ అమెరికా ఉత్పత్తులు అనుమతిస్తారట. అదే జరిగితే అది కోళ్ళ రైతులకూ, పాడి రైతులకూ మరణ శాసనమే అవుతుంది....!"

"వాళ్ళు మనకన్నా తక్కువకి ఎలా అమ్మగలరు?" హీన స్వరంతో అడిగాడు.

"అక్కడ ఫీడ్ ఖర్చు, ఉత్పత్తి ఖర్చు మనకన్నా తక్కువ. దిగుమతి సుంకం తగ్గిస్తే చికెన్‌లెగ్సూ, ఎగ్సూ అన్నీ మనదేశాన్ని ముంచెత్తుతాయి. ఇక దేశీయ పౌల్ట్రీ పరిశ్రమ మటాషే!"

"పాము జొరబడితేనే కోళ్ళు నానా గోల చేశాయి. మనం ఏమీ చెయ్యలేమా?" ఆవేశపడ్డాడు సుబ్బారాయుడు.

"పిచ్చివాడా. అమెరికా కోడి కాలు దువ్వి బరిలోకి వురికితే దేశీయ కోడి కుప్పకులాల్సిందే. అమెరికా, పాము కాదు. అనకొండ. అది నీ కోళ్ళనే కాదు నిన్నూ అమాంతం మింగేస్తుంది. లక్షలాది కోళ్ళ ఫాంలు మూతపడతాయి. లక్షలాది జనం ఉపాధి కోల్పోతారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంది. పౌల్ట్రీయే కాదు, పాడి మార్కెట్లోకీ రాబోతోంది. అదే జరిగితే పాడి పరిశ్రమ గోల్‌మాలే. అంతేకాదు దాదాపు 8 కోట్ల మంది గ్రామీణుల జీవనం తల్లక్రిందులై పోతుంది. ఏ కారణం చేతనైనా ఆ ఒప్పందాలు ఇప్పుడు ఆగినా, తర్వాత దొడ్డిదారిన వచ్చేయ్యడం ముమ్మాటికి ఖాయం. తస్మాత్ జాగ్రత్త!

అనకొండ భయంకరంగా నోరు తెరచి కబళించడానికి మీదికొస్తున్నట్టు అనుభూతి కలిగింది.

ఒక్కంగలో వీధిలోకి ఉరికాడు సుబ్బారాయుడు

''కొక్కొరో కో'' అని అరుస్తూ రోడ్డు వెంబడి పరుగెత్తసాగాడు. ♦

# రాయలసీమ కొత్త స్వరం




వెంకట
నరేంద్ర ప్రసాద్



- నీలం వెంకటేశ్వర్లు
9502411149

నీళ్ళు లేక పంట పొలాల్లో నెర్రలు.. పండిన అరకొర పంటను కాపాడుకోవటానికి రైతులు పడే కష్టాలు..ఉపాధి కోసం వలసలు.. పశుగ్రాసం లేక కబేళాకు తరలుతున్న పశువులు ఈ మాటలు వింటున్నప్పుడు ఎవరికైనా వెంటనే గుర్తొచ్చే ప్రాంతం రాయలసీమ. సీమలో నెలకొన్న ఈ దురవస్థకు, వెనుకబాటు తనానికి గల కారణాలేమిటి? అని ప్రశ్నించుకుంటే దాని వెనుక చారిత్రక పొరపాట్లు, తప్పిదాలు చాలానే ఉన్నాయి. మరి ఈ సమస్యల పరిష్కారానికి ఒక వైపు రాయలసీమ ప్రజాఉద్యమ సంఘాలు, మరోవైపు సాహిత్యకారులు రాయలసీమ ఉద్యమం ద్వారా తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ప్రజల్లో సాంఘిక, సాంస్కృతిక చైతన్యం నింపే ప్రయత్నమూ చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నంలో భాగమే తెలుగు అధ్యయనశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థి అయిన వెంకట నరేంద్ర ప్రసాద్ ప్రచురించిన తన తొలి కవితా సంపుటి 'సీమగొంతుక'.

నరేంద్ర ఈ కవితా సంపుటిలో ఒక చోట 'మట్టిలో పుట్టిన మట్టి మనిషిని నేను, రాళ్ళ మధ్య రాటు దేలిన రాయలసీమ చిన్నోన్ని నేను' అంటాడు. మరి మట్టి మనిషైన ఈ రాయలసీమ చిన్నోడు తన సాహిత్య క్షేత్రంలో కవితా సేద్యం చేసి, అక్షరాలను నాటితే అవి మొలకెత్తి ఇలా 'సీమగొంతుక' కవితా సంపుటిగా మన ముందుకు వచ్చింది. 9 ఏప్రిల్, 2019న నరేంద్ర ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా, వినూత్నంగా తన కవితా సంపుటిని గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో వలస రైతుకూలీలైన దేవన్న, నాగిరెడ్డి, ఈరన్నలచే ఆవిష్కరించాడు. ఎవరి కోసమైతే తన గొంతును వినిపించాడో, ఎవరి కోసమైతే తన కలాన్ని కదిలించాడో వారి చేతుల మీదుగా ఆవిష్కరించడం కవిలోని నిబద్ధతకు నిదర్శనం.

కవిగా నరేంద్రకు స్పందించే హృదయముంది. అపారమైన మానవత్వం ఉంది. అందుకే రాయలసీమ సమస్యల పట్ల కన్నీరై కరిగిపోతాడు. కవిత్వమై వెలిగిపోతాడు. అతని కవిత్వాన్ని చేతుల్లోకి తీసుకొని, అక్షరాల్లోకి తొంగి చూస్తే మనకు అలవాటైన మన జీవితం ఆ అక్షరాల్లో సరికొత్తగా దర్శనమిస్తుంది. సీమ ప్రజల అలసత్వాలపైనా, పాలకుల, అధికారుల నిర్లక్ష్యంపైనా కవి చూపే జాలి, భయం, ఆవేశం, ఆక్రోశాలు కనిపిస్తాయి. నరేంద్రది ఉద్యమ కవిత్వంగా చెప్పుకోవచ్చు. ఇతని కవిత్వంలో ప్రజలను ఉత్సాహపరిచే ఆవేశ స్వభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఒక ఉద్యమం పుంజుకోవలసి వచ్చినపుడు ఆవేశ కవిత్వమే కావాలి. అదే ఉద్యమం స్థిరపడవలసి వచ్చినపుడు ఆలోచనాత్మక కవిత్వం అవసరమవుతుంది. రాయలసీమ ఉద్యమం పుంజుకోవటానికి కావల్సిన చైతన్యాన్ని ప్రజల్లో ప్రజ్వలింప చేయటానికి నరేంద్ర

కవిత్వం ఎంతగానో తోడ్పడగలదని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు.

సీమగొంతుక కవితా సంపుటిలో 36 కవితలున్నాయి. సూర్యుని చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్లు ఇందులోని కవితలన్నీ సీమ రైతన్న జీవితం చుట్టూ తిరుగుతాయి. రాయలసీమ ఎదుర్కొంటున్న కరువు దుస్థితిని, సీమ రైతన్న నీటి కష్టాల్ని, వలస బతుకల దుర్భర జీవితాల్ని, బిడ్డల్లా చూసుకునే పశువులను సాకే పరిస్థితులు లేక అమ్ముకుంటున్న వైనాన్ని, రాజకీయ నాయకుల వంచనల్ని మనం ఈ సంపుటిలో చూడవచ్చు.

వానాకాలం కూడా సీమ ఎంత దుర్భిక్షతను ఎదుర్కొంటుందో, ఎంతగా రోదిస్తుందో నరేంద్ర 'నేను చూశాను' కవితలో ఇలా ఆవిష్కరించాడు.

*'నేను చూశాను*
*సీమలో నా రాయలసీమలో*
*వానాకాలం కూడా బీళ్లుగా ఉన్న చేళ్లను*
*బీళ్లలో బిక్క ముఖం వేసుకు కూచున్న రైతును*
*సిన్న సినుకు కూడా లేక బండలైన భూములను*
*...*
*వానాకాలంలో కూడా సుగ్గియాత్రకు వెళ్లే*
*బతుకు జీవులను*
*పండుగ రోజు కూడా పస్తులుండే నిర్భాగ్యులను*
*ఎండిన చీని తోటలలో పక్షుల ఆర్తనాదాలను*
*వాడిన మామిడితోటల మధ్య*
***కోకిల విషాద రాగాలాపనను'*** అంటాడు. ఎక్కడైనా వర్షాకాలం అంటే నిండిన చెరువులు, గలగల పారే నీటి కాలువలు, పచ్చని పంట పొలాలు, కమ్మని మట్టివాసనలు, రైతు కళ్ళలో ఆనందాలు కనిపిస్తాయి. కాని రాయలసీమలో దీనికి భిన్నంగా కనిపిస్తుంది. వర్షాకాలంలో ఒక్క చినుకు రాలదు. భూగర్భజలాలు ఇంకి పోవటం వల్ల బోరుబావుల్లో చుక్క నీళ్ళుండవు. ఇలాంటి స్థితిలో భూమినే నమ్ముకున్న సీమరైతు దుస్థితిని మనం అంచనా వేయవచ్చు. భూమితో ప్రత్యక్ష అనుబంధం ఉన్నవాడు కాబట్టే నరేంద్ర ఈ కవితను ఇంత హృద్యంగా కవిత్వీకరించగలిగాడు.

ప్రపంచీకరణ ప్రభావం, పాలకుల నిర్లక్ష్యం వీటి ఫలితం రైతన్నలు, వ్యవసాయ కూలీలు మాత్రమే కాక ఇతర కులవృత్తుల వారు కూడా బలి పశువులవ్వటం. దీంతో ఇక్కడ పనులు లేక సీమ ప్రజలు ఊర్లను, ముసలి తల్లిదండ్రులను, పిల్లల చదువులను వదలి వలసబాట పట్టడం అనివార్యమైంది. పొట్ట చేత పట్టుకొని పట్టణాలకు పనుల కోసం వెళ్ళే పేద కూలీల అగచాట్లు ఎలా ఉంటాయో 'కూటి కోసం' కవితలో ఆర్ద్రంగా ఇలా వ్యక్తం చేస్తాడు.

*"పొట్ట కూటి కోసం పొద్దున్నే*
*పేద కూలీల తాపత్రయం*
*ఇంకా తెలవారలేదు*
*నగరమంతా మరో గంటకు లేస్తుంది*
*ఇప్పుడేమో టైమ్ నాలుగైంది*
*కర్నూలు రైల్వేస్టేషన్ రోడ్డులో*
*ఐదు రోడ్ల కూడలిలో*
*ఆ పక్క ఈ పక్క నిలబడి ఉన్నారు*
*పని దొరుకుతుందేమోనని*
*ఈ రోజు పొట్ట నిండుతుందేమోనని"*

వానలు పడకపోవటం, పంటలకు పాలకులు సాగునీరు ఇవ్వకపోవటం రాయలసీమ రైతుకు పెద్ద శాపం. ఆ శాప ఫలితమే వ్యవసాయ కూలీలు నగరం నడిబొడ్డులో పనుల కోసం యాచించడం. శ్రమదోపిడీకి గురికావడం. తుఫాన్ సమయంలో వాతావరణశాఖ గంటగంటకు వెదర్ రిపోర్ట్ ఇచ్చినట్లు, నరేంద్ర ఈ కవితలో ఉదయం ఐదున్నరకు, తొమ్మిదికి, మధ్యాహ్నం పన్నెండున్నరకు నగరంలో కూలీల జీవన పోరాటాన్ని ఒక రిపోర్ట్‌లా తయారు చేసి పాఠకులకు అందించాడు.

'ఏంబ్బీ ఏంది సంగతి' కవితలో

*"ఏంబ్బీ ఏంది సంగతి*
*సీమ సిమ్మాలు రుచిమరిగినట్టున్నాయ్*
*అమరావతి మిఠాయ్*
*ఇంగ రాయలసీమ రాగి సంగటి ఏమ్ తింటాయ్*
*కద్దరుతోలు గప్పుకొని*
*పకాశం బ్యారేజ్ నీళ్ళు తాగతాండాయ్‌గా*
*ఇంగ పెన్నేటి కన్నీటి కష్టాలేమ్ గుర్తొస్తాయ్*
*...*
*బీళ్ల భూములలో కళేబరాలను సూస్తున్నా*
*శ్రీశైలం నీళ్ల కోసం నోరు మెదపడం లేదు*
*సేద్యగాడి కళ్ళల్లో రక్తం కారుతున్నా*
*ఊసరవెల్లి రంగులు మార్చినట్టే*

*రాజకీయం జేస్తాందాయ్"*

అంటాడు. ఈ కవితా శీర్షికలోనే కవిలోని ఒక ఎదిరింపు, ఒక బెదిరింపు, ఒక పొగరు మనకు కనిపిస్తాయి.

ఊసరవెల్లిలా రంగులు మార్చే రాజకీయ నాయకుల నిజస్వరూపాన్ని ఈ యువకవి బయటపెట్టాడు. అంతేకాదు వీళ్ళు ఎన్నికల ప్రచారానికొచ్చినపుడు కాడికి గట్టి బురదమడిలో మడక దున్నియ్యాలా అంటూ ఆగ్రహం చెందుతాడు. కవిలోని ఈ ఎదిరింపు, బెదరింపు, పొగరు సీమ ప్రజల్లో రావాలి. అప్పుడే ఈ కుహనా రాజకీయ నాయకుల మెడలు వంచగలం.

ఒక్కొక్క ప్రాంతానిది ఒక్కొక్క సంస్కృతి. ఎవరి సంస్కృతి వారికి అపురూపమైనదే. ఎవరి సంస్కృతి వారికి గొప్పదే. ఒకరి సంస్కృతిపై మరొకరు చులకన చేయడం, చిన్న చూపు చూడటమన్నది సరైన పద్ధతి కాదు. నేడు సినిమా రంగం రాయలసీమ సంస్కృతిపై ఇలాంటి చిన్న చూపే చూస్తుంది. సీమ సంస్కృతిపై విషం చిమ్ముతుంది. అందుకే నరేంద్ర 'విషం కక్కుతున్న సినిమా' కవితలో సినిమా రంగాన్ని ఇలా ప్రశ్నిస్తాడు.

*"తెల్లటి పంచలు సేతకత్తులు టాటా సుమోలు*
*మా పాత్రల ముఖాలలో మూర్ఖత్వం*
*యానాడు సూడని దుర్మార్గులుగా*
*పురాణాలలో కూడా కానరాని రాక్షస పాత్రలుగా*
*పగోడేమో కాని పక్కనున్న మావాడు కూడా బయపడేలా*
*సీమ సినిమాలలో రగ్తం పారించి*
*రగిలిచ్చాండారు మా గుండెలో ఆరని అగ్నిజ్వాలను*
*....*
*గోదాట్లో గలగలలు సూపిచ్చా*
*రాల్లసీమలో రగ్తాలు పారించే మీ విషసంస్కృతికి*
*మా సేత కత్తి పట్టించే మీ కలక్షన్ల కక్కుర్తికి*
*కలం పట్టి సూటిగా ప్రశ్నిచ్చాండాం"*

ఈ సినిమా వాళ్లకు క్లాస్ సినిమా అయితే కోస్తా ప్రాంతంలో వాలి పోతారు. అదే మాస్ సినిమా తీయాలంటే వాళ్ల చూపు రాయలసీమపై పడుతుంది. సీమ ఒక వైపు అనేక సమస్యలతో కొట్టిమిట్టాడుతుంటే, వీళ్ళు మాత్రం సీమ ప్రజలను అనాగరికులుగా, మన బిడ్డలను మనవే చంపుకునేంత నరరూప రాక్షసులుగా చిత్రిస్తారు. ఇక సినిమా మొదలు చివరి దాకా తెరను రక్తంతో కళ్ళాపి చల్లుతారు. ఇలాంటి సినిమాల వల్ల బయటి ప్రాంతాల వారు సీమంటే భయపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. అందుకే నరేంద్ర కలెక్షన్ల కోసం, హిట్‌ల కోసం సీమపై విషం చిమ్ముతున్న సినిమా రంగాన్ని తన కలంతో ప్రశ్నిస్తాడు.

ఇలా చెప్పుకుంటూ పోతే పక్క ప్రాంతాల పెత్తనంతో సీమ ఎలా మోసపోతుందో, ఏం నష్టపోతుందో 'జలక్రీడ' కవితలో తెలియపరుస్తాడు. 'ఏమంత మంట సీమంటే' కవితలో "అప్పటి ఒప్పందాలను ఒకసారి గుర్తు సేసుకొని, ఇప్పుడు రాసుకుందాం రండి ఒప్పందాలు'' అంటూ తడారిన సీమగొంతుతో పిలుస్తాడు. 'రాజకీయ గాలులు' కవితలో "ఒకచోట సంతోషాలు, ఆనందాలు, పండుగలు అయితే, మరోచోట చావులు, అప్పులు, పాడెక్కటాలు" అంటూ ప్రాంతాల మధ్య నెలకొన్న అసమానత్వం పోవాలని కోరుకుంటాడు. "నేడు ఆకలి ఆకలి అంటూ, ఉద్యమమై, రేపు నీళ్ళు నీళ్ళు అంటూ, ఉవ్వెత్తున ఎగిసిపడుతుంది, స్వేచ్ఛ కోసం సమరం సలుపుతుంది" అంటూ 'రేపు' కవిత ద్వారా నరేంద్ర సీమ అభివృద్ధికి ఉద్యమించాలని భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తాడు. కొత్తస్వరమై నినదీస్తున్న నరేంద్ర తన గుండెలో చెలరేగిన ప్రతి వెంరువును కవితగా మలచి మనముందుంచాడు.

ఈ సీమగొంతుక కవితాసంపుటిలోని కవితలను చదువుతున్నప్పుడు, ఇందులోని కవితలన్నీ తన ప్రత్యక్ష అనుభవం నుంచి పుట్టుకొచ్చాయనే విషయం మనకు తెలుస్తుంది. నరేంద్ర స్వార్థపూరిత, అవకాశవాద రాజకీయ కదలికలను, పరిస్థితులను బాగా అవగాహన చేసుకుంటున్నవాడు. రాయలసీమకు జరుగుతున్న అన్యాయాలను గ్రహిస్తున్నవాడు. అందుకే తన తొలి సంపుటిలోనే ఇంత బలంగా తన సీమగొంతును వినిపించగలిగాడు. అయితే నరేంద్ర తన భావాలను కవిత్వంగా మలిచే క్రమంలో వాచ్యం నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది. తన కలాన్ని కవితా నిర్మాణపు ఆకురాయిపై సానబెడితే నరేంద్ర కలం పదునైన నాగలిగా మారి, రాయలసీమ ఉద్యమానికి బలమైన ఆయుధమై నిలుస్తుందనటంలో సందేహం లేదు. మరి భవిష్యత్తులో తన కలం నుంచి మరింత పదునైన కవిత్వం రావాలని ఆకాంక్షిద్దాం. ♦

## కవిత

## ఇంకా...!

- చెన్నా రామమూర్తి
8886885173



కన్న కళల సమాహారమే కదా జీవితం
పోటీ పడిన భావాల వెల్లువ విస్ఫోటనం
"......................................"
"......................................"
"......................................"
"......................................"
భావాల మౌన ఘోష
ఎవరికి చెప్పుకోవాలి కపట నాటక రంగాన

ఆలకించినట్లు గొప్పగా నటించిన ధీరుడికి
ఇవ్వాల్సిన నామధేయం ఏదో
స్ఫురణకు రావటమే లేదు.
మీరయినా చెప్పండి దయయుంచి.
వీరుడా.., నాయకుడా.., స్నేహితుడా.., బ్రూటస్!

సగటు జీవి దాహాన్ని తీర్చే నీటికి
కడుపు నింపే నాలుగు మెతుకులకి
వ్యాపారం రంగు పులిమి
రిక్త హస్తం చూపిస్తున్నపుడు
వారి ముఖం చూడు
సోమాలియాను మించిన భావన చెల్లుమనిపిస్తుంది.

ఓటుబ్యాంకు నిలుపుకోవటమొక్కటే
పరమావధి అనుకున్న క్షణాల్లో
సామాజిక సమన్యాయం కోసం
ఆ క్షణాల్లో ఏమూలన ఒడిసి పట్టుకుంటాం.
రిక్త హస్తం ప్రసన్నత
ఏ గుండెను మురిపిస్తుంది.

పద్దు సమర్పణ, కోట్ల మదింపు
కేటాయింపుల శాతం, పట్టికల వ్యూహ చిత్రాలు
జీవన గతికి సోపానాలంటావ్.
మరి... చాపకింద నీటి చెమ్మ ఏంటట...!
హుందాతో సాగే నల్లకోట్ల తీర్మానాల్లో
విచ్చుకత్తులు మధురమైన చితిని పేరుస్తున్నాయని
పసికట్టే విద్యను నేర్పడం ఎప్పుడు.....

ఇంకా..........!
చాలా వున్నాయ్....!
మొరాయిస్తోంది మనసు.

భావ దారిద్ర్యం అలుముకున్న అణువణువునా
చైతన్య గీతిక కవాతు సాగాలిక
అజ్ఞానాంధకారం విశ్వరూప విన్యాసమైతే
జ్ఞాన మకుటం జీవమై పురుడు పోసుకోవాలిక
పతాక శీర్షికలవుతున్న గగుర్పాట్ల స్థానంలో
మానవీయత గుభాళించాలి. ♦

---

## చీకటి చెర

- లక్ష్మీ కందిమళ్ళ
9849368808



కన్నీళ్ళు మోస్తున్న కళ్ళతో
నవ్వులు విరబూయాలంటే,
ఎలా పూస్తాయి?

కృత్రిమంగా అమర్చుకున్న నవ్వులు
సుగంధ సువాసనలను,
పంచగలవా?

క్షణాలు శవం ముందు రోదనలా
ఎండుటాకుల శబ్దాలను చేస్తున్నాయి.

చూడకపోయినా
వినపడుతూనే ఉంటాయి.

విరిగిన మనసు
చీకటి చెరలో బంధీగా ఉంది.

బండరాయిలా మారిన నీ గుండె
కదలక అక్కడే ఉంది.

మరి ఇవన్నీ
నీకు ఎలా తెలుస్తాయి?

తెలుసుకోవాలన్న ప్రయత్నం
నీది కాదు. ♦

**కథ**

# బుజ్జమ్మ పిల్లి



- వంజరి రోహిణి
9000594630

సాయంత్రం నాలుగైంది. సురేంద్ర టీ బంకు దగ్గర సందడి మొదలైంది. తెల్ల చొక్కా, తెల్ల పంచె కట్టుకుని రామశేషయ్య చీరల బాకీ డబ్బులు దండుకునేదానికి అమ్మలక్కల ఇళ్లకు సైకిలు మీద బయలుదేరాడు. వాళ్ళ నాయన దగ్గరినుంచి వారసత్వంగా వచ్చిన పాత మోపేడు బండిని వదులుకోలేక, దానికి రిపేరులు చేయించలేక సతమతమౌతున్న చిట్టిబాబు యధావిధిగా సైకిలు షాపు జాన్ దగ్గర బండికి ఫంక్చర్ వేయిస్తున్నాడు.

పొద్దునంతా కాచిన ఎండ తగ్గుదామా, వద్దా అన్నట్టు ఉడకాడిస్తున్నాది. టీ బంకు ముందర బల్ల మీద కూర్చున్న నర్సిరెడ్డి, అంకయ్య గాజు గలాసులో ఊదుకుంటూ టీ తాగతా వచ్చే, పోయే జనాలను చూస్తా ఉన్నారు. రేషన్ షాపు రాంబాబుని బతిమాలి రెండు లీటర్లు ఎక్కువ కిరసనాయిలు పోయించుకున్న బుజ్జమ్మ రెండు చేతుల్లో కిరసనాయిలు డబ్బాలను మోస్తూ ఆపసోపాలు పడతా రావడం చూసి నర్సిరెడ్డి " బుజ్జమ్మా... ఎందుకట్ట అవస్థ పడతావు. మీ ఆయన కిస్టయ్య కి చెప్తే తెస్తాడు కదా " అన్నాడు బుజ్జమ్మని ఎకసెక్కం గా చూస్తూ... " నర్సిరెడ్డన్నా, నీ పని చూసుకో, మా ఆయన మనిషి ఒకడు. పనులు వంద. ఎన్నని చేస్తాడు " అంటా బుజ్జమ్మ రోడ్డు దాటి ఒక డబ్బాని కింద పెట్టి, ఇంటి ముందరి ఇనప గేటుని తీసి, డబ్బాలను పట్టుకొని మిద్దె మెట్లు ఎక్కుతోంది.

"బుజ్జమ్మ చెప్పింది నిజమే నర్సిరెడ్డా.... పాపం కిష్టయ్య ఒకపక్క ప్రింటింగ్ ప్రెస్ నడపతానే మరోపక్క బిల్డరుగా ఇళ్ళు కట్టిస్తా, అదే చేత్తో హొటల్ నడపతా ఉళ్ళే. అప్పటికి బుజ్జమ్మ హొటల్ చూసుకుంటావుంది. ఇద్దరు కష్ట పడతా ఉన్నారు కాబట్టే మూడంతస్తుల మిద్దె కట్టగలిగారు." అన్నాడు అంకయ్య. " ఏం లేదులే అంకయ్య.... ఈ మధ్యన కిష్టయ్య ఎక్కువ అప్పులు చేస్తా ఉన్నాడని ఊరంతా పుకారు పుడతా ఉంది. అంత కష్టపడడం ఎందుకు, అన్ని అప్పులు చేయడం ఎందుకు అని " అన్నాడు నర్సి రెడ్డి. " నువ్వు ఎవరినీ వదలవు నర్సిరెడ్డా.... టైం అవతావుండాది. నర్సింగరావు పేటలో శేషారెడ్డి పేకాటకి పిలిచినాడు కానీ పోదాం పా " అంటానే ఇద్దరూ లేచిపోయినారు.

బుజ్జమ్మ రెండో అంతస్తు మెట్లు ఎక్కతా ఉంటే ఎక్కడ నుంచో చిన్నగా" మిఅవ్ మిఅవ్" అని అరుపు వినపడింది. ఒక క్షణం ఆగి ఏందోలే అనుకుని మళ్ళా మెట్లు ఎక్కసాగింది. ఈ సారి మళ్ళా కాస్త పెద్దగా "మ్యావు మ్యావు " అని పిల్లి అరుపు వినబడింది. ఇక ఉండబట్టలేక కిరసనాయిలు డబ్బాలు మెట్ల మీద పెట్టి, మెట్లు దిగి మెట్ల కింద ఉన్న సందులోకి తొంగి చూసింది బుజ్జమ్మ. అక్కడ చిన్న పిల్లి కూన భయంగా వణుకుతూ, అరుస్తూ ఉంది. దాని చిన్ని చెవులు, తోకకి మెట్ల కింద ఉన్న బూజు అంటుకుని ఉంది. బిత్తరగా బుజ్జమ్మని చూస్తూ మెట్ల కింది తావులోకి ఎనక్కి ఎనక్కి జరగతా ఉంది. బుజ్జమ్మ చుట్టూతా చూసింది. ఆ పిల్లి కూన తల్లి పిల్లి ఎక్కడైనా

ఉందేమో అని. ఎక్కడ దాని జాడ ఔపడలా. " ఒరే అబ్బయ్యా...శీనా ఇటు రారా' అని ఒక అరుపు అరిచి పిల్లి కూనని చేతిలోకి తీసుకుంది బుజ్జమ్మ. ఒళ్ళంతా తెలుపు, అక్కడక్కడా నలుపు మచ్చలతో మహా ముద్దుగా ఉన్న ఆ పిల్లి కూనని తీసుకుని మూడో అంతస్తులో ఉండే తన ఇంటిలోకి వెళ్ళింది. దాని ఒంటిమీది బూజు దులిపి హాల్లో సోఫాలో కూర్చుని పిల్లి కూనని ఒళ్ళోకి తీసుకుని దాని ఒంటిని నిమరసాగింది. శీనయ్యని కిరసనాయిలు డబ్బాలను పైకి తెమ్మని పంపి, కూతురు అనితని పళ్లెంలో పాలు పోసుకు రమ్మంది బుజ్జమ్మ. అంచులు ఉన్న పళ్లెంలో పాలు తెచ్చింది అనిత. ఆ పాలను సోఫాలో పిల్లికూన ముందు పెట్టింది బుజ్జమ్మ తాగమని. కాసేపు అది బిత్తర బిత్తరగా చూసి పాల వాసన ముక్కుకి తగలడంతో మెల్లగా పళ్ళెంలోని పాలను నాలికతో తాకి చూసి, బుజ్జమ్మ ముఖంలోకి ఒకసారి చూసి పాలను తాగసాగింది.

బుజ్జమ్మకు తనకి పెళ్లి కాకముందు నెల్లూరులో తమ ఇంట్లో తాను, మోహన్ అన్న కలసి అమ్మ వద్దు అంటున్నా పిల్లికూనలను ఇంటికి తెచ్చి సాకడం గుర్తుకు వచ్చింది. బడికి పోయినపుడు తప్ప పొద్దస్తమానం ఆ పిల్లికూనలను పైన, పక్కల వేసుకొని ఉంటే అమ్మ తిట్టేది. వాటివల్ల ఏమి రోగాలు వస్తాయో, పొద్దున్నే వాటిమొహం చూస్తే మంచిది కాదు అని. తాను, అన్న మాత్రం అమ్మ మాటలను పట్టించుకొనేవారు కాదు. వాటి వల్ల ఎప్పుడు ఏ అపకారం జరగలేదు తమకు. పాపం కాస్త పెద్ద అయినాక అవి రోడ్డు మీదకు పోయి ఆటోల కింద పడి చనిపోయాయి. ఇక పిల్లులను పెంచవద్దు అనుకుంది బుజ్జమ్మ. ఇదిగో ఇన్ని రోజులకు పిల్లికూన తనంతట తానుగా ఇంటి మెట్ల కింద కనపడే సరికి పాత రోజులు గుర్తుకు వచ్చాయి బుజ్జమ్మకు.

శీనయ్యను కిందికి పంపించింది పిల్లికూన తల్లి ఎక్కడైనా ఉందేమో చూడమని. వాడు అంతా తిరుక్కోని వచ్చి పెద్ద పిల్లి ఏడ ఔపడలేదని చెప్పాడు. బడి నుంచి వచ్చిన బుజ్జమ్మ కొడుకు చైతన్య కూడా పిల్లి కూనని చూసి ముచ్చటపడి ఎత్తుకున్నాడు. బుజ్జమ్మ మొగుడు కిష్టయ్యకు తప్ప ఇంట్లో అందరికి ఆ పిల్లి కూన ప్రీతి పాత్రురాలైంది. ఇక కిష్టయ్యా గమ్మునుండక తప్పలా. అది మొదులుకోని ఆ ఇంట్లో ఆ పిల్లి కూన మహా రాణి అయింది. దానికి చిన్నా అని పేరు కూడా పెట్టింది బుజ్జమ్మ. ఎవరైనా ఇంటి కొచ్చినోళ్ళు దాన్ని పిల్లి అంటే బుజ్జమ్మకు కోపం వచ్చేది. " అది మా చిన్నా. నా బిడ్డ తో సమానం. దాన్ని పిల్లి, గిల్లి అనకండి పేరు పెట్టి చిన్నా అని పిలవండి " అని ఉడుక్కునేది. వచ్చిన వాళ్ళు ముక్కున వేలేసుకుని "ఈ విడ్డూరం ఏడా చూడలేదమ్మా. పిల్లిని బట్టుకొని పిల్ల అంటుంది ఈ బుజ్జమ్మ" అనుకునేవారు.

బుజ్జమ్మ ఇంట్లో ఏం జరిగినా ఆ వీధిలో వింతే. ప్రింటింగ్ ప్రెస్ దగ్గరకి, హోటల్ దగ్గరకి వచ్చినోళ్ళకి బుజ్జమ్మ పిల్లి గురించి గొప్పలు చెప్పేది. హోటల్ దగ్గర బల్ల మీద కూర్చుని భోజనాలకి టోకెన్ ఇచ్చేటప్పుడు కూడా చిన్నాని ఒడిలో కూర్చోబెట్టుకునేది బుజ్జమ్మ. చిన్నా కూడా ముద్దుగా ఉండి ఎవరు ఎత్తుకున్న కొత్త లేకుండా వాళ్ళ చేతులు నాకేది. అట్టా బుజ్జమ్మ ఇంట్లో చిన్నా పిల్లి పిల్ల ఉందని ఆ చుట్టు పక్కల అందరికి తెలిసిపోయింది. ఓ రోజు ఇంట్లో ఎవరు లేరు. బుజ్జమ్మకి పక్క ఊరు "చినమానుచేను " లో చీటీపాటకి పోయి రావలసిన పని పడింది. తన చుట్టూతా తిరుగుతున్నా చిన్నాని తమ ఇంటి కింద రెండో అంతస్తులో బాడుగకు ఉండే ఉల్లి పాయల శంకరయ్య భార్య పద్మమ్మ దగ్గర చిన్నాని వదిలి, తాను వచ్చేవరకు జాగ్రత్తగా చూసుకోమంది. అప్పటికి చిన్నా ఆ చుట్టుపక్కల వాళ్ళకి బాగా మాలిమి అయింది. పద్మమ్మ చిన్నాని తీసుకుని తలుపేసుకుంది.

సాయంత్రం ఊరినుంచి వస్తూనే చిన్నా కోసం పద్మమ్మ ఇంటి తలుపు కొట్టింది బుజ్జమ్మ. పద్మమ్మ తలుపు తీసింది. లోపలకి వెళ్లిన బుజ్జమ్మకి పళ్లెంలో కోడికూర ముక్కలను ఆత్రంగా తింటున్న చిన్నా కనిపించింది. అయినా బుజ్జమ్మ గొంతు వినగానే పళ్లెంని వదిలేసి బుజ్జమ్మ దగ్గరికి వచ్చి చుట్టూ తిరుగుతూ బుజ్జమ్మ కాళ్ళు నాకసాగింది." అయ్యో.... చిన్నాకి కోడి కూర అంటే ఇష్టమా... తాము బాపనోల్లం అయిపోతిమి. ఇంట్లో ఎప్పుడు గుడ్డు కూడా వండింది లేకపాయ. ఇక చిన్నా ఎక్కడ తనను వదిలి పద్మమ్మ ఇంటికి పోతుందో అని బెంగతో బుజ్జమ్మ అది మొదలు శీనయ్య చేత సాయంత్రాలు చిన్నా కోసం సెంటర్లో ఉన్న అరవ పాటి వాళ్ళ బండి దగ్గరనుంచి చికెన్ కూర తెప్పించేది. కోడి కూర కాగితం పొట్లంలో కట్టించుకొని వచ్చిన శీనయ్య మిద్దె మెట్లు ఎక్కి చిన్నా అని అన్నాడంటే చాలు బుజ్జమ్మ ఒళ్ళో ఉన్న చిన్నా ఒక్క దూకు దూకి మెట్ల మీదకు పోయి శీనయ్య కాళ్ళను చుట్టేసేది. మెట్లను పూర్తిగా ఎక్కనీకుండానే పొట్లంని కాళ్ళతో లాగి పెరికేసేది. మెట్ల మీద పడ్డ ముక్కలను ఏరి వరండాలో వేసేవాడు శీనయ్య. ఇక ఒక్కో ముక్కను పైకి ఎగరేసి ఆడుకుంటూ, తోక ఊపుకుంటూ తినేది చిన్నా. అది తింటూ ఉంటే సంతోషంగా చూస్తూ ఉండిపోయేది బుజ్జమ్మ.

మూడు నెలలకు చిన్నా బాగా పుష్టిగా ఎదిగింది. ఓ రోజు బుజ్జమ్మ ఇంట్లో వంట చేస్తా ఉంటే చిన్నా ఎక్కడ నుంచో ఓ ఎలుకను నోట కరుచుకుని పెద్ద ఘనకార్యం చేసినట్టు బుజ్జమ్మ ముందర తెచ్చి పడేసింది. అప్పటికే ఆ ఎలుక చచ్చి ఉంది. బుజ్జమ్మ పట్టరాని కోపంతో " ఏంది చిన్నా...ఏం పని చేసావ్ నువ్వు. ఎలుకని చంపుతావా... మానవత్వం లేకుండా.. ఇందుకేనా నేను నిన్ను ఇంత ప్రేమగా చూసుకుంది. ఎదుటి జీవుల పట్ల జాలి, కరుణ చూపించాలి. అప్పటికి నీ కోసం రోజు కోడి కూర తెప్పిస్తున్న కదా. ఇంట్లో పాలు, పెరుగు ఉన్నాయి. ఇంకా ఎందుకు నీకు ఈ పాడు బుద్ధులు" అంటూ అరిచింది.

బుజ్జమ్మ అరుపులకు భయపడిన చిన్నా మూలగా నక్కి బుజ్జమ్మ వంక జాలిగా చూస్తోంది.అక్కడే ఉన్న బుజ్జమ్మ మొగుడు కిష్టయ్య నవ్వతా " ఏంది బుజ్జమ్మ, మానవత్వం అంటా దాన్ని తిడతా ఉండావు. అది ఏమైనా మనిషా... ఎలుకలను పట్టడం పిల్లి జాతి సహజ లక్షణం. మనుషులే మానవత్వాన్ని మరచి దారుణమైన పనులు చేస్తా ఉన్నారు." అన్నాడు. నిజమే కదా అనుకుని ఎలుకను వరండాలో వేసి తినమంది బుజ్జమ్మ. అది మొదలు చిన్నా ఎలుకలను తెచ్చిన రోజు ఇంట్లోకి రానిచ్చేది కాదు బుజ్జమ్మ. ఆ రోజుకి దాని మకాం వరండాలోనే. పక్క రోజు పనిమనిషి జయమ్మ విసుక్కుంటూ చిన్నా ఎలుకని తిన్న తావున ఉన్న రక్తం మరకలను ఫినాయిలు వేసి కడిగేది. ఇక అప్పటి నుంచి మొదలయ్యింది చిన్నాకు డిమాండు. వీధి చివర దర్జీ కొట్టు చిరంజీవి తన అంగడిలో కొత్త గుడ్డలను ఎలుకలు కొట్టేస్తున్నాయి అంటా బుజ్జమ్మని బతిమాలి చిన్నాని రెండు రోజులు రాత్రి పూట వాళ్ళ అంగడిలో ఉంచాడు. మొదటి రోజు అది బుజ్జమ్మ లేదని బిక్కుబిక్కు మంటా ఉండింది. రెండో రోజు రాత్రి మాత్రం ఒకే తూరి మూడు ఎలుకలను పట్టేసింది. సంతోష పడతా దర్జీ చిరంజీవి ఆ విషయం బుజ్జమ్మకి చెప్పి చిన్నాని ఇచ్చివెళ్ళాడు.

ఇక చుట్టు పక్కల ఏ అంగడిలో ఎలుకలున్నా చిన్నాని పంపేవారు. అది హీరోలాగా వెళ్ళి రాత్రి కాపు కాసి పోలీసులు దొంగలను పట్టినట్టు ఎలుకలను పట్టేసి ఎలుకల పాలిటి సింహస్వప్నం అయింది. ఆ రోజు బుజ్జమ్మ ఇంటి పక్కన ఉన్న గుర్రం శెట్టి నారాయణ భార్య అరుణమ్మ వాళ్ళ చిల్లర అంగడిలో ఎలుకలు ఉన్నాయని చిన్నాని తీసుకుపోయింది. మధ్యాన్నం మూడు గంటలప్పుడు హోటల్ కాడ పని ముగించుకొని ఇంటికొచ్చిన బుజ్జమ్మ సన్నగా కునుకు తీస్తా ఉంది. అంతలోనే అరుణమ్మ అరుపులు విని దిగ్గున లేచింది బుజ్జమ్మ. " చూడు బుజ్జమ్మా... మీ చిన్నా ఎంత పని చేసిందో, ఎలుకలు పట్టమని సామాన్ల గదిలోకి పంపితే పది కిలోల నూనె డబ్బాని దొల్లించేసింది. నూనె మొత్తం నేలపాలైయింది. డబ్బు కట్టు నువ్వు" అంది అరుణమ్మ చిన్నాని చూపిస్తా. ఒళ్ళంతా నూనెలో ముంచినట్టు చిన్నా ఒంటి బొచ్చు అంతా ముడుచుకు పోయి తోక నీలుక్కు పోయి చెవులు, ముఖం నుంచి నూనె కారత దీనంగా బుజ్జమ్మ ముందు నిలబడింది చిన్నా. దాంతో బుజ్జమ్మ నిద్ర మత్తంతా వదిలిపోయి అరుణమ్మ మీద తాడెత్తున లేచింది బుజ్జమ్మ.

"ఏం మాట్లాడతా ఉన్నావు అరుణమ్మ నువ్వు... పనిమాల ఉన్నదాన్ని అడిగి అంగట్లోకి తీసుకుపోయింది నువ్వు. ఎలుకలు పట్టాలని కొట్టులో వదిలింది నువ్వు. చిన్నా ఎలుకలను పడతా నూనె డబ్బా మీద పడి ఉంటుంది. అయినా డబ్బాకి సరిగా మూత బిగించక పోవడం మీది తప్పు. పాపం చిన్నా నూనెలో పడి ఎలా అయిందో చూడు.... నేను ఎందుకు కట్టాలి డబ్బు. నా చిన్నాకి ఇలా అయినందుకు నువ్వే కట్టాలి డబ్బు'' అంటా అరుణమ్మ మీద విరుచుకుపడింది బుజ్జమ్మ. ఇక బుజ్జమ్మ నోటికి తాళలేము అని తేలు కుట్టిన దొంగలా జారుకుంది అరుణమ్మ.

నెత్తి, నోరు బాదుకుంటా బుజ్జమ్మ చిన్నాని స్నానాల గదిలోకి తీసుకపోయి పియర్స్ సబ్బుతో దాని వొళ్ళంతా రుద్ది, రుద్ది నాలుగు బొక్కెనల నీళ్లతో కడిగినా దాని ఒంటిమీద నూనె జిడ్డు పోలేదు కానీ బొచ్చు రాలతా ఉంది. అంత సేపు నీళ్లలో నానడంతో చిన్నా చలికి ఒణికి పోసాగింది. గబా గబా చిన్నాని తీసుకుని హాల్లో సోఫా మీద కూర్చుని గంట సేపు తుండు గుడ్డతో దాని ఒంటిని తుడిచింది బుజ్జమ్మ. తుడుస్తున్నంత సేపు అరుణమ్మని శాపనార్థాలు పెడతానే ఉంది. కూలి డబ్బుల కోసం వచ్చిన మేస్త్రిలు సుబ్బయ్య, రఫీలు బుజ్జమ్మని, ఆమె ఒడిలో ఉన్న చిన్నాని చూసి వచ్చే నవ్వుని మీసాలచాటున దాచేసుకున్నారు. లేకుంటే నవ్వినందుకు బుజ్జమ్మ తమ మీద కూడా తిట్ల దండకం ఎత్తుకుంటుందని.

ఆ తర్వాత నుంచి బుజ్జమ్మ చిన్నాని ఎవరి ఇళ్లకు పంపలేదు. ఓ సారి బయటకు వెళ్లిన చిన్నాని వీధి కుక్క ఒకటి తరమతా బుజ్జమ్మ ఇంటి ఇనప గేటు దాక వచ్చింది. చిన్నా గేటు సందులోనుంచి దూరి మెట్లు ఎక్కి బతుకు జీవుడా అంటా బుజ్జమ్మ వొళ్ళో వాలిపోయింది. అప్పటినుంచి అది ఇల్లు వదిలి బయటకి పోలా.

నెల రోజుల తర్వాత సైదాపురంలో ఉన్న బుజ్జమ్మ తోడికోడలు సరోజమ్మ మనవడి బారసాలకి రమ్మని పిలిచారు. కిష్టయ్య హొటల్ సామాను తేవడానికి మద్రాసుకి పోయినాడు. ఇంటి దగ్గర బుజ్జమ్మ కొడుకు చైతన్యకి తోడుగా శీనయ్యని ఉండమని, కూతురు అనితని తీసుకుని సైదాపురం బయలుదేరింది బుజ్జమ్మ. వెళ్ళే ముందు చిన్నా గురించి కొడుక్కి, శీనయ్యకి మరి మరి జాగ్రత్తలు చెప్పి వెళ్ళింది బుజ్జమ్మ.

సైదాపురంలో సరోజమ్మ ఇంట్లో బారసాల వేడుక ముగిసింది. అంతా భోజనాలకు కూర్చున్నారు. బుజ్జమ్మ , అనిత కూడా మొదటి బంతిలోనే తినేసి గూడూరుకు పోవాలని అనుకున్నారు. బుజ్జమ్మ సెల్ ఫోన్ మోగింది "పెదవే పలికిన మాటలలోని తియ్యని పాటే అమ్మ " అనే రింగ్ టోన్ తో. " అబ్బయ్యా...చైతన్య చెప్పరా ఏంది ? మద్రాస్ నుంచి మీ నాయన వచ్చేసాడా'' అంది బుజ్జమ్మ. '' అది కాదే అమ్మ...మరేమో, మరేమో మన చిన్నా అంటా నీళ్లు నమిలాడు చైతన్య. " అరే చిన్నాకి ఏమైంది చెప్పరా " అంది బుజ్జమ్మ. " ఏమైందో తెలీదే, మన చిన్నా నోటినుంచి నురుగు కక్కి హాల్లో పడి చచ్చిపోయిందే " అని ఏడుస్తా చెప్పాడు చైతన్య. ఆ మాటకి పిడుగు మీద పడ్డట్టు కూలిపోయింది బుజ్జమ్మ ....ఇక "సిరికిన్ చెప్పక " పద్యంలో మాదిరి ఎవరు పిలుస్తున్న ఆగక కూతురు అనితని తీసుకుని ఆఘమేఘాల మీద గూడూరుకి వచ్చేసి ఆటో దిగి మెట్ల మీద పడతా, లేస్త వచ్చి హాల్లో కూలబడింది.

అప్పటికే చిన్నా చుట్టూతా చుట్టు, పక్కల వాళ్ళంతా చేరి ఆ పిల్లి ఎన్ని ఎలుకలను పట్టింది, బుజ్జమ్మ దాన్ని ఎంత బాగా చూసింది అని చెప్పుకుంటున్నారు. ఇక ఆగలేక బుజ్జమ్మ కంటికి, మింటికి ఏకధారగా ఏడవసాగింది చిన్నాని పట్టుకుని. అన్ని రోజులు తన పిల్లి చేష్టలతో అందరిని మురిపించిన చిన్నా మాత్రం చేష్టలుడిగి తనకిక సెలవు అంటూ నిర్జీవులలో కలిసి పోయింది. మెట్ల కింద విషపు తేలు కనపడడంతో చిన్నాని ఆ తేలు కరిచి ఉంటుందని అందుకే చిన్నా నురగలు కక్కతా చనిపోయిందని అనుకున్నారు అంతా. రోకలి బండతో కొట్టి తేలుని చెంపేసాడు శీనయ్య. మద్రాసుకి పోయిన కిష్టయ్య కూడా ఇంటికి వచ్చి చిన్నా చచ్చిపోయింది అని బాధ పడ్డాడు. పిల్లకాయలు అనిత,చైతన్యలు కూడా చిన్నాని చూసి ఏడస్తా ఉన్నారు. కిష్టయ్య, శీనయ్య చిన్నా ని గుడ్డలో చుట్టి ఇంటి వెనక ఉన్న రైలు కట్ట దగ్గరకు పోయి గుంత తవ్వి చిన్నాని ఆ గుంటలో వేసి పాలు పోసి దానికి దణ్ణం పెట్టుకుంటా మన్ను వేసి పూడ్చి పెట్టారు.


మూడు రోజులు బుజ్జమ్మ అన్నం, నీళ్లు ముట్టలా. చిన్నాని తలచుకొని తలుచుకొని ఏడుస్తా ఉంది. సూళ్లూరుపేట నుంచి వచ్చిన బుజ్జమ్మ వదిన సుందరమ్మ " ఊరుకోవే బుజ్జి... పిల్లి కోసం అంత బాధ, ఏడుపు ఎందుకు ఎవరో మనిషి పోయినట్టు " అంది. అంత దుఃఖంలోనూ చిన్నాని పిల్లి అన్నందుకు సుందరమ్మ మీద కోపం వచ్చింది బుజ్జమ్మకు.

" హు... పిల్లి అని చిన్నాని తీసిపారేయకు వదినా...మన మనుషులకంటే అవి ఎంతో మేలు. మనుషులకు ఎంత సాయం చేసిన, ఎంత ప్రేమ చూపినా తృప్తి ఉండదు. ఎంత సాయం చేసిన ఇంకా ఇంకా చేయలేదు అని నిషూ'రపడే వాళ్ళు, స్వార్ధ పరులు మనుషులు. కానీ పిల్లి, కుక్క లాంటి నోరు లేని మూగ జీవులు మనుషులకంటే ఎంతో నయం. వాటికి ఇంత తిండి పెడితే చాలు. కడదాకా మన మీద ప్రేమతో, విశ్వాసంతో మనలను అంటిపెట్టుకుని ఉంటాయి. వాటిని పెంచిన వాళ్ళకు తెలుస్తుంది అవి చనిపోయిన బాధ" అంది బుజ్జమ్మ కన్నీళ్లు తుడుచుకుంటూ..

బుజ్జమ్మ బాధ గమనిస్తానే ఉంది పనిమనిషి జయమ్మ. వారం తర్వాత ఓ రోజు పొద్దున్నే దిగాలుగా కూర్చుని ఉన్న బుజ్జమ్మ చేతికి ఓ సంచి తెచ్చి ఇచ్చింది పనికి వస్తానే జయమ్మ. ఆమె అప్పుడప్పుడు వాళ్ళ ఇంటి దగ్గర అమ్మకానికొచ్చాయని రాతిముగ్గు, ముగ్గు రాళ్ళు, నేరేడు పళ్ళు, గోరింటాకు లాంటివి కొని బుజ్జమ్మకి తెచ్చి ఇచ్చేది. బుజ్జమ్మ నిరాసక్తంగా ఆ గుడ్డ సంచిని పక్కన పెట్టేసింది. "బుజ్జమ్మ సంచిలో చేయిపెట్టి చూడు" అంది జయమ్మ. సంచిలో చేయి పెట్టిన బుజ్జమ్మకి మెత్తగా ఏదో తగిలింది చేతికి. బుజ్జమ్మ ఆశ్చర్యంగా సంచిలో ఉన్న దాన్ని బయటకు తీసింది. అది ముద్దు ముద్దుగా ఉన్న బుజ్జి పిల్లి పిల్ల. " చిన్నా పోయిన కాడినుంచి నీ బాధ చూడలేక పోయిన బుజ్జక్క..కొండా గుంటలో మా చెల్లెలు నాగమ్మ ఇంటి దగ్గర పదిరోజుల ముందు పిల్లి ఈనింది అని చెప్తే నీ కోసరమని నిన్న పని అయినంక కొండా గుంటకు పోయి దీన్ని నీ కోసం తెచ్చా..." చెప్పుకుంటా పోతోంది పనిమనిషి జయమ్మ. బుజ్జమ్మ మాత్రం బుజ్జి పిల్లి ని చూసిన ఆనందంలో మైమరచి ఆ పిల్లి కూనలో తన చిన్నాని చూసుకుంటా ఉంది. ఆమె ఆనందం అర్ణవమై అంబరాన్నంటింది. ♦

# రవీంద్రుని అభిప్రాయాలు అనుసరణీయాలు

- ఆర్. లక్ష్మి
0884-2351683



**త**న సమకాలీన విద్యావిధానంపై ఠాగూర్‌కు చాలా అసంతృప్తి ఉండేది. తన చిన్ననాటి పాఠశాల విద్యాభ్యాసం తాలూకు అసంతృప్తులు ఆయనను జీవితాంతం వెన్నాడాయి. ఆంగ్లభాషా వ్యామోహానికి లోనైన లేదా ఆ భాషా ప్రభావం బారిన పడిన సంపన్న కుటుంబాలకు చెందిన పసివారిలో ఆయనా ఒకడు. తన చిన్ననాటి విద్యాబోధన విధానాలతో ఇబ్బందిపడిన కారణంగా ఆయన చిన్నారుల విద్యావిధానం గురించి చాలా లోతుగా ఆలోచించారు. ఆయన అంతరంగంలో తలెత్తిన అనేక తర్కవితర్కాలు విద్యావిధానాన్ని గూర్చిన ఒక సమగ్రమైన అధ్యయనానికి, అవగాహనకి దారితీసాయి.

ప్రాచీన భారతదేశంలోని అరణ్యాలలోని ఆశ్రమవాసులైన మునుల 'గురుకులాలు' ఆదర్శవంతమైన విద్యాబోధనా కేంద్రాలుగా ఆయన భావించేవారు. సకల విద్యాపారంగతులైన మునీశ్వరులు "అతి నిరాడంబరమైన జీవితవిధానం, అత్యున్నతమైన ఆలోచనా విధానం గల పౌరులుగా తమ శిష్యులను తీర్చిదిద్దేవారు. గురుకులవాసంలో పిల్లలు ప్రకృతితో మమేకమై మెలగిన కారణంగా ప్రకృతి నుండి అనేక విషయాలను గ్రహించగలిగేవారు. రవీంద్రుడు పేర్కొన్న ఆ 'తపోవనాల'లో విద్యాబోధన, విద్యాసముపార్జనా రెండూ ఆహ్లాదకరమైన వాతావరణంలోనే కొనసాగేవి. ఉన్నతమైన ప్రమాణాలతో కూడిన ఆ సనాతన విద్యావిధానం ఆధునిక వసతులతో కూడిన వాతావరణంలో ఆహ్లాదకరంగా సాగిపోవాలని ఆయన నిశ్చితాభిప్రాయానికి వచ్చారు. వివరణాత్మకంగా పలు వ్యాసాలనూ వ్రాశారు. విద్యావిధానంలో, బోధనలో దృష్టిలో ఉంచుకోవలసిన మౌలికాంశాలను గురించి విపులంగా వ్రాశారు, చర్చించారు.

తన వ్యాసంగాలకు అనువుగా ఉండే ప్రశాంతమైన వాతావరణంకోసం కలకత్తాను వదలి 1898లో భార్యను 5గురు సంతానాన్ని తీసుకొని 'షాలిదా' లోని తన కుటుంబ ఎస్టేట్‌కు చేరుకున్నారు. రవీంద్రుడు అక్కడ తన పిల్లల చదువు సంధ్యల బాధ్యతను స్వయంగా చేపట్టారు. పెద్ద పిల్లవాడికి ఇంగ్లీష్ ట్యూటర్‌నూ నియమించారు. విద్యాబోధనకు సంబంధించి తన ఆలోచనా విధానాన్ని అమలులో పెట్టడం ఇంట్లోనుండే ప్రారంభించిన తర్వాత ఆయన తపన ఇంకా విస్తృతరూపం దాల్చింది. తన ఆలోచనలను అమలు చేయడానికి ఆయనకు ఇంకా విస్తృతమైన వేదిక కావాలనిపించింది.

రవీంద్రుడు భావుకుడూ, కవీ మాత్రమే కాదు. సంస్కరణాభిలాషి కూడా. అంతరించిపోయిన సత్సంప్రదాయాలను తనదైన రీతిలో గౌరవించడం ఆయన వైఖరి. తన ఆలోచనలను ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి ఒక చిన్న బడిని ప్రారంభిస్తే బావుంటుందన్న ఆలోచన ఆయన మనసులో మొగ్గ తొడిగింది. తన ఆలోచనలకు, ఆదర్శాలకు అనుగుణంగా పిల్లలలోని సృజనాత్మక శక్తులను వెలికి తీయగలగడమే లక్ష్యంగా ప్రకృతిమాత ఒడిలో ఒక విద్యాలయాన్ని నెలకొల్పాలన్న నిర్ణయానికి ఆయన వచ్చారు. తన ఆశయసాధలో ఎదురుకాగల కష్టనష్టాలనుగాని, సాఫల్య వైఫల్యాలను గురించిగాని రవీంద్రుడు పెద్దగా ఆలోచించలేదు.

1901 డిసెంబర్ 22న రవీంద్రుడు తన విద్యాసంస్థను శాంతినికేతన్ ఆవరణలో 'బ్రహ్మచర్య ఆశ్రమం' పేరుతో ప్రారంభించారు. ఆయన పెద్ద కొడుకుతో కలసి 5గురు విద్యార్థులు 5గురు టీచర్లు, టీచర్లలో 4గురు క్రిష్టియన్స్, ఒకరు అతని పెద్ద కుమారుడి ట్యూటర్ అయిన బ్రిటిషర్. అయితే సమకాలీన సమాజానికి ఎదురొడ్డి నిలద్రొక్కుకోగలగడం అంత సులభమేమీకాదన్న సంగతి ఆయనకు అనతికాలంలోనే అవగతమైంది. అతని సంస్థ అటు సంప్రదాయవాదులను గానీ, ఇటు ఆధునికవాదులను గానీ ఏ ఒక్కరినీ మెప్పించలేకపోయింది. కవిగా, రచయితగా అతనిని ఎంతో గౌరవించే ప్రశంసకులు, వ్యక్తిగత సన్నిహితులు సైతం సంస్థ నిలద్రొక్కుకోగలగటం పగటి కలేనన్న అభిప్రాయానికి వచ్చేశారు. సంస్థకి నిధులు కావాలి. సిబ్బందీ కావాలి. సంస్థ మనుగడే ప్రశ్నార్థకమయ్యింది.

కాని – రవీంద్రుడి దృష్టిలో అది ఒక సంస్థ కాదు. పగటికల అంతకంటే కాదు. చిన్నారుల శ్రేయస్సును కాంక్షించి వారిని సృజనశీలురుగా, ఉత్తమపౌరులుగా, బహుముఖ ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దడానికై ఆరంభించిన 'సాధన'– ఆ లక్ష్యం నుండి వెనుకకు మళ్ళడానికి ఆయన సిద్ధంగా లేరు. సంస్థ నిర్వహణా వ్యయం నిమిత్తం పర్సనల్ లైబ్రరీలో కొంత భాగాన్ని, పూరీలోని ఇంటిని అమ్మివేశారు. ఆయన భార్య సైతం తన నగలను ఇచ్చి ఆయన లక్ష్యం దిశగా సాగిపోవడానికి మనస్ఫూర్తిగా సహకరించింది.

సమాజ సంక్షేమానికి సంబంధించిన ఆలోచనలు రవీంద్రుని ఎప్పుడూ వేధిస్తూ ఉండేవి. పరాయిభాషపై ప్రావీణ్యం గరపడం గురించి విద్యార్థులపై ఒత్తిడితేవడం ఆయనకు ఏమాత్రం నచ్చేదికాదు. ఒక పిల్లవాడు తన మాతృభాషలో స్వేచ్ఛగా తనను తాను అభివ్యక్తీకరించుకోవడానికి సహకరించని విద్యావిధానం సరైన విద్యావిధానంగా ఆయనకు అనిపించేది కాదు.

'విద్య' అనేది పటా టోపంతో, ఆర్భాటాలతో నియమిత ఉష్ణోగ్రతల వద్ద పెంచగలిగే మొక్కకాదు. సహజసిద్ధమైన వాతావరణంలో పెరుగుతూ నేలలో బలంగా వేళ్లూనుకోలేని మొక్కలాగే సహజ సిద్ధమైన వాతావరణంలో, అంతకుమించి సహజసిద్ధమైన ప్రక్రియలలో లభించని విద్య వ్యక్తికిగాని, సమాజానికి గాని వనికిరాగల విలువలను సంతరించుకోజాలవని ఆయన ప్రగాఢమైన విశ్వాసం.

రవీంద్రుని దృష్టిలో ప్రకృతిని మించిన గురువులేదు. ప్రకృతిలోని సౌందర్యం, ప్రతి చిన్న పరిణామం, కదలిక అన్నీ ప్రకృతి పట్ల మమకారాన్ని, కుతూహలాన్నీ పెంచుతాయి. అలా ఏర్పడిన కుతూహలం కారణంగా పరిశీలన అలవడుతుంది. పరిశీలన అధ్యయనానికి, అధ్యయనం విషయ పరిజ్ఞానానికి దారితీస్తుంది. ఈ మొత్తం ప్రక్రియలో ఒక సమగ్రమైన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. సంగీతం, లలిత కళలు వంటివి పిల్లలలోని స్పందనలను, భావోద్వేగాలను ప్రభావితం చేయగలవని కూడా ఆయన విశ్వసించేవారు. మేధతో బాటుగా, భావోద్వేగాలు, స్పందనలు వంటి అన్ని అంశాలలోనూ సమగ్రంగా అభివృద్ధి చెంది పరిణతి చెందిన విద్యార్థి పరిపూర్ణ మానవుడుగా తయారుకాగలడని ఆయన నమ్మకం. అటువంటి వ్యక్తి తనకు తానేకాక సమాజహితానికీ ఉపయోగపడగలడని ఆయన భావించేవారు. ఆ కారణంగానే సంస్థలో వ్యక్తిగత ఉన్నతి గురించి ఎంత శ్రద్ధ తీసుకోబడేదో – సమాజ శ్రేయస్సుకూ అంతే ప్రాధాన్యత ఉండేలా ఏర్పాటు చేశారు.

ఆ తరంలోని మేధావి వర్గాలు – ప్రవర్తన, ఆలోచనా విధానాలు అన్నిటినీ పశ్చిమదేశాల నుండి ఎరువు తెచ్చుకొంటున్నాయని రవీంద్రుడు వాపోయేవారు. ఆ రకంగా అప్పటి విద్యాసంస్థలు భారతజాతి గౌరవాన్ని తక్కువ చేస్తున్నాయని విశ్వసించేవారు. విమర్శించేవారు కూడా. మనలను మన వ్యవస్థను ప్రభావితం చేసిన పశ్చిమదేశాలనే తప్పుపట్టడం సరికాదనీ ప్రభావానికి లోనైన మనదీ దోషం ఉన్నదని ఆయన అనేవారు.

రవీంద్రుడు తను నమ్మిన సిద్ధాంతాలను, ఆశయాలను కేవలం వల్లె వేయలేదు. ఆచరించి చూపారు. నమ్మిన విలువలకు కట్టుబడి జీవించారు. అత్యున్నతమైన ఆశయంతో,

# మరణ వాంగ్మూలం

- సురగౌని రామకృష్ణ
7989723820

రెప్పపాటు కాలమంత జీవితంలో
మతం మత్తును ఒళ్ళంతా కప్పుకుని
ఏ ఒక్క రాత్రినైనా కమ్మని కలగా మలచుకుని హాయిగా
నిద్రించావా
ఒక్క ఉషోదయానికైనా
వేకువ దీపమై వెలుగునిచ్చిన
ఆనవాళ్లు నీతో ఏమైనా మిగిలాయా?



వెర్రి సముద్రం ఎగదోసిన
ఉన్మాదపు అలలు
అమాయక తీరం కట్టుకున్న కలల
ఇసుక గూళ్లపై దాడి చేసినట్టు
అమానవీయంగా దేశ వక్ష స్థలంపై
మతం ముళ్ళుతో నువ్వు
గీసిన నెత్తుటి సరిహద్దులు
ఏడు ఖండాల్లో ఏ మత దేహాన్ని కోసినా
ఉన్న రక్త వర్గాలు ఒక్కటేనని నీకు చెప్పలేదా
నువు మనిషివైతే చంపాల్సింది
సాటి మనిషిని కాదు
మనిషికీ మనిషికీ మధ్య
అడ్డు తెరలు కట్టిన మతాన్ని చంపు
ఈ దేశపు ఒకే మట్టి కుదుట్లో
పుట్టిన పచ్చటి మొలకలం మనం
మహా వృక్షమై రేపటి తరానికి నీడగా నిలవాల్సిన వాళ్ళం
మనమంతా ఒకటేనంటూ
మానవతా వృక్షం మీద నిప్పు పువ్వువై వెలిగి చూడు

చిగురాకు మీద మంచు కణంలా
క్షణమైనా చల్లని లేపనం పూసి వెళ్ళు
నీ హృదయ పూలతోట పరిమళాలు
విశ్వమంతా వ్యాపిస్తాయి

మతం ఎప్పుడు పుట్టిందో చెప్పడానికి
ఏ మతాన్ని కన్న తల్లి మన కళ్లెదుట లేదిప్పుడు
ఉన్నాడో లేదో తెలియని దేవుని కోసమో
ఉన్నోడి ఉనికి కోసమో మరో క్రూసేడు యుద్ధానికి
మారణాయుధం కావొద్దు
మారణ హోమాన్ని సృష్టించే ఏ మతం మాకొద్దని
వాడి కర్ణభేరి పగిలేలా గట్టిగా చెప్పు

కాలం ఫుట్పాత్‌పై ఊపిరి తిరస్కరించిన
దేహం కట్టెను మతాన్ని అభిమతాన్ని చూడకుండా
అందరిని కప్పెట్టె మట్టి దుప్పటి మాత్రం ఒక్కటే
మట్టికి లేని మతం మనిషికెందుకని
ప్రశ్నించే రేపటి కోసం
కాలం రాసుకున్న మరణ వాంగ్మూలమిది ♦

---

అతి కొద్ది వనరులతో ప్రారంభించబడిన ఆశ్రమం నిర్వహణను స్వయంగా పర్యవేక్షించేవారు. ఆశ్రమానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలలోనూ పాల్గొనేవారు. పిల్లలతో కలసి గడపడంలో వారికి నేర్పడంలో ఆయనకు ఆనందం లభించేది. తన ఆలోచనలకు ఆదర్శాలకు అనుగుణమైన పాఠ్యపుస్తకాలు మాతృభాషలో (బెంగాలీ) తానే కొన్ని వ్రాశారు. సహచరులను ప్రోత్సహించి మరికొన్నిటిని వ్రాయించారు. అలవోకగా ఆలపించగలగడమే కాదు రవీంద్రుడు అంతే ఇష్టంగా శ్రమించగలిగేవారు కూడా.

పసిపిల్లలు సాధారణంగా పరిసరాలను గురించిన అసాధారణమైన అప్రమత్తతను కలిగి ఉంటారు. పరిసరాల ప్రభావమూ వారిపై అధికంగానే ఉంటుంది. చిన్న పిల్లలు మొదటగా ఇంద్రియాలతో గ్రహించి కండరాలతో ప్రతిస్పందించడం ద్వారా నేర్చుకోవడం మొదలుపెడతారు. ఆ కారణంగా వారికి స్వయంగా నేర్చుకోగల వాతావరణాన్ని కల్పించగలగాలి. తన పరిసరాలను ప్రేమించడం ద్వారా, పరిసరాలకు అనుగుణంగా ప్రతిస్పందించడం ద్వారా మెదడుపై అనవసరమైన భారం పడకుండానే వారు ఎంతో నేర్చుకోగలుగుతారు. ఉదాత్తమైన ఈ భావనతో కూడిన విద్యావిధానాన్నే రవీంద్రుడు 'శాంతినికేతన్'లో అభివృద్ధి చేసి చూపారు. ప్రపంచానికే ఆదర్శం అయ్యారు. ♦

నివేదిక

# భారత కవనంలో లౌకిక స్వరాలు




- వొరప్రసాద్
9490099059

*"విడగొట్టడం/ అవసరమైనవాడా!/ కలిసుండటం/ నీకెలా నచ్చుతుంది?!/ విశ్వాసం మాటున / దేశభక్త మత నాగై కాటేసేవాడా!/ విధ్వంసం కాక/ నిర్మాణం నీకెలా అబ్బుతుంది?!/ ద్వేషం రుచిమరిగిన వాడా!/ ప్రేమించడం నీకెలా తెలుస్తుంది?!"* విజయవాడలో మార్చి 15న భారత కవనం పేరుతో జరిగిన లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమ్మేళనంలో చదివిన శిఖా – ఆకాష్ కవితా వాక్యాలు ఇవి. దేశమంతా విద్వేషాన్ని వెదజల్లుతున్న మతోన్మాద మూకల దుశ్చర్యల్ని, లౌకిక రాజ్యాంగానికి వాటిల్లిన ముప్పుని రోజంతా జరిగిన సభలో ముక్తకంఠంతో కవులు, రచయితలు ఖండించిన తీరుకు పై కవితా వాక్యాలు అద్దం పడతాయి. సాహితీస్రవంతి, మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన 'భారత కవనం' హాజరైన సభికుల్లో ఆలోచనలు రేపింది. మన దేశ లౌకిక స్వభావం యొక్క ప్రాధాన్యతను నొక్కి చెప్పింది. జాతీయోద్యమ కాలంలో దేశంలోని అన్ని సమూహాలు, అన్ని సంస్కృతులకు చెందిన ప్రజలూ చేయి చేయి కలిపి సాగించిన కృషికి, విజయానికి ప్రతీక మన దేశ లౌకిక రాజ్యాంగం అంటూ మాట్లాడిన వక్తలు, కవులు సభలో లౌకిక స్ఫూర్తి నింపారు. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే ఘటనలకు పౌరసత్వ సవరణ చట్టం పరాకాష్టగా మారటాన్ని ఖండించారు. భిన్న సంస్కృతులు, వేలాది సంవత్సరాల సహజీవన సంస్కృతిని కాలరాయటం ఈ దేశంలో సాధ్యం కాదని సభ హోరెత్తింది. ఈ దేశంలోని ప్రజలలో నరనరాన లౌకిక సంస్కృతి ఇమిడి వుందని వక్తలు తేల్చి చెప్పారు. ఆద్యంతం 'భారత కవనం' కార్యక్రమం ఉత్తేజభరితంగా సాగింది.

ఉదయం 'భారతీయ సమాజం – శాసనం – సాహిత్యం' సదస్సులో సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ దేశంలోకి ఎవరొచ్చినా కూడా ఇముడ్చుకొని సహజీవనం చేయడం అలవాటు అన్నారు. అటువంటి సంస్కృతికి అలవాటుపడ్డ దేశంలో ఒక మతాన్ని వేరుగా చూడటం, ఒక మతం వారి సంఖ్యను తగ్గించడానికి చూడటం, వారిని అనుమానంగా చూడటం, వారిని వేధించడం అనేది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. అలా చేయడం రాజ్యాంగబద్ధం కాదన్నారు. ప్రజల ఆమోదం లేకుండా ప్రజాస్వామ్య దేశంలో ఎటువంటి చట్టాన్ని అమలు పరచలేరని, ఈ ప్రభుత్వం కూడా ప్రజలను కాదని ఏమీ చేయలేదని అన్నారు.

సాహితీస్రవంతి గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ లౌకిక అజెండాకూ మతతత్వ అజెండాకూ మధ్య పోరాటం జరుగుతుందని అన్నారు. పౌరసత్వ సవరణ కాదని, పౌరతత్వ సవరణ అని, మొత్తంగా భారతీయ తత్వ సవరణలో భాగం ఈ చర్యలన్నీ జరుగుతున్నాయని విమర్శించారు. సకల మతాలకు నిలయమైన భారతదేశంలో ఒక మతం కొలబద్దగా ఏదీ జరగదు అని అన్నారు. కమ్యూనల్ వైరస్ మనలో చొరబడితే మతసామరస్యం అనే ఇమ్యూనిటీ దెబ్బతింటుందని అన్నారు. రాజ్యాంగం కోసం పార్లమెంటులో పోరాడాలి.

ప్రజాస్వామ్యం కోసం వీధుల్లో పోరాడాలన్నారు. అలాగే మన చైతన్య క్షేత్రంలో కూడా ఏ విధమైన కులమతబేధాలు చొరబడకుండా పెద్ద పోరాటం చేయాలన్నారు.

ప్రముఖ కవి ఖాదర్‌మొహియుద్దీన్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో బీహార్ నమూనాలో 2010 నాటి ఎన్‌పిఆర్‌ని అనుసరిస్తామని అంటున్నారని అది కూడా సరికాదని అన్నారు. ఎన్‌పిఆర్ కోసం వచ్చే ఎన్యుమరేటర్‌లు మెడపై కత్తి పెట్టి ప్రశ్నలు అడుగుతారని అన్నారు. బీహార్‌ను కాకుండా కేరళ ప్రభుత్వాన్ని అనుసరించి మొత్తంగా ఎన్‌ఆర్‌సి అమలుకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని కోరారు. 'పుట్టుమచ్చ' కవితను చదివి వినిపించారు.

సామాజిక పరివర్తన వేదిక వ్యవస్థాపకులు వినయ్‌కుమార్ మాట్లాడుతూ మాతృభూమి లేకపోవడానికి మించిన విషాదం లేదన్నారు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు రాజ్యాంగం రూపొందక ముందే విత్తనాలు పడ్డాయన్నారు. రాజ్యాంగం రూపొందే సమయంలోనే గోల్వాల్కర్ హిందూ రాష్ట్రం స్థాపించడమే మా లక్ష్యం అని ప్రకటించాడన్నారు. అనేక వైవిధ్యాలు, భిన్న సంస్కృతులు, ఎన్నో వైరుధ్యాలు ఉన్న మన దేశ ప్రజలందరూ కలిసి సాగాలని రాజ్యాంగ పరిషత్ సమావేశంలో బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారన్నారు. జనసాహితి బాధ్యులు వి. రాధిక మాట్లాడుతూ శాసనాలు చేసినా సమాజాన్ని శాసించేది ఎక్కువగా సాంస్కృతిక ధోరణే అని అన్నారు. లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే స్థితిలో ఈ దేశ ప్రజలు పడటం చాలా విచారకరమన్నారు. ఎం.బి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌సి, సిఎఎకి వ్యతిరేఖంగా ప్రజాసంఘాలు, కవులు, మేదావులు ముందుకు వచ్చి దేశ సమైఖ్యత కోసం పోరాడాలని కోరారు. సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్ ఉదయం సభకు అధ్యక్షత వహించారు. సాహితీస్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సత్యరంజన్ అతిథులకు ఆహ్వానం పలికారు.

మధ్యాహ్నం జరిగిన 'భారత రాజ్యాంగం – నేటి – సవాళ్ళు' అంశంపై జరిగిన సభలో శాసన మండలి సభ్యులు కె.ఎస్. లక్ష్మణరావు ముఖ్య ప్రసంగం చేసారు. ఎన్‌ఆర్‌సిని ముస్లింలకు సంబంధించిన సమస్యగా చూస్తున్నారని అది సరైంది కాదని అన్నారు. దేశంలోని పౌరులందరూ తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవలసిన అవసరం ఈ ఎన్‌ఆర్‌సి అమలు ద్వారా తప్పదని అన్నారు. కేవలం ప్రత్యేక పరిస్థితులలో అస్సాంలో మాత్రమే అవసరమైన ఈ ఎన్‌ఆర్‌సిని దేశవ్యాప్తంగా అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో ప్రజలు ఆందోళనలు చేపట్టారని అన్నారు. ఈ ప్రక్రియను అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రముఖ కవయిత్రి అరుణ గోగుల మండ మాట్లాడుతూ మనం తినే అహారాన్ని, మనం కట్టుకునే బట్టని శాసించే శక్తులు ఈ రోజు దేశాన్ని పరిపాలిస్తున్నాయని అన్నారు. ఈ పరిస్థితులు ప్రజలలో పెద్ద యెత్తున ఆందోళనలకు దారితీసాయని అన్నారు. ఆందోళన చేస్తున్న ప్రజలకు మద్దతుగా రచయితలు తమ స్వరం వినిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా మేధావులు, రచయితలు ముందుకు వచ్చి ప్రజలను చైతన్యపరచాలని కోరారు.

కులనిర్మూలన పోరాట సమితి ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ పౌరసత్వాన్ని నిరూపించుకునే దుస్థితికి నెట్టిన ప్రభుత్వ ధోరణిని తీవ్రంగా వ్యతిరేకించాలని అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం సభకు సాహితీస్రవంతి రాష్ట్రకమిటీ సభ్యులు సత్యాజీ అధ్యక్షత వహించారు. సాహితీస్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా అతిథులకు ఆహ్వానం పలికారు.

**ఉత్తేజం కరంగా సాగిన జనకవనం**

ఉదయం జరిగిన జనకవనాన్ని జంధ్యాల రఘుబాబు, శాంతిశ్రీ, పి. కుమారస్వామి, కె.ఎక్స్. రాజు నిర్వహించారు. మధ్యాహ్నం జోశ్యుల కృష్ణబాబు, నూనెల శ్రీనివాసరావు, వెంకట్, శిఖా – ఆకాష్, వైష్ణవిశ్రీ, బెందాళం కృష్ణారావులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కవులు ఎన్‌ఆర్‌సికి వ్యతిరేకంగా, లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అంటూ తమ స్వీయ కవితలను వినిపించారు. దేశమంతా అల్లుకున్న ఈ ఎన్‌ఆర్‌సి సమస్యను కవులు కూడా చాలా సీరియస్‌గా పట్టించుకున్నారనడానికి వారు చదివిన కవితలే నిదర్శనం. ఈ దేశానికి లౌకిక స్వభావం అన్నది ఎంత సహజమో తమ కవితల్లో వ్యక్తీకరించారు. పౌరసత్వం పేరుతో ప్రభుత్వం చేస్తున్న కుట్రను తమ కవితల్లో బహిర్గతం చేశారు. మొత్తంగా కవుల తీవ్ర స్పందనలోని సామాజిక నిబద్ధతను అభినందించాల్సిందే. కొందరు కవుల వాక్యాలను చూద్దాం....

వైష్ణవిశ్రీ 'పిల్లల కోడి' కవితలో ***"దాయాదుల కాలాన్ని /***

*ఏ టైం మెషీన్ తో తోడుకురావాలి / తాత ముత్తాతల/ అడుగుజాడలు నావి కాదంటే/ ఏ దేశం మట్టిలో నన్ను బొంద పెట్టుకోవాలి/ నా ముఖాన్నిప్పుడు / ఏ దేశం అద్దంలో చూసుకోవాలి"* అంటూ తన గొంతును వినిపించారు.

డా॥ జోశ్యుల కృష్ణబాబు 'కా..చట్టం..ఓ పెద్దశిక్ష" కవితలో *"అవును../ ముమ్మాటికీ ఇదో పెద్దశిక్షే../ మీ నాన్న, ఆయన నాన్న,/ ఆ నాన్నకు నాన్న../ ఎక్కడో? ఎప్పుడో?/ ఆ మూలాల్ని ఇపుడు../ వెతికి పట్టుకోమంటుంది../ ఈ చట్టం..! "* అంటూ వ్యంగ్యంగా కవితాస్త్రం విసిరారు.

జంధ్యాల రఘుబాబు *"నేను అనార్యుణ్ణి" కవితలో "మా అన్నదమ్ముల మధ్య / మంటలు రగిలించి/ నీవు తినాలనుకునే / ఆ రక్తపు కూడు/ నీ నోటికందిచదానికి/ మేం సిద్ధంగా లేం/ మేం సిద్ధంగా లేం"* అంటూ ధిక్కార స్వరమయ్యారు.

అమూల్యా చందు 'దేశం లేని మనిషిని' కవితలో *"ఏ చెట్టును, పుట్టను/ తవ్వాలి నేనిప్పుడు.../ ఏ తల్లి రక్తాన్ని/ డీఎన్ఏ చేయించాలి/ నేనిప్పుడు../ ఏ నాన్న మజ్జ/ గుజ్జు సరిపోతుందని/ తేల్చాలి నేనిప్పుడు...?"* అంటూ సమాధానం చెప్పలేని ప్రశ్నలను ప్రభుత్వానికి సంధించడం నిజంగా అభినందించాల్సిందే.

"పిళ్ళా విజయ్ 'షహీన్ బాగ్ సాక్షిగా" కవితలో *"నువ్వెన్ని విద్వేష రాగాలు పలికినా / పల్లవించే స్వరాలే లేవిక్కడ?/ నువ్వెన్ని కొత్త విన్యాసాలు చేసినా / చప్పట్లు కొట్టే చేతులే లేవిక్కడ./ మానవత్వం పరిమళిస్తున్నదీ పూదోటలో/ మహోన్నతిని సాధిస్తుందీ నేలలో/ నువ్వు వేసిన పాచికలు పారవిక్కడ/ దృఢ సంకల్ప మానవహారం నిలిచిందిక్కడ / షాహీన్ బాగ్ స్ఫూర్తిగా"* అంటూ ఢిల్లీలోని షాహీన్‌బాగ్ మహిళల పోరాటస్ఫూర్తిని కవిత్వం చేశారు.

ఉషారాణి 'తన 'తిరస్కారం' కవితలో *"త్యాగాల వారసత్వం నాది,/ నాది రాజీల వారసత్వం కాదు. / నాది దాసోహ వారసత్వం కాదు, / నాది పోరాట వారసత్వం. / నేనే ప్రశ్నకు సమాధానం చెప్పను, / నేనే కాగితం సంతకం చేయను"* అంటూ తీవ్ర నిరసనను తన కవిత్వంలో వినిపించారు.

అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తి తన 'సంఘర్షణ' కవితలో *"సమతా మమతల ఏకతారాగం / ఆలపించే స్వతంత్రజాతి విహంగాలను/ అనాలోచిత అనాగరిక నిబంధనల ప్రశ్నలతో/ ప్రజాస్వామ్య ప్రాథమిక హక్కులను / కాలరాయడానికి / ఎక్కడనుండి పుట్టుకొస్తున్నారు మీరంతా/ ఏ వైరస్ లు తొలుస్తున్నాయి మీ మెదళ్ళపొత్తాలని!?"* అంటూ అసంబద్ధమైన ప్రభుత్వ వైఖరిని తన కవిత్వంలో తూర్పారబట్టారు.

విల్సన్‌రావు కొమ్మవరపు తన 'స్వేచ్ఛ కోసం..' కవితలో *"విడదీసి బలపడటమే/ అతడికి ప్రధాన ఎజెండా / ఐనప్పుడు/ ఒక్క నిజం కోసం/ శుద్ధ నిజం కోసం/ చెప్పేది చేసేది ఒకటే కావాల్సినప్పుడు/ దేహాలకు దివిటీలు కట్టి/ వెతుకులాటతో/ నువ్వు పదునెక్కాలి/ ఆలోచన కాంతిపుంజమై/ చూపు కాగడాగా వెలగాలి.."* అంటూ కవితాత్మకంగా ఆలోచనలు రేపారు.

పంబి మురళీకృష్ణ తన 'ఏదీ నీ ఆధారం' కవితలో *"తండ్రి తాలుకా వివరాలు,/ తాతల తరాల తాళపత్రాలు / తీసుకురమ్మంటే / నేనెక్కడికి వెళ్ళేది? నేనేమి చేసేది?/ అసలు నన్ను నేను నిరూపించుకునే దౌర్భాగ్యం ఏంటి.?"* అని అడుగుతారు.

మందరపు హైమవతి తన 'ఒక భరోసా' కవితలో *"పొట్టనింపుకోవడానికి ఆ ఊరు ఈ ఊరు తిరిగే ఆగమ్మ కాకులకు/ అమ్మ అయ్యలెక్కడ పుట్టారో వెతుక్కొనే వెతలొచ్చిపడ్డాయి/ తిన్నా తినకున్నా కడుపులో కాళ్ళు ముడుచుకొని పడుకొనే మాకు/ ఈ లెక్కలెందుకో మా మట్టిబుర్రలకు పట్టడం లేదు"* అంటూ పదునైన భావాన్ని సంధించారు.

ఎస్‌కెడి ప్రసాదరావు తన 'మట్టికి మతముంది' కవితలో *"మట్టికి మతముందంటున్నాడు వాడు / అందరూ మట్టి మనుషులే అంటున్నాను నేను / మనుషులకు / మానవత్వం ఉండాలి గాని మతం కాదు"* అంటూ సూటిగా తన భావాన్ని వ్యక్తం చేసారు.

ఏభై ఐదుగురు కవులు తమ స్వీయ కవితలను 'భారత కవనం' లో వినిపించారు. బంగార్రాజు కంఠ, బెందాళం కృష్ణారావు, శాంతిశ్రీ, కె.ఎక్స్. రాజు, సయ్యద్ జహీర్ అహ్మద్, ఇంకా ఈ సభకు రాకపోయినా తమ కవితలను చదివి వినిపించమంటూ పంపించిన చిత్తలూరి, కవి కరీముల్లా, పూసల రజనీగంగాధర్ వంటి ఎందరో ఈ కార్యక్రమం పట్ల తమ ఆసక్తిని చూపించారు. అందరూ కూడా లౌకిక స్ఫూర్తిని

## సంస్మరణ

# యుగపురుషుడు



- ఎల్. వెంకటేశ్వర్లు
9949683271

'సంస్కారం' అనే తైలాన్ని పోసి
స్త్రీ విద్యాజ్యోతిని జ్వలింపజేసి
ఆంధ్రజాతినంతటిని జాగృతపరచి
కీర్తి శిఖరాలనధిరోహించిన
నవయుగ వైతాళికుడు కందుకూరి

పదునైన సంక్లిష్ట భావజాలంతో
శరాఘాతం వంటి వాదనాపటిమతో
నిష్కర్షగల అమేయ రచనా పటుత్వంతో
మూఢాచార రక్కసిని తునుమాడిన
దార్శనికుడు, సాహితీ సంస్కర్త కందుకూరి

బాల్య వివాహాల నెదిరించి
కన్యాశుల్కానికి బలైపోయిన
అబలలపై పునర్వివాహమనే
వెలుగును ప్రసరింపజేసిన
మార్గనిర్దేశకుడు కందుకూరి!!

దీక్ష పట్టుదలలే ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా
నిరంతర అసామాన్య కృషే ధ్యేయంగా
గోల్డ్‌స్మిత్, స్విఫ్ట్ ప్రభుతుల రచనలను
అనువాదం చేసిన బహుభాషావేత్త
శతాధిక గ్రంథకర్త, మహామనీషి కందుకూరి

శ్రీమంతులనెందరినో ప్రోత్సహించి
అఖండ గోదావరీ పరీవాహక ప్రాంతంలో
హితకారిణీ సమాజ నిర్మాణం గావించి
వితంతువుల నెందరినో సముద్ధరించిన
సంస్కరణానురక్తుడు, ప్రగతిశీల భావుకుడు కందుకూరి

ముక్కుపచ్చలారని, లోకం పోకడ తెలియని
అమాయక బాలికలను సముద్ధరించి
జీవితానికి అర్థం, పరమార్థం కలిగించి
స్త్రీ జాతిని సాంసారిక దిశగా నడిపించిన
సామాజిక విప్లవ చైతన్య స్ఫూర్తి కందుకూరి

సమాజానికెదురీదిన ధీరత్వం
అంధవిశ్వాసాల నెదిరించే కాంతిపుంజం
ఆచారాలనెదిరించే హేతువాదం
కారణాన్నన్వేషించే సూటిదనం
కమనీయ నైజానికి ప్రతిరూపం కందుకూరి

అభ్యుదయ భావావేశపరుడు
నిరంతర గ్రంథరచనాసక్త చిత్తుడు
సమసమాజ నిర్మాణ ధురీణుడు
గద్యతిక్కన, రావుబహద్దర్ కందుకూరి
అందుకో మా ఘన నివాళి ప్రతిసారి!

**(ఏప్రిల్, 16 కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా..)** ◆

---

తమ కవితల్లో చాటారు. నిజానికి కరోనా వైరస్ కారణంతో పాటు, ఎన్నికల డ్యూటీల అవరోధం కారణంగా ఎందరో కవులు ఈ భారత కవనానికి రాలేకపోయారు. కొందరు తమ కవితలను 'భారత కవనం' లో చదివి వినిపించమంటూ ఇమెయిల్, వాట్సప్‌లలో పంపించారు. దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టానికి, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న ప్రజలకు మద్దత్తుగా తెలుగునాట కవులు, రచయితలు 'భారత కవనం' కార్యక్రమం ద్వారా స్పందించడం అభినందనీయమైన విషయం. సభలో వక్తలు పౌరసత్వ అంశానికి సంబంధించి లోతైన విశ్లేషణలు చేసారు. అవన్నీ కూడా ప్రజలకు విస్తృతంగా చేరాలి. ఈక్షణం **E Kshanam** యూట్యూబ్ ఛానల్ వారు కార్యక్రమం అంతటినీ వీడియో తీసి యూట్యూబ్‌లో ఉంచారు. ఈ వీడియోలను అందరూ షేర్ చేసుకోవడం ద్వారా లౌకిక భావజాల వ్యాప్తికి తోడ్పడాలని కోరుతున్నాను. సామాజిక బాధ్యతగా భావించి ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ప్రత్యేక అభినందనలు. ◆



# కరోనా కఠోర ప్రశ్నలు

- తెలకపల్లి రవి

కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తున్న వేళ భారత దేశ పరిస్థితి మరీ అయోమయంగా మారిపోయిందంటే కారణం ఆరోగ్య రంగం దురవస్థే. ఇప్పటివరకు ఒక పరిధి మించి వైరస్ వ్యాప్తి జరక్కపోవడంలో ప్రభుత్వాల పాత్ర ఎంత? సహజసిద్ధ లక్షణాల పాత్ర ఎంత? అనేది బేరీజు వేయడానికి ఇది సమయం కాదు. ఒక వైరస్ వ్యాప్తి క్రమం పూర్తయినట్టు నిర్ధారించకుండా అంతిమ పాఠాలు చెప్పడం శాస్త్రీయం కాదు. కరోనా గురించి దేశంలో వస్తున్న లెక్కల ఆధారంగా భయం పెంచడమూ, భరోసా ఇవ్వడమూ కూడా పొరబాటే అవుతాయి. ఎందుకంటే 130 కోట్ల జనాభా వున్న దేశంలో మనం జరిపిన పరీక్షల శాతం నామమాత్రం. పరీక్షలు, పాజిటివ్‌లు, మరణాల నిష్పత్తి ఎలాంటి కొలబద్ద కాదు. ఎప్పటికైనా కోట్ల సంఖ్యలో పరీక్షలు చేయడం ఊహకందని విషయం. వైరస్ సోకినా కొన్నాళ్ల పాటు వ్యాధి లక్షణాలు బయిటపడక పోవచ్చునీ, నయమైన వారు కూడా మరొకరికి అంటించవచ్చుననీ, వారిలోనూ పునరావృతం కావచ్చునీ చాలా పరిశోధనలు చెబుతున్నాయి. లాక్‌డౌన్, భౌతిక దూరం వంటివన్నీ పాటిస్తున్నా కేసులు దాదాపు 500 నుంచి 15,000 కు చేరుతున్నాయి గనక గొప్ప ఫలితాలు కలిగాయని చెప్పలేము. పైగా పాత కేసులు అనేకం తప్పించుకుని నెమ్మదిగా బయిటపడటం కూడా చూస్తున్నాం. అందుకే మనం ఇంకా సంధి దశలో, సందిగ్ధ దశలో వున్నట్టు లెక్క. ముందే మేల్కొన్నామనీ చాలా దేశాల కన్నా మెరుగనీ మనకు మనం ఆత్మ సంతృప్తి చెందడం తొందరపాటు అవుతుంది. ఈ దశలో చేయగలిగింది, చేయవలసింది ఒకే ఒక్కటి. అప్రమత్తంగా అరికట్టడానికి చర్యలు తీసుకోవడం. పరీక్షలు, చికిత్స వంటివి చేయడం. కాని ఎక్కడ చేయాలి? ఎవరు చేయాలి? ఈ ప్రశ్నలకు సమాధానం కనుగొనడానికి మనకు దాదాపు మూడు వారాలు పట్టింది. ఇప్పటికీ దేశంలో గాని అత్యధిక రాష్ట్రాలలో గాని పటిష్టమైన, స్పష్టమైన ఏర్పాట్లు వున్నాయని చెప్పలేము. ప్రధాని నరేంద్ర మోడీ మూడు ప్రసంగాల తర్వాత కూడా కరోనా కఠోర ప్రశ్నగానే మిగిలి వుందంటే మన ఆరోగ్య వ్యవస్థ అనారోగ్యం, ఆర్థిక విధానాల బూటకత్వం, పాలనా వ్యవస్థల వర్గ తత్వం మూల కారణాలు.

**0.31 శాతంతో 130 కోట్ల మంది వైద్యం**

దేశంలో వైరస్ వ్యాప్తి పరిమితంగానే వుందంటున్నా వారికి కూడా చికిత్స చేయడానికి, పరీక్షలు జరపడానికి మనం సిద్ధం కాలేకపోయాం. కమ్యూనిటీ వర్సెస్ కార్పొరేట్ వైద్య పోటీలో మన దేశ పరిస్థితులను గమనంలో పెట్టుకుంటే నిస్సందేహంగా మొదటిదాన్ని కాపాడుకోవలసి వుంది. ఇంత సంక్షోభంలో కూడా మలేరియా మందులు ఎగుమతి చేయగల స్థితిలో వున్న ఈ దేశం కమ్యూనిటీ వైద్యాన్ని ఎందుకు కాపాడుకోలేక పోయింది? ప్రపంచీకరణలో భాగంగా రెండు దశాబ్దాల ఆర్థిక సరళీకరణకు ఆరోగ్య రంగం బలై పోయింది. అంతకంతకూ నిధులు గండి పడుతూ ప్రభుత్వ వైద్యం పాడుపడుతూ వచ్చింది. 2019-20 బడ్జెట్‌లో వైద్య రంగానికి కేటాయింపు రూ.66,466 కోట్లు కాగా 2020-21లో అంటే వర్తమాన సంవత్సరంలో అది రూ.69,234 కోట్లకు పెరిగింది. అంకెల్లో చూస్తే రూ.2768 కోట్ల పెరుగుదల కనిపించినా వాస్తవానికి పెరిగిన ధరలు, ఖర్చులతో పోలిస్తే ఇది 4.3

శాతం తక్కువ. జిడిపిలో 0.31 శాతం మాత్రమే. అంతకు ముందు 0.33 శాతంగా పాతాళంలో వున్న ఆరోగ్య బడ్జెట్‌ను మరింత కుదించి అథః పాతాళం లోకి దింపిన ఘనత మోడీ సర్కారుదే. మళ్లీ ఇదే బిజెపి 2025 నాటికి జిడిపిలో 2.5 శాతం ఆరోగ్యానికి కేటాయించేలా చర్యలు తీసుకుంటామని 2017లో చెప్పింది. అలా జరగాలంటే బడ్జెట్‌లో కేటాయింపు ఏటా 36 శాతం పెరగాలి. వున్నదాన్ని 4 శాతం పైగా తగ్గించడం అందుకు పూర్తి విరుద్ధమైన చర్య.

**వ్యవస్థ నిర్మాణం గాలికి!**

ఆరోగ్య బడ్జెట్‌లో ప్రతిదీ కోతకు గురికావడం మరో విపరీతం. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)కు కేటాయింపు రూ.390 కోట్ల మేర అంటే ఏడు శాతం వరకూ కోత పడింది. ఇందులోనూ ప్రత్యేకించి గ్రామీణ వైద్య వ్యవస్థ నిర్మాణ భాగం 45 శాతం తగ్గించేశారు. అదివరకటి బడ్జెట్‌లో తగ్గింపు కూడా కలుపుకొని చూస్తే ఇది 58 శాతం కోత అవుతుంది. భవన నిర్మాణాల ఆధునీకరణ, వైద్య పరికరాల వంటి వాటికి నిధులు లేకుండా పోవడానికి ఇది ప్రధాన కారణం. 'ఆయుష్మాన్ భారత్' పేరిట ఆరోగ్య సంక్షేమ కేంద్రాల (హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు) కోసం రూ.1600 కోట్లు కేటాయించారు. వీటికి అంటువ్యాధులు కాని 12 జబ్బులు కూడా కేటాయించారు. ఇందుకోసం 2022 నాటికి లక్షన్నర కేంద్రాలు నిర్మాణం చేయాలన్న లక్ష్యం ఇప్పటికి 15 శాతం కూడా నెరవేరింది లేదు. ఇక జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌ఎం) రూ.800 కోట్లు అంటే 8 శాతం కోత పడింది. గ్రామీణ శిశుఆరోగ్యం పూర్తిగా మూలన పడింది. పట్టణాలకు సంబంధించిన కేటాయింపులు కూడా గిడచబారి వున్నాయి.

**పి.పి.పి స్మరణం**

అన్ని విషయాల్లోనూ కేటాయింపులు అరకొరగా చేసిన ఈ ప్రభుత్వం పి.పి.పి పేరిట ప్రైవేటు రంగానికి తలుపులు తెరచింది. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కాలేజీ, బోధనాస్పత్రి ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ఆరోగ్య మంత్రి చేసిన ప్రసంగం వాస్తవానికి ప్రైవేటు రంగం గురించే. జిల్లా కేంద్రాల ఆస్పత్రులను కూడా కార్పొరేట్లకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఎ.పి లో చంద్రబాబు హయాంలో మొదలై, నిరసన కారణంగా ఆగిన ఈ ప్రక్రియ ప్రస్తుత ప్రభుత్వంలో మరింత ఊపందుకునే సూచనలున్నాయి. పైగా వాటికి ఆర్థిక లోటు తట్టుకోవడం కోసం ఎదురు పరిహారం (వయబిలిటీ గ్యాప్ ఫండ్) ఇవ్వాలని నిర్ణయించారు. నీతి ఆయోగ్ ఈ విషయంలో స్పష్టమైన నిర్దేశకాలు ఇచ్చింది. కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు ఈ సూచనను తోసిపుచ్చాయి కూడా. పేద, మధ్య తరగతి ఇన్‌పేషెంట్ల ఖర్చులు భరించేందుకు ఉద్దేశించిన 'ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన' (పిఎంజెఎవై) కి మాత్రమే రూ.3200 కోట్ల నుంచి రూ.6400 కోట్లకు కేటాయింపు పెంచారు. అయితే ఇది ప్రధానంగా ప్రైవేటు వైద్యశాలలకే పోతున్న పరిస్థితి. ఇక బ్రిడ్జి కోర్సుల పేరిట మరో కొత్త ప్రయోగం కూడా బడ్జెట్ లోనే ప్రకటించారు. మన దేశంలో వైద్య విద్య అభ్యసించిన వారు విదేశాలకు వెళ్తే అక్కడ కూడా పని చేయడానికి వీలుగా శిక్షణ ఇవ్వడం దీని ఉద్దేశం. క్షేత్ర స్థాయి పరిస్థితులు చెప్పి మన అవసరాలకు అనుగుణంగా వారిని మలచేందుకు మాత్రం ఎలాంటి బ్రిడ్జి కోర్సూ లేదు. ప్రత్యేక వైద్య నిపుణులను పెంచుకునే పథకాలూ లేవు.

**సాధించిన విజయాలకూ ఎసరు**

నిధులు లేక విడుదల కాక గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఫలితంగా ప్రజలు అనివార్యంగా ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించవలసి వచ్చిందని 75వ జాతీయ సర్వే హెచ్చరించింది. అయితే వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో గ్రామాలలో ఆర్థిక పరిస్థితి చితికిపోయింది. ప్రైవేటు వైద్యం భారాలు మోయలేరు గనక అసలు వైద్యం కోసం వెళ్లడమే తగ్గించుకున్న పరిస్థితి కూడా దాపురించింది. ఈవిధంగా ఎన్‌ఎస్‌ఎం నిధులు కుదించిన ఫలితమేమంటే మొదటి మిషన్‌లో సాధించిన సత్ఫలితాలు కూడా వెనక్కు పోయే ప్రమాదం ఏర్పడింది. ఎయిడ్స్‌తో సహా చాలా వ్యాధుల కోసం కేటాయింపులు, వ్యవస్థలు కూడా స్తంభించిపోవడం అసలే అదృశ్యం కావడం ఆందోళన కలిగించే వాస్తవం. వ్యాక్సిన్ల విషయంలో కూడా అయిదు కొత్తగా జోడించినా ఆ మేరకు నిధులు పెరగలేదు. మరోవైపున మధ్యాహ్న భోజనం, గర్భిణీలకు పోషకాహార పథకాల వంటివి కూడా కొడిగట్టిపోయాయి. ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే సందర్భం లోనూ ప్రభుత్వం వైద్య పరికరాల దిగుమతిపై అదనపు సుంకాలు విధించింది. ఆ యాజమాన్యాలు మరింత జోడించి రోగుల పైకి వాటిని తోయడం అనివార్యం. కొంతమంది అంటున్నట్టు ప్రభుత్వ వైద్య వ్యయం తక్కువగా

## పాట

## కరోనా.. కరోనా...

- తెలకపల్లి రవి

కరోనా... కరోనా..
హుసే జంగ్ కరోనా
కభీ నహీ డరోనా
గరమే హీ రహనా...

కరోనా నివారణ
ఇంట్లోనే ఉండన్నా
ఉంటే క్రమశిక్షణ
కుటుంబాల రక్షణ // 2 //

భయమొద్దు బెంగావద్దు
జాగ్రత్తే బ్రహ్మాస్త్రం
విచ్చలవిడి తిరిగామా
కాపాడదు ఏ శాస్త్రం
// కరోనా నివారణ //

లాక్‌డౌను లైఫ్‌కు కాదు
ఈ కాలం పరుగు ఆగదు
గండం గడిచామంటే
సంతోషం అంతు తెలియదు
// కరోనా నివారణ //

తరిమి తరిమి కొట్టామెన్నో
ప్రాణాంతక రోగాలు
మానవాళి విజ్ఞానం
జయిస్తుంది ఈ సవాలు
// కరోనా నివారణ //

మన వైద్యులు సహాయకారులు
పారిశుద్ధ్య పహారా దళములు
అందరికీ వందనమందాం
బాధ్యతగా మనమే ఉందాం
// కరోనా నివారణ //

సమయం సద్వినియోగం
సంయమనం జీవనసూత్రం
మంచితనం మానవగమనం
మహమ్మారి మరణశాసనం
// కరోనా నివారణ //

బాధితులకు సాయం చేద్దాం
శ్రమజీవులకు తోడు నిలుద్దాం
ధైర్యంగా ముందుకు నడచి
చైతన్యం చాటి చెప్పుదాం
// కరోనా నివారణ // ◆

---

వుండటం, పౌరులు కూడా తగు ఖర్చు చేయకపోవడం ఈ సంక్షోభానికి కారణం కాదు. ఏటా 3 లక్షల కోట్ల డాలర్లు వైద్య రంగానికి కేటాయించే అమెరికా కూడా ఆ డబ్బు కార్పొరేట్ ఆస్పత్రుల చేతిలో పోస్తున్నది. ఇది గాక వ్యక్తులు తలసరి పది వేల డాలర్లు వెచ్చిస్తున్నారని అంచనా. తారకమంత్రంగా చెప్పబడే వైద్య బీమా కారణంగా 65 వేల డాలర్ల మేర అనవసర పరీక్షలు చేస్తున్నారని 2010లో 'గ్యాలప్' సర్వేలో తేలింది.

**కోట్లలో కార్పొరేట్ క్లెయిములు**

కార్పొరేట్ ఆస్పత్రులు కరోనా రోగులను చేర్చుకోవడానికి, పరీక్షించడానికి తొలుత సిద్ధం కాలేదు. ప్రభుత్వ విధానం కూడా సమగ్రంగా లేకపోయింది. ఆలస్యంగా అనుమతి ఇచ్చిన తర్వాత కూడా ఉచితంగా పరీక్షలు చేసి రీయింబర్స్‌మెంట్ తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత చాలా ప్రైవేటు వైద్యశాలలు వెనక్కుపోయాయి. వ్యాధి తీవ్రత ఎక్కువగా వున్న ముంబయి, ఢిల్లీ వంటి చోట్ల కరోనా రోగులను చేర్చుకున్నప్పటికీ వాటి బిల్లులు కళ్లు తిరిగేలా చేశాయి. ఉదాహరణకు 90 మంది రోగులకు చికిత్స చేసిన ప్రైవేటు ఆస్పత్రులు రూ.1.95 కోట్లకు బీమా క్లెయిమ్ చేశాయి. సగటున కరోనా చికిత్స కోసం వసూలు చేసిన ఫీజుల మొత్తం రూ.1.65 లక్షల నుంచి రూ.2.16 లక్షల వరకూ వుండటం వాటి వ్యాపార దృష్టికి అద్దం పడుతుంది. గుర్‌గావ్‌లో ఒక ఆస్పత్రి మరీ విపరీతంగా ఒక రోగికే రూ.6.70 లక్షల బిల్లు చేసింది. ఒక్క రోగికే 1300 గ్లోవ్స్ వాడినట్టు చూపించింది. ఐసియులో ఒక రోజు వుంచడానికి రూ.10,000 వరకూ తీసుకునే అవకాశం వుండగా గుర్‌గావ్ ఆస్పత్రులు రూ.43 వేలు చార్జి చేశాయి. పిపిఇ కి రూ.రెండు వేలు చార్జి చేసే అవకాశం వుండగా రూ.4,500 చూపించాయి. ఇప్పటికే రూ.66 లక్షల మేరకు క్లెయిములు చెల్లించిన బీమా కంపెనీలు మరీ ఎక్కువగా వున్న వాటిని కోత కోసి పరిశీలిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలలో కూడా లక్షకు పైనే బిల్లులు పడ్డాయి. అయితే ఐసొలేషన్, సిబ్బందికి భద్రత వంటి విషయాలలో సమస్యలు ఎదురైనాయి. తమకు ఇబ్బంది అని కూడా కొన్ని ఆస్పత్రులు చెప్పాయి. తెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్ వైద్యశాలల పరీక్షలు, చికిత్సలు అవసరం లేదనీ ప్రైవేటు మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులను వాడుకుంటా మని చెప్పగా ఎ.పి ప్రభుత్వం అన్ని ప్రైవేటు వైద్యశాలలు తమ పరిధి లోకి తీసుకుంటున్నట్టు ప్రకటించింది. జిల్లాలలో కలెక్టర్ల జోక్యం, పద్ధతులు రకరకాలుగా వున్నాయి. పరీక్షలు, చికిత్స, సహాయం అన్ని విషయాల్లోనూ కేరళ అనుభవమే లక్షణంగా నిలిచింది. కరోనా పరీక్షల పెంపుదల కోసం ఇప్పుడు చర్యలు తీసుకోవడం మంచిదే అయినా అప్రమత్తత అవసరం. మిగిలిన అనేక సూచనలతో పాటు దారి తప్పిన మన ఆరోగ్య రంగాన్ని మళ్లీ పట్టాలు ఎక్కించకపోతే ఈ పేద దేశానికి ఎప్పుడైనా ప్రమాదం తప్పదు. ◆

# దేవుడా..! నన్ను నేను తెలుసుకున్నాను..! నీకు శలవ్

- డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

మనిషికి చాలా కాలానికి భయం కలిగింది
పంచేంద్రియోన్మాదం మనిషి కనులు కప్పింది
సామ్రాజ్యవాద భావన పాలకులకు అహం తెచ్చింది
మనుష్యులందరూ ప్రకృతి జీవులే
పంచభూతాలను ధ్వంసించుకున్నారు
నీటిని కలుషితం చేశారు, వాయువును కల్మషం చేశారు
చివరకు వెలుగును కూడా చిదిమే ప్రయత్నం చేశారు
నేలను రోగగ్రస్తం చేశారు
క్రిమిసంహారక మందులతో భూసారాన్ని దెబ్బతీశారు
అయ్యో! వెంకన్న దర్శనం ఆగిపోయిందా!
మీ ఆగమ సూత్రాలన్నీ ఏమైనాయి
స్వామి పవళింపు సేవలు,
లడ్డూ పంపకం, కోనేటి మునకలు,
పొల్లు దండాలు ఏమయ్యాయి స్వామీ!
మానవులు వినోద ప్రియులు
మీ దగ్గర వినోదం వుంది
ఆహార ప్రియులకు
మీరు లడ్డూలు పెడుతున్నారు
స్వామీ! వీరికి శాస్త్రజ్ఞానం అవసరం
అది లేకుండాపోయింది.
ఎలా కలుగచేయాలో మీరే సెలవియ్యాలి స్వామీ!
మీ దర్శనం ఆపాక ఎవరిళ్ళల్లో వాళ్ళు గడుపుతున్నారు
అన్ని దేవాలయాల్లో దేవుళ్ళను చూడటం ఆపారు
తమ కుటుంబాన్ని కంటారా చూసుకున్నారు
నోటారా మాట్లాడుకుంటున్నారు
మనుషులంతా దేవాలయాలకు, చర్చిలకు,
మసీదులకు అలవాటు పడ్డారు
దైవ సంబంధాలు పెరిగి
మానవ సంబంధాలు తగ్గిపోయాయి
ఇప్పుడు కరోనా వైరస్ వచ్చింది
అది పెద్ద ఉప్పెనలా వచ్చింది
ఏ దేవుడు మానవ ప్రాణాన్ని రక్షించలేకపోతున్నాడు
ఎందుకు స్వామి?
దేవుడిని మానవుడు సృష్టించాడు
దేవుడికి మానవుడు అధీనుడయ్యాడు
తనకున్నదంతా సమర్పించుకున్నాడు
చివరికి బుద్ధిని కూడా దేవుడికిచ్చేశాడు
దీనితో వైరస్‌కి మూలం అర్థం కాలేదు
అందుకే, ఒకసారి దేవాలయాలన్నీ
మూసి ఆలోచిస్తున్నాడు
మనిషి పుట్టుక, మరణాలకు
మూలాలు ఎక్కడున్నాయి?
అని వెతకటం ప్రారంభించాడు
'ప్రకృతిలో వున్నాయని' అర్థం అవుతుంది
ప్రకృతి నుండి జనించి ప్రకృతిని
ధ్వంసం చేశాడు కదా!
మరి ప్రకృతిలో ఇతడూ భాగమే కదా!
మరి! ఏమి చెయ్యాలి
'మానవుడు శాస్త్రజ్ఞానాన్ని పెంచుకోవాలి'
అని తెలిసింది
'దైవజ్ఞానం అబద్ధం అని రుజువు అయ్యింది' స్వామీ!
మీ దర్శనాన్ని ఆపటం వల్ల లాభమే గాని
నష్టం జరగలేదు
ఇక చర్చిలు మూఢవిశ్వాసాల ఊబిలో
కూరుకుపోయాయి
'కూడిక' ప్రమాదం, ప్రార్థన వ్యర్థం
అని తేలిపోయింది
ఇక మానవుడు శాస్త్రం వైపు చూడాలి కదా!
తాను జీవించాలంటే తన శ్వాసలో స్వచ్ఛత,
తన శరీర శక్తిలో బలం ఉండాలి
ఒక వేప, ఒక ఉసిరి, ఒక దానిమ్మ
ఈ దేవుళ్ళ కంటే గొప్పవని తేలింది
పాలు, తేనె, ఉలవలు, పెసలు శరీరానికి
శక్తిని ఇస్తాయి
దేవుడా! నిన్ను ఇక నేను వదిలిపెడుతున్నాను
నన్ను నేను ప్రేమిస్తున్నాను
నా ఇల్లే నాకు వైజ్ఞానికశాల
నా మేధస్సు నాకు శక్తి
ప్రకృతిలో భాగం అవుతున్నా..!
నాకు విజయం తథ్యం..! ♦

## నీ చైతన్యమే నీకు పెద్దదిక్కు!

- శాంతినారాయణ
8074974547

మన కంటికి కనిపించని
సూక్ష్మాతి సూక్ష్మజీవే కావొచ్చుగానీ
మానవ విజ్ఞానశాస్త్ర దృష్టికి
దాని రూపమూ కదలికా విస్తృతీ తెలియనివేమీ కాదు
ఇప్పుడు దాని క్రూర విధ్వంస విలయతాండవాన్ని
మానవాళి సంఘటిత ప్రయత్నం నిలువరించనూవచ్చు
రేపు దాని అదృశ్య వికృత సూక్ష్మశక్తి స్వరూపాన్ని
మానవుల వైద్యశాస్త్ర విజ్ఞానశక్తి నిర్మూలించనూ వచ్చు.
మన సమైక్య సంక్షేమ ప్రయత్నాలు
వొక స్ఫూర్తి కావొచ్చు.
మన శాస్త్రవేత్తల వైద్యవిజ్ఞాన ఫలితాలకు –
రేపటి రాజ్యాధినేతలందించే ఆర్థికశక్తులు
వొక ప్రేరకమవ్వొచ్చు.
ఏమయినా ఈ 'కరోనా' విపత్తును
అడ్డుకోవడానికీ అంతమొందించడానికీ
నేడు, మనందరి శక్తియుక్తులూ
రేపు మన మేధావుల వైద్యశాస్త్ర ప్రయోగఫలితాలే ముఖ్యం
కానీ
ఇతరేతర మార్గాలేవీ ప్రత్యామ్నాయం కాదు
సోదర మానవుడా! ఆలోచనాపరుడా!! అనంత
జ్ఞానశక్తియుతుడా!
కర్తవ్యం మానుకొని భయాందోళన చెందొద్దు
మనం ఆపదను చూసి పారిపోయే జంతువులం కాదు
ఎన్నో ప్రకృతి వైపరీత్యాలను అధిగమించొచ్చిన
బుద్ధిజీవులం!
ఇదేమీ భూగోళాన్ని బద్దలు చేసే భూప్రకంపనశక్తీ కాదు,
విశ్వాంతరాళంలో గ్రహాలను కనుమరుగు చేసే ఖగోళ
విన్యాసమూ కాదు,
బుద్ధిజీవుల అలసత్వ స్థితిలో
'ఇది' విరుచుకుపడుతోంది గానీ
మనిషి విజ్ఞానకాంతుల ముందు
ఈ అజ్ఞాని 'కరోనా' కుప్పిగంతులెంతటివి
కళ్లు తెరచి చైతన్యమూర్తివై జాగ్రత్తపడు
ప్రస్తుతం నీ జాగరూకతే ఈ మహమ్మారికి తగిన మందు
దీని అదృశ్యశక్తికి భయపడి
ప్రపంచదేవుళ్ళందరూ అదృశ్యమయిపోయారేమో,
పూజార్లందరూ దేవలాల తలుపుల్ని గట్టిగా మూసేశారు
ఇప్పుడు నీ చైతన్యప్రయత్నమే నీకు పెద్దదిక్కు.
ఇప్పుడూ ఎప్పుడూ నిన్ను ఆదుకునేది
నీ ధైర్యసాహస యత్నమూ
నీ విజ్ఞానశక్తి సాధకాలేనని గుర్తుంచుకో!! ♦

---

## మహమ్మారి !

- భైరవ స్వర్ణకుమార్
8374034514

నా నిర్లక్ష్యం నిన్ను ఆకట్టుకొనుండొచ్చు
నా మూర్ఖత్వం నీకు ముచ్చట గొలిపుండొచ్చు
నా అజ్ఞానం నీకు ఆహ్వానం పలికుండొచ్చు
అంత మాత్రం చేత
కులం చూడకుండా
మతం అడగకుండా
ప్రాంతం ఎరగకుండా
భాష పట్టింపు లేకుండా
రాజుని భయపడలేదు
పేదని విడిచి పెట్టలేదు
ఎక్కడి నుండో దూసుకొచ్చావు
మాకు ఏదో నేర్పాలని
ఆరాటపడుతున్నావు
అందరినీ ఒకేలా చూస్తున్నావు
మమ్మల్ని అలాగే చూడమంటున్నావు
రక్షణ క్రమశిక్షణ
నేర్పుతున్నావు
మానవత్వం సమానత్వం
గుర్తుజేస్తున్నావు
ఒకరి కోసం ఒకరు బతకమంటున్నావు
పరోపకారాన్ని తట్టి లేపుతున్నావు
నమ్ముకున్న వాడు పలకనపుడు
దేశమంతా మూతపడుతున్నప్పుడు
ఇంటిలోపల జనం దాక్కొనప్పుడు
మాకోసం నిరంతరం శ్రమిస్తున్న
వారికి
జీవితాంతం రుణపడి
ఉండమంటున్నావు
ఇంత చెబుతున్నా ఇన్ని నేర్పిస్తున్నా
నిన్ను హర్షించలేను ..
నిన్ను హత్తుకొలేను ..
ఎందుకంటే
నువ్విపుడు ఒక మహమ్మారివి ! ♦

## మనుగడ

- డా॥ పి. విజయలక్ష్మి పండిట్
8639061472

ఏ మూలనుంచి పుట్టుకొచ్చిందో
కరోన వైరస్ విషప్రభంజనం..,
మనుషుల శరీరాలే దాని ఇల్లు
మనిషి ఊపిరిని ఆపి చంపే
కంటికి కానరాని అసూక్ష్మజీవి..,
నిశ్శబ్ద యుద్ధాన్ని ప్రకటించింది,
దాని ఒంటినిండా పొడుచుకొచ్చిన
కత్తులలాంటి ఆయుధాలతో
ప్రజలఊపిరి వంతెనపై ప్రయాణించి
ఊపిరితిత్తులను గాయాలపాలుచేసి ,
మనిషికి మనిషిని దూరం చేసింది..,
దేశాలను ఒక్క కుదుపు కుదిపి
కదిలించి కనువిప్పు కలిగించింది,
ప్రజలను గృహబందీలను చేసి
కూర్చుండబెట్టింది కుటుంబాలను,
మరుగైపోతున్న ప్రజల మనసుల్లో
మమతను మానవత్వాన్ని తట్టి లేపి
అత్యాసల అగాధాల వలలోచిక్కుకున్న
వసుధను ఒకే కుటుంబంగా నిలిపింది ,
మందుల మాకుల పరస్పర వినిమయాలు
మంచిచెడ్డల పలరింపులు పరామర్శలు,
కరోనా జాగ్రత్తల సందేశాల వెల్లువలు
"సర్వేజన సుఖినో భవంతు"ప్రార్థనలు!
స్తంభించిన మానవజాతి మనుగడను
అంతర్జాలమే బ్రతికిస్తూంది,
ప్రపంచ దేశాల అన్ని రంగాల
స్థితిగతులను నడుపుతూంది.!
వైరస్ బాధిత ఆత్మీయుల కన్నీటిని
మనిషి మనసుల్లోని గుబులును
ఫేస్టైమ్ ఊరట పలకరింపులను
అంతర్జాలమే మోసుకెళుతూంది..,
ఇంటివద్దకే పాల, పండ్ల,సరుకుల,
పాఠాల,డాక్టర్ సలహాల మందుల
సరఫరాలు సహాయ సహకారాలు..,
కాని....రెక్కాడితేకాని డొక్కాడని
బీదప్రజల జీవితం మాత్రం నరకం?!! ♦

## మహా హెచ్చరిక

- వొరప్రసాద్

కర్కశ కరోనా
భూమిని ఆక్టోపస్‌లా చుట్టుముట్టింది
ప్రపంచపటం నిండా విషాద మరణదృశ్యాలు
దినపత్రికల్లోని అక్షరాలన్నీ
వరుసగా పేర్చిన శవపేటికల్లా కనపడుతున్నాయి
మానవ నేత్రాల నిండా
కరోనా లిఖించిన మరణచిత్రాలే!
ప్రకృతి చేసిన మహా హెచ్చరిక కరోనా!
దేశాల సరిహద్దులు దాటి
దాడి చేస్తున్న కరోనా కట్టడికి
దూరం పాటించడమే తిరుగులేని ఔషధం
దిగ్బంధనం శాశ్వతం కాదు
కరోనాని అష్టదిగ్బంధనం చేయడానికి
పన్నిన మానవవ్యూహం!
ఇప్పుడిక సమయం లేదు
ప్రకృతిని వికృతిగా మార్చే ప్రతీ చర్యా
మానవ నాశనానికే అనే సంగతి
వేల వేల మరణాల సాక్షిగా కరోనా చాటిచెప్పింది
మానవ చర్యల కొక మార్గదర్శనం కావాలి!
చేతులు శుభ్రం చేసుకుంటూనే
కాస్తంత మనసును కూడా శుభ్రం చేసుకుందాం
కాలపు వైపరీత్యం మనిషికి కొత్తేమీ కాదు
కరోనాను మించిన కల్లోలాలను అధిగమించి
నడిచి వచ్చిన మానవుడు సామాన్యుడేం కాదు
ఖండఖండాంతరాలను కలిపిన మనిషికి
కరోనాను ఖండించడం కూడా తెలుసు
విశ్వయానం చేసి వస్తున్న మనిషికి
కరోనాకు ఎదురెళ్ళి ఢీకొనడం కూడా తెలుసు
ఎదురయ్యే ఏ విపత్తునైనా ఎదిరించి
ముందుకు సాగిన మానవచరిత్ర
గతమంతా పరుచుకుని కనపడుతూనే ఉంది
విలయాల వికటాట్టహాసాల మధ్యనే
మానవత్వం పరిమళమై భూమినంతా శుభ్రం చేస్తుంది
మానవ జ్ఞానం కరోనాలను
మటుమాయం చేసే అమృతాన్ని కనిపెడుతుంది
కరోనాలకు ఆస్కారం లేని భూప్రపంచం సాకారం
అవుతుంది
నేలతల్లి గుండెలపై మనం నిశ్చింతగా నిద్రపోతాం
సరిహద్దులు లేని ప్రపంచం
అద్భుతమానవులను సృష్టిస్తుంది
వసుధైక కుటుంబం వాస్తవమై తీరుతుంది
కల్లోల కరోనాలకు చరమగీతం పాడుతుంది!! ♦

## కరోనా నృత్యం

- సునీత ఆరిమిల్లి
9490643391

కన్నబిడ్డను కూడా
కౌగిలించుకోలేని
కాలమొచ్చింది కదా!
కరచాలనాలు లేవు!
అలాయి బలాయిలు లేవు!
చంద్రుడిని మేఘాలు
కమ్మినట్టుగా
చిరునవ్వులను మాస్కులు
వెక్కిరిస్తున్నాయి
స్వీయనిర్బంధంలో
ప్రపంచ ప్రజానీకం
ఇప్పుడంతా కరోనా
కరాళనృత్యం!
కళ్ళు తెరిస్తే మరణదృశ్యాలు
చెవులు సారిస్తే మరణశబ్దాలు
జాతి, మత, ప్రాంత హద్దుల్ని
చెరిపేస్తూ
కరోనా మహమ్మారిలా
చుట్టుముట్టింది
వైద్యులే ఇప్పుడు దేవుళ్ళు
నర్సులే ఇప్పుడు దేవదూతలు
నిర్బంధాన్ని అతిక్రమించకుండా
నిఘావేసే పోలీసులే ఆపద్బాంధవులు
పరిసరాల్ని పరిశుభ్రం చేసే కార్మికులే
మనల్ని కాపాడే సైనికులు
కరోనా పంజాకు స్తంభించిన
వర్తమాన ప్రపంచం
ఇంటిని ఇరవైనాలుగ్గంటలూ
కాపలాకాస్తుంది
పనికి వెళ్ళలేక కాలయాపన చేయలేక
మర్చిపోయిన మానవవిలువలనేవో
గుర్తుతెచ్చుకుంటోంది!
ప్రకృతిని శాంతింపజేసే పరికరాలేవో
కావాలిప్పుడు
తాత్కాలిక కరోనాలు మనుషుల్ని
హెచ్చరిస్తుంటాయి
చుట్టూ ఉన్న ప్రకృతికి కూడా
మన గుండెల్లో కాస్తంత చోటునిద్దాం
ప్రకృతి అందించిన పాఠాలే
మానవ భవిష్యత్తుకు దిక్సూచి
కల్మషాలు, కాఠిన్యాలు లేని
మానవ ప్రపంచం నిర్మాణం కావాలి
అవధులు లేని అనుబంధాల వారధి
అవని మొత్తం విస్తరించాలి
కరోనాలు లేని కాలాన్ని కనిపెట్టి
నిశ్చింతగా నిద్రపోవాలి
ఒక అస్తమయం
సరికొత్త ఉషోదయంగా మారాల్సిందే
సమైక్యతా గానమే ఇప్పటి అవసరం
సమిష్టి విజ్ఞానమే మన అసలైన ఆయుధం ♦

---

## పున్నమి నానీలు

- పున్నమి వెంకటయ్య
9581235315

కరోనా
మనిషిని బంధించానని
నవ్వినా
రేపటి సూర్యోదయం మాదేగా

దాహం తీరని
కరోనా
తృప్తి జెందక
తన గొప్పి తానే తవ్వుకుంటుంది

కరోనా
తనదే గెలుపనుకున్నా
శవాల పై
పట్టాభిషేకం నిలవదు

కరోనా
మనల్ని మాయ జేసి
ఆడుతుంది
పులిపై సవారి మాకేం కొత్తనా

కరోనా
మాపై కక్షగట్టావు
కానీ గృహామే
స్వర్గ సీమయింది జూడు

కరోనా
ప్రపంచదేశాలకు నేర్పిన
గుణపాఠం
శుభ్రత భౌతిక దూరం

కరోనా
కంటికి కనిపించదు
కానీ
మనిషిని మట్టి గరిపిస్తుంది

కరోనా
నీ దెబ్బకు
రహదారులన్ని
ప్రశాంతతతో నిద్రపోతున్నాయ్

కరోనా
నీ పుణ్యమే
దూరాలు దగ్గరై
సరిహద్దులు చెరిపేసుకున్నాయ్

కరోనా
నాకు టైం లే చాల బిజి
గిప్పుడు
మా డిక్షనరీలో లేని పదాలు ♦

## విలయంలో విషయం!

- నూనెల.శ్రీనివాసరావు
9492970231

విజయగర్వంతో విర్రవీగే
మనిషి నుదుటిపై
మృత్యురేఖ 'కరోనా'–

పచ్చని పుడమి ఆకృతి
చెరిపిన వికృత క్రీడపై
ప్రకృతి పగతో విసిరిన
పులి పంజా 'కరోనా' –

విశ్వ వాణిజ్య విపణిలో
మరచిన మానవతపై
ఎగసిన సునామి 'కరోనా'
మట్టిపేగు బంధాలకు
సమిష్ఠ జీవన సహరాగాలకు
తిలోదాకాలిచ్చి
వ్యక్తివాదంతో బలిసిన
ఒంటి కన్ను రాకాసులపై
పిడిబాకు 'కరోనా'

నింగి విరిగి నేలపై
పడనూ లేదు
చీకటి కోరలు చాచి
వెలుగులు మింగేయనూ లేదు
ఇంతై పుట్టి అంతై పెరిగి
ప్రపంచాన్ని
అతలాకుతలం
చేసిన మహమ్మారి
'కరోనా'
మానవాళికి గుణపాఠమే !

ప్రకృతిలో మనం
ప్రకృతితో మనం
సమస్త జీవరాశుల వెంట
చెట్టూపుట్టల సందిట
సకృత సమైక్య గీతికలా
పెనవేసుకుంటేనే
భువి స్వర్గమౌను
లేకుంటే
ప్రకృతి అసమతుల్యతతో
మనిషి అంతరించు
కాలగతిలో
కరోనా విలయంలో
విషయమిదే
విషమించక ముందే
మేలుకొలిపే
ప్రమాదఘంటికలివే ! ♦

---

## కొత్తేం కాదు

- కోడే యామినీ దేవి
9492806520

అవును కొత్తేం కాదు ఈ రోజేం కొత్తగానూ లేదు
ఇంటి గోడలమధ్య వంటింట్లో ఏనాడో బందీనయ్యాక
ఏ లాక్ డౌన్ అయినా నన్నేంచేస్తుంది..
తూర్పున ఉదయించే సూర్యుడూ నేనూ రెండు ఒకటే,
ఆయన టంచనుగా వెలుగులు పంచాలి
నేను అందరికీ అన్నీ అందించాలి
ఇందులో ఏ మార్పు ఉండదు
ఆయనకు కారుమేఘాలు కమ్మితేనో
నాకు అనారోగ్యం వస్తేనో కాసేపలా ఆదమరుస్తామంతే...
ఉరుకుల పరుగుల జీవితాల్లో
మనుషుల మధ్యన బంధాల బలం తగ్గిపోతున్నవేళ
కరడు కట్టిన కరోనా కాస్త జాగ్రత్తలు నేర్పుతూ
అందరినీ ఇంట్లో చేర్చింది
ఎవరి పనుల్లో వాళ్ళు యంత్రాల్లా పక్క పక్కనే ఉన్నా
మనసు విప్పి మాట్లాడుకున్న రోజులేవి
అందరం ఒకే కప్పుకింద చేరినా
ఎవరి ఫోన్లో వారు మునిగుంటే..
నాకు మాత్రం అన్నిరోజులూ ఒకటే
నావన్నీ చిన్న చిన్న ఆనందాలు
ఆకు ఊగితేనో కొమ్మ కదిలితేనో కోయిల పాడితేనో
అవే సంతోషాలు... ఇక నాకు నేనున్నానా
అని అనుకుంటానలా...
ఏదైనా మంచికనుకోవాలనే నా నైజం
ఎప్పుడూ బయటపనుల్లో తిరిగి అలసి సొలసి
ఇంటికి తిరిగొచ్చే నా భర్తా పిల్లలూ
ఇప్పుడు నిత్యమూ నాతోనే ఉన్నారు...
రోజూ కంటే పనివత్తిడి ఇప్పుడు అధికమైనా
ఆ మొబైల్లో టీవీల్లో మొహంమొత్తి కాసేపో కూసేపో
నన్ను తొంగిచూస్తున్నారు
నాతోనూ మనసు పంచుకుంటున్నారు
అన్నిటికీ పరిష్కారం వెతికే మనుషులం కాస్త ఆదమరచి
పర్యావరణానికి మసిపూసాం అమావాస్య నిశిని రాశాం..
ఇప్పుడైనా మేల్కొని గుణపాఠం నేర్చుకుని
మనసుల్ని స్వచ్ఛపరుచుకుని కాలుష్యాన్ని కడిగితే
తరాలన్నీ తెరిపిన పడవచ్చు..
లాక్డౌన్ లాక్ చేసిందని విలపించే అందరూ
విరిగిన బంధాలకు అతుకులు వేసుకోండి
ఇప్పుడైనా మరచిన మమకారాలకు
ప్రేమానురాగాలను అద్దండి
మూసిన నాలుగ్గోడల మధ్యనా
గుండె గది తలుపులు తెరవండి
ఆపై అందరి మాటొకటవుతుంది
కరోనా జాడే వుండదు...! ♦

## మధ్యతరగతి మీసం

- అమూల్యాచందు
9059824800

ఉగాదులెన్నో
వస్తున్నాయ్,
పోతున్నాయ్...
కన్నీటిని తుడిచే
ఒక్క వెలుగూ లేదూ...
పండగ రాకను
స్వాగతించే
అరచేయంత
అరిసెలేసే
అమ్మమ్మలు లేరు...
బూరెలేసే
నానమ్మల
రాకపోకలు లేవు...
ఉగాది పచ్చడి
చేసే ఉమ్మడి
కుటుంబాల్లేవు...
రాత్రిని పగలు
అప్పు తీసుకుంది
పగటిని
రాత్రి కొనేసుకుంది...

ప్రేమాప్యాయతలన్నీ
లాప్‌టాప్‌లు, ఆన్‌లైన్,
ఇంటర్‌నెట్ వర్కుల
తాకట్టులో ఉన్నాయ్...
హడావుడి, బిజీబిజీ,
నో టైమ్, నో స్పేస్...
భాష వేర్లూ, పేర్లే
వేరు...
ఎవరికి వారు
ప్రతీ రోజూ
వెతుక్కోవాల్సిందే...
వైఫై వీధుల్లో,
స్కైపీ సందుల్లో
గూగుల్ వీధుల్లో
పండుగల్ని
ఆహ్వానిస్తున్నాయ్...
వీడియోల్లోనే
పండుగ ముచ్చట్ల
అప్‌లోడ్లు,
డౌన్‌లోడ్లు,
లైకులు, షేర్లు..
మస్తీమస్తీ
కామెంట్లతో
కరచాలనాలు
చూడ్డానికి
నాలుగు
గోడల ఇళ్లైతే
ఉన్నాయ్...
లోపలంతా
చీకటే...
చెప్పలేని
ఒంటరితనమే..
నిశ్శబ్దపు
యుద్ధం
విడుస్తున్న
బుసలు
స్పష్టంగా
వినిపిస్తున్నాయ్...
ఆ పాత రోజుల్ని
ఏలిన పండగలు,
ఆ ఉషసులన్నీ
అమావాస్య
చీకట్లలో
కలిసిపోయాయ్..
కొత్తొక వింత
రోజుల్లో
పండగలన్నీ
పరామర్శలయ్యాయ్...
సరదాలన్నీ
ఎప్పుడో
వచ్చి వెళ్లే
చుట్టాల్లా ఉన్నాయ్...
స్వచ్ఛమైన
మనస్సుల్లేక
స్వేచ్ఛ పరీక్ష
తప్పిన పసిపాప
ముఖంలా ఉంది..
పండగ లేదు...
సరదా సందడీ
లేదు...
చావు తప్పి కన్ను
లొట్టబోయిన
జీవితాలే అన్నీ...
వడపోత జీతాల
జీవితాలన్నీ గుమ్మం
ముందర
ఎలాంటి హంగు,
రంగుల్లేని
ఒక చిన్న
తెల్ల ముగ్గే....
కన్నీరంతా
ఉప్పనైనట్టు...

ఇప్పుడు
ఇళ్లన్నీ కరోనా
గాలికి
కకావికలమవుతున్నాయి...
నిశ్శబ్ద యుద్ధంలో
ఎన్నో ప్రాణాలు
గాల్లో దీపాల్లా
వేల్లాడుతున్నాయ్...
ఉగాది పచ్చడంతా
చేదుగా...
కోయిల రాగం
మోటుగా ఉంది....
రుచీ పచీ లేని
కూరల సంచి..
గలగలమని
మోగని జేబుతో...
మధ్యతరగతి
పండగలన్నీ
చప్పుగానే
ముగుస్తున్నాయి.... ♦

## విజేత

- ములుగు లక్ష్మీ మైథిలి
944008482

ఓ మనిషి
ఆది నుంచి... ఆధునిక దశవరకు
వేనవేల వత్సరాలు ప్రయాణించి
ఒంటరిగా పోరాటం మొదలుపెట్టి
సమూహంలో ఒకడివై నిలిచావు
ఆకాశానికి నిచ్చెన వేసి
చంద్రునిపై కాలుమోపావు
పాతాళంలోకి చొరబడి
భూగర్భ నిధులను వెలికి తీసావు
సంద్రాలు శోధించావు
సమస్త వస్తుసంపత్తిని
రిమోట్ కు అనుసంధానించావు
వైద్య.. శాస్త్ర రంగాల్లో
సాంకేతిక పరిజ్ఞానం సాధించావు
ఎన్నో యుద్ధాలు జయించావు
మరెన్నో ప్రకృతి విలయాలను
ఎదుర్కొన్నావు..
మశూచి,కలరా, ప్లేగు
రోగాలను నిర్మూలించావు
పంచభూతాలను
ఆధీనంలో తెచ్చుకున్న మేధావివి
కంటికి కనపించే శత్రువైతే
"అణు" సంధించేవాడివి
ప్రతి అనుభవము ఒక పాఠమే
నీ లక్ష్మణరేఖ కవచంతో
స్వీయ రక్షణ వలయంలో నిలిచి
పరిశుభ్రత ఆయుధంతో
సమరం సాగించు

నీవు విధించిన "లాక్ డౌన్"
కరోనా రక్కసికి "లాకప్ డెత్" కావాలి
ఒడిదుడుకులను తట్టుకొని నిలబడితే
విజయం నీ పాదాక్రాంతం అవుతుంది ♦

# గూడు చేరాలి

- శాంతిశ్రీ
8333818985

పక్షులన్నీ దూరం పాటిస్తూ
ఆశగా రెక్కలు విప్పార్చుకుని ఎగురుతున్నాయి.
కళ్ళల్లో కడసారి ఆశల్ని ఆవిరికాకుండా
ఉగ్గపెట్టుకుని వలస బతుకును కూడదీసుకుని
రాళ్ళల్లో, తుప్పల్లో, మైలురాళ్ళను, నాగరికతలను
పాదాలు మాట్లాడుతున్నాయి..
వెక్కిరింపులను.. ధిక్కరింపులను.. భరిస్తూ
రోదిస్తూ.. రక్తమోడుస్తూ.. తమను తాము ఓదార్చుకుంటూ
కాళ్లన్నీ గూడు చేరాలి.

♦

వాళ్లందరిదీ.. బతుకు పోరాటమే
పుట్టిన మట్టి వాసనలకోసమే పయనమంతా
పాదాలన్నీ పురుటిగడ్డపై మోపాలన్న తపనతో
కాళ్లన్నీ గూడు చేరాలి.

♦

చెప్పులు చేతపట్టిన బాటలు ఎరుకే..
స్పర్శకు నోచుకోని కథ ఇప్పటిదా..
ముంత–తాటాకు కట్టిన చేదు జ్ఞాపకాలకు కొదవలేదు
స్నానానికి సబ్బు నోచుకోని బతుకులకు
శానిటైజర్ అత్తర స్ప్రేలు కొట్టే కొత్తశుద్ధి
పాదాలన్నీ నొప్పులను సవరదీస్తూ చెపుతుంటే
కాళ్లన్నీ గూడు చేరాలి.

♦

ఇళ్ళల్లో కుక్కపిల్లల పిల్లిపిల్లల
ముద్దు మురిపాలంత మనసున్న మారాజులు
పట్టెడన్నం పెట్టాలన్నా.. మానవత్వమేమై పోయే
రాయి రాయి పేర్చిన భవంతుల్లో రాతి హృదయాలను
పాదాలన్నీ ఇళ్ళ ముందు వెళుతూ అనుకుంటూ
కాళ్లన్నీ గూడు చేరాలి.

♦

గూడు చేరితే ఏమవుతుంది?
సమాధానం లేని ప్రశ్నలు పాదంలో కసుక్కన
గుచ్చుకున్నాయి
ఆకలి పోరాటంలో నడక సాగేనా?
అర్థాంతరంగా దిక్కులేని చావు చస్తే..?
పాదాలన్నీ కన్నీళ్లు పెడుతున్నాయి..
అందరం ఒక్కలాగే.. ఆకలి తీరే సమాజానికి
మా పాదాలకు మార్గం చూపుతారా ఎవ్వరైనా?
కాళ్లన్నీ అడిగేది ఇప్పుడు ఒక్కటే ప్రశ్న.. ♦

---

# మనో ధైర్యం..

- చిట్టి మధు
9441418388

చిన్నపిల్లవాడు ఒక్కటిగ పేర్చిన
బిల్డింగ్ బ్లాక్ ముక్కల్లా ఖండాలన్నీ
ఒక్కటిగా చేరాయి..
నిశ్శబ్దపు గానంతో విమానాల
మోతలేని
నిర్మల ఆకాశంలా...
అమ్మ అరపుల్లేని ఇల్లలో
పిల్లలే మేఘాలై కదులుతున్నాయి..
చేమంతుల పూగుత్తుల్లా
కుటుంబం అంత చిరునవ్వులతో
విరబూస్తున్నాయి...
పెద్దపెట్టె అడుగున తొక్కేసిన
పాత జ్ఞాపకాల ఛాయాచిత్రాలన్ని
తెరపైకి వచ్చి చిందులు వేస్తున్నాయి..

ఏ మూలనొ దాగిన బంధాలన్నీ
మీటర్ దూరంలో వేదనగా నిరీక్షిస్తున్నాయి..
కదిలే కాల కడలిలో..
ఓడల హృదయకోతల
అజడుల పోరులేక
అలలు ప్రశాంతంగా కదులుతున్నాయి..
కరచాలనానికే ఎత్తే చేతులు
సేవచేస్తున్న పాదాలను కడిగే వరకు
దిగనంటున్నాయి..
ఏమి జరగుందో...
మరేమి జరగబోతుందో...
తెలియదు కానీ...ఒకటి నిజం

బంధాను బంధాలు..
ప్రేమానురాగాలు..
కుటుంబాల కౌగిళ్ళలో
కలసిపోయి..
మౌనంగా.. రోదిస్తున్నా
ధైర్యంగానే విపత్తుతో...
ఎదురుదాడి చేస్తున్నాయి..
ఎంతకాలమైన ఎంత దూరమైన..
మనోధైర్యపు రక్షణ కవచాలతో
యుద్ధానికి సిద్ధంగానే
వున్నాయి....?? ♦

## స్పందన

- గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

పొద్దుట్నుంచి
కూకోని పడుకొని
పట్టేసిన కాళ్ళు బాల్కనీ వైపు
వెళ్ళమని మొరాయించి
మారాం చేస్తున్నాయి !

రోజూ తిరిగితిరిగి
నాలుగు రాళ్ళు సంపాదించుకొచ్చే
కాళ్ళు బాల్కనీ ల్లేని తోటి జీవుల
గురించి ఆలోచిస్తున్నాయేమో !

రోజంతా అలసిసొలసి
మేను వాల్చటానికి
నాలుగు కోళ్ళున్న కుక్కిమంచాల్లేని
జీవుల బతుకుల గురించి
ఆలోచిస్తున్నాయేమో

ఉన్నొక్క గదింట్లో
వంట తిండి పక్క
వెళ్లదీసే కుటుంబాలు
గుర్తుకొచ్చాయేమో
అసలిండ్లే లేని వాళ్ళ కంట్లో దుఃఖం
తడిగా తగిలిందేమో

చేతులు కలవట్లేదు
చలనమూ ఉంది
రక్తప్రసరణమూ ఉంది
బలవంతంగా చేతులు కలిపినా
జోష్ లేక శబ్దం మూగబోతుంది

ఆకలికి చాచిన చేతులు
యాదికొస్తున్నాయేమో
అక్షరాలు దిద్దాల్సిన చేతులు

పనులల్లో
కాయలు కాయటం మనసుని
గాయపరిచాయేమో !

నాకేమో లోలోన వణుకు
బాల్కనీలో చప్పట్లు కొట్టనందుకు
దేశద్రోహి ముద్ర కాచుక్కూర్చుందేమోనని
కాళ్లూచేతులే కదనరంగంన దూకేవి
అందుకే అచితూచి స్పందిస్తున్నాయ్
మందులూ సరుకులూ
ఏలికలిస్తారేమోనని
పరిగెత్తడానికి తీసుకోవడానికి సిద్ధంగా
ఎన్నో కాళ్లూచేతులూ దేశం నిండా
అప్పుడు కొడతా చప్పట్లు మనసారా ♦

---

## నిర్బంధ యుద్ధం..

- కొలిపాక శ్రీనివాస్
9866514972

నాలుగు గోడల మధ్య
నిశ్శబ్ద స్వీయ నిర్బంధ యుద్ధం
ఇది మూడో ప్రపంచ యుద్ధం
ప్రపంచ ప్రజలంతా ఒక వైపు!
ఆయుధాలు.. సైన్యం లేని
కరోనా వైరస్ ఒక వైపు...!
మనకు మనమే
సంకెళ్లతో బందీ కావడమే
గెలుపుకు సంకేతం..!!
కలలో కూడా కలవర పెడుతున్న
కరోనా కట్టడికి అనునిత్యం
కష్ట పడుతూ..
మానవ సేవే మాధవ సేవై
నిమగ్నమవుతున్న
త్యాగ యోధులైన డాక్టర్లు
మేమున్నామని...?
జన సమూహా రక్షణకు
సఫాయి కార్మికుల
సంకల్ప బలం

ప్రజా సేవలో.... అహర్నిశలు
అడుగడుగునా రక్షణ వలయాలతో
భద్రమైన భరోసానిస్తున్న భటులు
గతితప్పిన ప్రజానికానికి
మినిట్ టు మినిట్ మీడియాను
ముందుంచుతున్న మీడియా మిత్రులు
ఎన్నో పోరాటాలకు ఎదురొడ్డి నిలిచిన
ఘన చరిత
ప్లేగు వ్యాధితో పోరాడి ప్రాణాలను సైతం
పణంగా పెట్టి గెలిచిన వీరత్వం
కలరా కు కన్నీరు కార్చి.. ఎదిరించిన
గుండెల తెగువ
ఇలా... ఎన్ని చూడలేదు మనం !
ఇప్పుడీ...
కబళిస్తూ.. వణికిస్తున్న
కరోనా వైరస్ మనకో లెక్క..?

కలిసికట్టుగా ' మన' కోసం మనం!
యుద్ధం చేద్దాం.!
కదనశంఖం మ్రోగిద్దాం
నాలుగు గోడల మధ్య..!!
నీకై నీవు..!
మనకై మనం..!
కరోనా మహమ్మారి పై
నిర్బంధ యుద్ధం చేద్దాం..!
సమస్తం సర్వనాశనం చేస్తున్న
వైరస్ ను తరిమి కొట్టేందుకు..
కలిసికట్టుగా కదలండి ముందు!
నీ.. నా.. మన..
అనే స్వార్థంతో కాక!
అందరినీ బ్రతికిద్దాం..!
అందులో మనం బ్రతుకుద్దాం..
పదికాలాలపాటు..!! ♦

## బాటసారి

- శ్రీశ్రీ



కూటికోసం, కూలికోసం
పట్టణంలో బ్రతుకుదామని –


తల్లిమాటలు చెవిని పెట్టక
బయలుదేరిన బాటసారికి,
మూడురోజులు ఒక్క తీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక –

నడి సముద్రపు నావ రీతిగ
సంచరిస్తూ, సంచలిస్తూ,
దిగులు పడుతూ, దీనుడౌతూ
తిరుగుతుంటే –

చండ చండం, తీవ్ర తీవ్రం
జ్వరం కాస్తే,
భయం వేస్తే,
ప్రలాపిస్తే –

మబ్బుపట్టీ, గాలికొట్టీ,
వానవస్తే, వరదవస్తే,
చిమ్మచీకటి క్రమ్ముకొస్తే
దారి తప్పిన బాటసారికి
ఎంతకష్టం:

కళ్ళు వాకిట నిలిపిచూచే
పల్లెటూళ్ళో తల్లి ఏమని
పలవరిస్తోందో...?
చింతనిప్పులలాగు కన్నుల
చెరిగిపోసే మంటలెత్తగ,
గుండుసూదులు గ్రుచ్చినట్లే
శిరోవేదన అతిశయించగ,
రాత్రి, నల్లని రాతి పోలిక
గుండె మీదనె కూరుచుండగ,



తల్లిపిల్చే కల్లదృశ్యం
కళ్ళ ముందుట గంతులేయగ
చెవులుసోకని పిలుపులేవో
తలచుకుంటూ, కలతకంటూ –

తల్లడిల్లే
కెళ్ళగిళ్ళే
పల్లటిల్లే బాటసారికి
ఎంత కష్టం:

అతని బ్రతుకున కదే ఆఖరు:
గ్రుడ్డి చీకటిలోను గూబలు
ఘూకరించాయి:
వానవెలసీ మబ్బులో ఒక
మెరుపు మెరిసింది:
వేగు జామును తెలియజేస్తూ
కోడి కూసింది:
విడిన మబ్బుల నడుమనుండీ
వేగుజుక్కా వెక్కిరించింది:
బాటసారి కళేబరంతో
శీతవాయువు ఆడుకుంటోంది:
పల్లెటూళ్ళో తల్లి కేదో
పాడుకలలో పేగు కదిలింది:

**(18-5-1934)**

***(ఏప్రిల్ 30 శ్రీశ్రీ 110వ జయంతి)***

# స్వీకారం



## పగిలిన పాదాల నెత్తురులో


**కేశవ్**

వెల : 200/- పేజీలు: 216

ప్రతులకు : 8961626848

**ఒ**క సమకాలీన సమాజాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి ఆకళింపు చేసుకునే ప్రయత్నంలో భాగంగా చదువరులకు విభిన్న సామాజి కాంశాలకు సంబంధించిన జ్ఞానాన్ని ఈ గ్రంథం కలిగిస్తుంది. ఈ పుస్తక వ్యాసాల రచయిత కేశవ్ గారు రాసిన ప్రతీ వ్యాసం ఎన్నో విషయాలను అధ్యయనం చేసి రాసినట్టుగా పాఠకునికి అవగతం అవుతుంది.

**- కట్టగాని రవీందర్**



**జాతీయ స్ఫూర్తి మాసపత్రిక**

## ఫ్రెడరిక్ ఎంగెల్స్


**ద్విశత జయంతి ప్రత్యేక సంచిక**

వెల : 50/- పేజీలు: 112

ప్రతులకు: 9397114495

**మా**ర్క్స్-ఎంగెల్స్‌లు అపురూపమైన జంట. మార్క్స్‌కి ఎంగెల్స్ నీడ కాదు. సహచరుడు, స్వయంప్రకాశం కలవాడు. ఈ ఇద్దరు హేమాహేమీల కలయిక వల్లనే మార్క్సిజం ఒక పరిపూర్ణ సిద్ధాంతంగా వెలుగు చూసింది. ఎంగెల్స్ ద్విశత జయంతి సంవత్సరంలో శాస్త్రీయ సోషలిజంపై అధ్యయనం చేసేవారికి, ప్రచారం సాగించేవారందరికీ ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం.

**- సంపాదకవర్గం**



## శారద సాహిత్యం

**కథలు - గల్పికలు - లేఖలు**

**సంపాదకులు: వల్లూరు శివప్రసాద్**

**కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ**

వెల : 225/- పేజీలు: 400

ప్రతులకు: 9291530714

**శా**రద కథలు సమాజంలోని విభిన్న వర్గాల ప్రజల ఆలోచనలకు, ప్రలోభాలకు, ప్రవర్తనకు, బలహీనతలకు దర్పణాలుగా నిలుస్తాయి. జీవిత వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. తనవైన, ఆకాంక్షలను, ఆదర్శాలను వెల్లడించడానికి కొన్ని కథలకు ఫాంటసీ జోడించి శిల్పవైవిధ్యాన్ని ప్రదర్శించాడు. శాంతికాముకుడుగా, ప్రకృతి ఆరాధకుడిగా, మానవతామూర్తిగా కనిపిస్తాడు.

**- వల్లూరి శివప్రసాద్**



## ఈస్తటిక్ స్పేస్ కథలు

**దగ్గుమాటి పద్మాకర్**

వెల :200/- పేజీలు: 160

ప్రతులకు: 9989265444

**జీ**వితాన్ని పైపైన కాకుండా, లోతుగా అనుభవంలోకి తెచ్చుకుని, ఆ అనుభవాల్ని ధ్యానించి వాటిమీంచి తనదే ఐన ఒక ప్రాపంచిక దృక్పథాన్ని ఏర్పరుచుకునే కథకుడు మాత్రమే ఇంత నిదానంగానూ, ఇంత మితంగానూ రాయగలుగుతాడు. ఇటువంటి కథకుడు చెప్పే ప్రతీ ఒక్క కథా ఎంతో భావగర్భితంగానూ, మరెంతో విలువైందిగానూ ఉండటంలో ఆశ్చర్యం లేదు.

**- వాడ్రేవు చినవీరభద్రుడు**




## కెవిఆర్ స్మృతిలో

**వ్యాస సంకలనం**

వెల :100/- పేజీలు: 106

ప్రతులకు: 9849083137

**తె**లుగు సాహిత్యరంగంలో మార్క్సిస్టు విమర్శకులుగా, కవిగా కె.వి.ఆర్. ప్రసిద్ధులు. కేవలం రచయితగానే కాక విరసం కార్యదర్శిగా ప్రముఖ పాత్ర వహించారు. నిబద్ధ రచయితగా, కెవిఆర్ వ్యక్తిత్వం విశిష్టమైనది. కె.వి.ఆర్. సాహిత్యకృషి, వ్యక్తిత్వానికి అద్దం పట్టే విలువైన వ్యాసాల సంకలనం ఇది. దీనిలో పి. రామకృష్ణ, భూమన్, ఎన్. వేణుగోపాల్, నల్లూరి రుక్మిణి, తంగిరాల వెంకట సుబ్బారావు, ఎన్. వేణుగోపాల్ తదితర ప్రముఖుల వ్యాసాలున్నాయి.



## మా జ్ఞాపకాల్లో కె.వి.ఆర్.


**వకుళాభరణం లలిత, రామకృష్ణ**

వెల :100/- పేజీలు: 120

ప్రతులకు: 9849083137

**వా**రి వ్యక్తిత్వాన్ని గూర్చి అనేకానేక అభిప్రాయాలూ, విమర్శలూ ఉన్నాయి. కోపిష్టి, స్నేహపాత్రుడు కాదు, ఉద్వేగి, ఏకాంతుడు– ఇలా ఎన్నో! నిజమే, వీటిలో కొంత యథార్థం లేకపోలేదు. వీటిని మించి, కె.వి.ఆర్. మరో కోణంలో స్నేహశీలి, ఆప్తుడు, జీవితమిచ్చిన సుఖాలనూ, బాధలనూ, చక్కని అభిరుచులనూ కలగలిపిన నిఖార్సయిన మనిషి! ఆయన జీవితంలో ఈ పార్శ్వాన్ని చెప్పాలని మా ఉద్దేశ్యం.

**- వకుళాభరణం లలిత, రామకృష్ణ**




## ఆటబొమ్మలు

కథా సంకలనం

మూలరచన: రవీంద్రనాథ్ టాగూర్


అనువాదం: కె.వి.ఆర్.

వెల :100/- పేజీలు: 104

ప్రతులకు: 9849083137

కె.వి.ఆర్. అనువదించిన కథా సంకలనం 'ఆటబొమ్మలు' 2020 మార్చిలో ప్రచురిస్తున్నాం. ఈ కథలను బెంగాలీ భాషలో విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ రచించారు. ఈ కథలను 'పద్మపూజ' పేరుతో 1959లో విశాలాంధ్ర ప్రచురణాలయం, 1969లో 'కార్మికస్వర్గంలో కళాప్రియుడు' పేరుతో ఎం. శేషాచలం అండ్ కో ప్రచురించాయి.

- కె.వి.ఆర్. శారదాంబ స్మారక కమిటీ



## మాతృభాష మహాత్ముడి బాట


డా॥ జి.వి. పూర్ణచంద్

వెల :50/- పేజీలు: 55

ప్రతులకు : 9440172642

డా॥ జి.వి. పూర్ణచందు భాషా చైతన్యం కలిగిన రచయిత. తెలుగు భాషా మూలాలు తవ్వి పరిశోధకులకు కావలసిన ముడిసరుకు తట్టలకెత్తి తెచ్చి అందించిన పరిశోధకుడు. భాషోద్యమ ముఖ్యులలో ఒకడు. మహాత్ముడి 150వ జయంతి ఉత్సవాలు పురస్కరించుకొని డా॥ పూర్ణచందు ఈ పుస్తకాన్ని వెలువరిస్తున్నాడు. పుస్తకంలో ఎక్కడా రచయిత కనిపించకుండా, అక్షరం అక్షరం గాంధీని మన కళ్లముందు నిలబెట్టడం ఈ పుస్తకంలో విశేషం.

- మండలి బుద్ధప్రసాద్




## పూల చాదర్ కథలు


అమ్జద్

వెల : 100/- పేజీలు: 140

ప్రతులకు: 9849787284

ఈ కథలు అనాయాసంగా చదివిస్తాయి. మన చుట్టూ ఉండేవారి బతుకు తీరుతెన్నుల్ని తెలియజేస్తాయి. మానవ స్వభావాన్ని ఆకళింపు చేసుకోవడానికి తోడ్పడతాయి. మహిళల పట్ల సంస్కారంతో ఆలోచించే రీతిని ప్రోదిచేస్తాయి. పరిస్థితుల ప్రాబల్యానికి లోనయ్యి వెతల పాలయ్యే వారిని సహృదయతతో అర్థం చేసుకోవలిసిన అవసరాన్ని గుర్తు చేస్తాయి.

- గుడిపాటి



భారత తొలి తెలుగు ప్రధాని

## కాకతీయ యుగంధర్


స్టీఫెన్ డేవిడ్ కురగంటి

వెల :100/- పేజీలు: 128

ప్రతులకు: 9490880938

సుమారు నలభై ఐదు ఏళ్ళు ఢిల్లీ సుల్తాన్‌ల దగ్గర వివిధ హోదాలను అనుభవించి ఎన్నో చారిత్రక కట్టడాలకు మార్గదర్శకులయ్యారు. ఢిల్లీ సుల్తాన్ కాలంనాటి పారశీక, అరబిక్ మూలగ్రంథాల ఆంగ్ల అనువాదం ఆధారంగా రాసిన ఈ గ్రంథం యుగంధర్‌పై తొలి ప్రామాణిక గ్రంథం.

- స్టీఫెన్ డేవిడ్ కురగంటి



కొల్లేటి కోట చారిత్రక వీరుడు

## మాల భేరుండ బద్దన్న సేనాని

బొనిగల రామారావు

వెల :80/- పేజీలు: 80

ప్రతులకు: 9963899959

బద్దన్న సేనాని గురించి విశ్వనాథ సత్యనారాయణ గారు ముందుగానే వ్రాశారు. ఆ గ్రంథం బహుశా ఇరవై ఐదు సంవత్సరాల క్రితం నేను చదివాను. 'బద్దన్న సేనాని', 'పంచమ కులస్థుడని' విశ్వనాథ వారు పరిశోధించి వ్రాశారు. దానికి నేను కృతజ్ఞుడను. కానీ ఎందుకో ఆ గ్రంథం సంపూర్ణంగా లేదని నాకు అనిపించింది. సర్వసేనాధిపతి గురించి తక్కువగా వ్రాసినట్లు అనిపించి నేను గ్రంథము వ్రాయ సంకల్పించాను.

- బొనిగల రామారావు



## శాంతా తరంగిణి

సి. రోజమ్మ

వెల : అమూల్యం, పేజీలు: 52

ప్రతులకు : 9912256565

ఇందులో పూర్ణచంద్ర ప్రభాభాసితమైన శాంతమ్మ గారి రేఖామాత్ర సాహిత్య జీవితం, వారి రచనలపై ప్రసిద్ధ భాషాచార్యుల పరిశోధన సదృశ్యంగా చేసిన మూల్యాంకనాలు, ఆత్మీయానురాగాన్ని గ్రుమ్మరిస్తూ సహ సాహితీవ్రతులు కాన్క చేసిన అభినందన కవితలు, ఆమె ప్రత్యేకతను గుర్తించి పత్రికల వాళ్ళు ముఖాముఖి నిర్వహించి ప్రచురించిన వ్యాసాలు, అనుభూతి స్మరణికలు అనదగిన సభల ఛాయాచిత్రాలు ఇందులో పొందుపరిచారు.

- డా॥ ఆశావాది ప్రకాశరావు


# స్వీకారం

## దుఃఖపోగుల నేత డాక్టర్ రాధేయ

కవితా పురస్కారం దశాబ్ది సంచిక

వెల : 30/- పేజీలు: 70

ప్రతులకు: 9492638547



**ఈ** సంకలనంలో 2010 – 19 మధ్య 10 ఏళ్ళలో పురస్కారాలు, బహుమతులు పొందిన 24 కవితలున్నాయి. ఈ కవితలన్నీ గట్టి గింజలే. 21వ శతాబ్ది రెండవ దశాబ్దపు భారతీయ సామాజిక వాస్తవికతకు ఈ కవితలు అద్దం పడుతున్నాయి. ఒక్కమాటలో ఈ కవితలన్నీ భారతీయ జీవిత పరాయీకరణకు కళాత్మక ప్రతిఫలనాలు.


**- ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

## ఈ కాలమ్ కథలు

**చలపాక ప్రకాష్**

వెల : 60/- పేజీలు: 64

ప్రతులకు: 9247475975




**స**మాజంలో అంతర్గతమైన ఆర్థిక, సాంఘిక, రాజకీయ విలువలకు సరైన రీతిలో స్పందిస్తాడు. తనదైన చెప్పే పద్ధతిలో చిన్న కథకు ప్రాణం పోస్తాడు. ఎదురైన సంఘటనకో, అనుభవానికో చిరు కథారూపం ఇస్తాడు. అలా వచ్చినవే ఈ కాలమ్ కథలు. ఇట్టే చదివేయొచ్చు. పెద్దగా సమయం పట్టదు.


**- దాట్ల దేవదానం రాజు**

## కాగితం పువ్వు

**ఆప్కారి సూర్యప్రకాశ్**

వెల : 150/- పేజీలు: 96

ప్రతులకు: 9848506964




**దా**దాపు నలభై యేడేళ్ళ (1972) క్రితం రచించి, 1981లో ప్రథమ ముద్రణగా వెలువడిన ఈ "కాగితం పువ్వు" వచన కావ్యం నేటి రెండో ముద్రణతో ఈ కావ్య ప్రాధాన్యతనీ, యినుమడించిన ప్రాసంగికతనీ స్పష్ట పరచుతున్నదనడంలో అతిశయోక్తి లేదు. ఈ "కాగితం పువ్వు' కావ్య ప్రాసంగికత నేటికిన్నీ నీటు లొలుకుతున్నదని నిస్సంశయంగా నిర్ధారణకు రావొచ్చు నిస్సందేహంగా పేర్కొనవచ్చు.

**- పి.సి. రాములు (భింసా)**

## ఆప్కారి సూర్యప్రకాశ్ కథలు

వెల :110/- పేజీలు: 112

ప్రతులకు: 9848506964




**సూ**ర్యప్రకాశ్ గారి తొలి కథల సంపుటి ఇది. కథ నడిపే విధానం రచయితకు తెలును. పాత్రల చేత పలికించే తీరులూ నేర్పుగా చూపించడం తెలుసు. కనుక, ఆయన ముందు ముందు ఇంకా ఇంకా కథలు రాస్తారు. వాటిలో, వస్తువరణంలోనూ శిల్ప కల్పనలోనూ విస్తృతి, గాఢత, వైవిధ్యం ఇంకా ఎక్కువ చూపిస్తారన్న నమ్మకం నాకు ఉంది.

**- పోరంకి దక్షిణామూర్తి**

## అమ్మకు బహుమతి కథలు

**సింహప్రసాద్**

వెల :80/- పేజీలు: 184

ప్రతులకు: 9849061668




**ఈ** సంపుటిలోని కథలన్నీ మంచినీ, మానవత్వాన్నీ పంచే కథలు, పెంచే కథలు, జీవితాలతో పెనవేసుకు పోయిన కథలు, ఆరోగ్య దాయకమైన విలువలతో కూడిన సమాజాన్ని ఆవిష్కరించమంటూ సూచించే కథలు. శ్రీ సింహప్రసాద్ గారి కథా నిర్మాణ చాతుర్యాన్ని మనకు తెలియజేయడానికి, సుమారు 400 కథలు రాసి, అందులో 76 కథలకు బహుమతులందుకొన్న కథల గణాంకాలే సాక్ష్యంగా నిలుస్తాయి.

**- ద్విభాష్యం రాజేశ్వరరావు**

## భలే మంచి రోజు

**న్యూమరిక్కులు**

**డా॥ రమణ యశస్వి**

వెల :100/- పేజీలు: 153

ప్రతులకు: 9618848470



**అ**ందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని, జీవనోత్సవంలో జీవితోత్సవం చవిచూడాలని ఈ పుస్తకానికి 'భలే మంచిరోజు' అనే పేరు పెట్టారు. ఒక సంవత్సరం పాటు వచ్చే ప్రత్యేకమైన రోజులను తీసుకొని వాటిని ఐదు పాదాల న్యూమరిక్కులలో ఇమిడ్చి ఆయా రోజుల ప్రాముఖ్యాన్ని గురించి అవగాహన కలిగించే ప్రయత్నాన్ని అద్భుతంగా, విజయవంతంగా నిర్వహించారు.

**- ఆచార్య కొలకలూరి ఇనాక్**

# ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం

## ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి

## తెలుగు భాషా సంస్కృతి - ఔన్నత్యం

ప్రభుత్వము వారు జి.ఓ.ఎమ్.ఎస్.నెం.27, తేది.06-12-2016 నందు
రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి ఏర్పాటు చేశారు.
తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నది.


### పథకాలు / కార్యక్రమాలు

- ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలు / కళాశాలల నిర్వహణ
- సర్వారాయ హరికథ పాఠశాల గ్రాంటు
- అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటి, చెన్నై గ్రాంటు
- జిల్లా సాంస్కృతిక మండళ్ళకు గ్రాంటు
- ప్రముఖ జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు
- సాంస్కృతిక అకాడమీలు
- 6,746 వృద్ధ కళాకారులకు నెలకు రూ.3,000/లు చొప్పున ఫించన్లు
- కళాకారులకు రైల్వే కన్సెషన్ మంజూరు చేయుట
- సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, సంక్రాంతిసంబరాలు, ఉగాది వేడుకలు
- ఆడిటోరియంల నిర్మాణం
- కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ
- సాంస్కృతిక సంస్థలకు ఆర్థిక సహాయం
- ప్రముఖ కవులకు, కళాకారులకు అవార్డుల ప్రధానం
- కూచిపూడి నాట్యారామం
- ఎ.పి.భవన్‌లోను, ఇతర రాష్ట్రాలలోను సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు
- ప్రముఖ వ్యక్తుల జయంతి ఉత్సవాలు
- షెడ్యూల కులాల ఉపప్రణాళిక కార్యక్రమాలు
- షెడ్యూలు తెగల ఉపప్రణాళిక కార్యక్రమాలు
- చిత్రలేఖనం
- యువ సంస్కృతి
- సాహిత్య పుస్తక ముద్రణ

ముఖ్య కార్యనిర్వహణాధికారి
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు
సంస్కృతి సమితి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
విజయవాడ

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 1 ▪ SANCHIKA - 7 ▪ KRISHNA ▪ APRIL 2020
RNI N0.APTEL/ 2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2020-22 PAGES: 68
Date of Posting : 1st & 2nd of Every Month ▪ Date of Publication: 22.04.2020


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు




పండుగలు – ప్రజాదృక్పథం
పేజీలు 48 రూ. 40/-

మనం నిత్యం జరుపుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. ఇవన్నీ మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించి– అంటే వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతిపై మానవుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుగుతుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మతనమ్మకాలు, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నిటినీ ఇలా పూర్తిగా విడదీసి చూడ్డం కూడా కష్టం. వాటిని ఏవిధంగా చూడాలి అన్న ప్రశ్నకు సమాధానం ఈ చిన్న పుస్తకం.

## ప్రతిభామూర్తులు పసిడి పలుకులు



పేజీలు 80
రూ. 65/-

వివిధ రంగాల్లో నిష్ణాతులైన కొందరి ప్రతిభా మూర్తుల ఇంటర్వ్యూల సమాహారం ఈ 'ప్రతిభా మూర్తులు – పసిడిపలుకులు' పుస్తకం.. నాట్యం, సినిమా, ఫొటోగ్రఫీ, శిల్పకళ, సాహిత్యం, మిమిక్రీ తదితర రంగాలలో వెలుగొందిన, వెలుగొందుతున్న వారి జీవిత అనుభవాల సారమంతా ఈ చిన్ని పుస్తకంలో లభ్యమవుతుంది.

## వేద సాహిత్యం
### ఒక చారిత్రక పరిశీలన




పేజీలు 32
రూ. 25/-

15 వేల ఏళ్ల సుదీర్ఘ కాల వ్యవధిలో రూపొందిన వేద వాఙ్మయపు అభివృద్ధి గతిని గురించి తెలుసుకోవాలంటే ప్రాచీన భారతీయ చరిత్రలోని తొలి ఘట్టాల వరకు వెళ్ళాలి. వీటన్నింటికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో లభిస్తుంది.

## గౌతమ బుద్ధుడు – బౌద్ధతత్వం



పేజీలు 32
రూ. 25/-

బుద్ధుడి మూల బోధనలు, సిద్ధాంతాల నుంచి తరువాత కాలంలోని బౌద్ధధర్మం ఎంత దూరంగా మళ్ళిందో నిర్ధా రించడానికి ఈ పుస్తకంలో అనేక ఉదాహరణలు పేర్కొనబడ్డాయి.

బౌద్ధతత్వంలోని ప్రయోజనకరమైన అంశాలను అధ్యయనం చేయడం, అదేవిధంగా బౌద్ధధర్మం చరిత్రకు సంబంధించిన మరుగునపడ్డ అసలు వాస్తవాలను వెలికితీసి గౌతమ బుద్ధుని మూల సిద్ధాంతాల సారాంశం వివరించడమే ఈ పుస్తకం ఉద్దేశం.

## భారతీయ భౌతికవాదం
## లోకాయత



పేజీలు 32
రూ. 25/-

భారతీయ భౌతికవాదం మొదటినుంచి ఆధునికయుగం వరకు ప్రపంచంలో అన్నిచోట్లలాగే భారతదేశంలోనూ భౌతికవాద భావస్రవంతి కొనసాగుతూనే వచ్చిందని బలమైన ఆధారాలతో ఋజువు అయ్యింది. అటువంటి భౌతికవాద భావస్రవంతిలో ఒకటైన లోకాయత గురించి వివరించేదే ఈ పుస్తకం.

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ – 2, ఫోన్ : 0866 – 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059**